జిల్లాలో సహకార శాఖలో విచిత్ర పరిస్థితి నెలకొంది. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల తీరు అందుకు కారణంగా కనిపిస్తోంది. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జిల్లాకు చెందిన అధికార పార్టీ కీలక ప్రజాప్రతినిధుల సూచనలకు విరుద్ధంగానే సహకారశాఖ ఉన్నతాధికారులు, జిల్లాలో ఆ శాఖ అధికారులు వ్యవహరిస్తూ వచ్చారు. ఏడాది దాటిపోయినా పరిస్థితిలో మార్పు లేదు. పైగా ప్రస్తుతం జిల్లాలోని మొత్తం సహకార వ్యవస్థను పర్యవేక్షించే జిల్లా సహకార అధికారి (డీసీవో) కార్యాలయ సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు అందడం లేదు. ఈనెల కూడా వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. అందుకు రాష్ట్ర సహకారశాఖ ఉన్నతాధికారి వైఖరే కారణంగా ఆ వర్గాల్లో చర్చ సాగుతుండగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)పై సెక్షన్ 51 విచారణ విషయంలో వారు తీసుకున్న నిర్ణయంపై కూడా ఇలాంటి చర్చే నడుస్తోంది.



సహకార శాఖలో విచిత్రం

మూడు నెలలుగా జీతాలు అందక జిల్లా కార్యాలయ ఉద్యోగులు గగ్గోలు

ఇన్‌చార్జి డీసీవోగా ఇందిరాదేవిని నియమించిన కలెక్టర్

90 రోజులైనా ధ్రువీకరించని ఉన్నతాధికారులు

ఉద్యోగుల వేతనాలు, ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించే అధికారం దక్కని డీసీవో

డీసీసీబీపై సెక్షన్ 51 విచారణపైనా ఇలాగే శాఖ ఉన్నతాధికారుల వైఖరి

జిల్లా కీలక నేతలు వద్దన్న అధికారినే విచారణాధికారిగా నియామకం

చక్రం తప్పిన బ్యాంకు ఉద్యోగులు

అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకని వెల్లువెత్తుతున్న విమర్శలు

ఉమ్మడి జిల్లా మంత్రుల దృష్టికి వ్యవహారం

ఒంగోలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో సహకారశాఖ అధికారులుగా ఉన్న వారి నుంచి అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు పూర్తి సహాయ నిరాకరణ సాగింది. అనేక అంశాలలో ఇతర శాఖల అధికారుల విధానానికి విరుద్ధంగా ఆ శాఖ అధికారులు వ్యవహరిస్తూ వచ్చారు. వైసీపీ పాలనలో హవా నడిపిన వారి సూచనలకు అనుగుణంగానే వారు అలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉండగా డీసీవోగా ఉన్న శ్రీనివాసరెడ్డి కొన్ని అంశాల్లో కలెక్టర్‌ను సైతం తప్పుదారి పట్టించారన్న ప్రచారం సాగింది. ప్రధానంగా డీసీసీబీపై విచారణ ఆ బ్యాంకు సీఈవో మార్పు, పొగాకు సమాఖ్య పీఐసీ నియామకం మరికొన్నింటిలో అలా సాగాయన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మరికొంత మంది అధికార పార్టీ నేతలు ఇక్కడి అధికారుల తీరును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆ శాఖమంత్రి అచ్చెన్నాయుడుకే కాక సీఎం దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో మార్చి ఆఖరులో డీసీవో

మిగతా 6లో...

కలెక్టర్ సిఫార్సుపై స్పందన కరువు

సాధారణంగా ఇలాంటి సమయంలో కలెక్టర్ సిఫార్సును తక్షణం ఆమోదించి మరొక అధికారిని ఆ స్థానంలో నియమించడం లేదా స్థానికంగా ఉన్నతాధికారిని ఇన్‌చార్జిగా నియమించుకోవాలని కలెక్టర్‌కు సూచించాలి. అలా నియమితులైన వారిని ఉన్నతాధికారులు ధ్రువీకరించి అన్ని శాఖపరమైన అంశాలను వారు నిర్వర్తించేలా చేస్తారు. అయితే డీసీవో శ్రీనివాసరెడ్డిని సరెండర్ చేస్తూ మార్చి ఆఖరులో కమిషనరేట్‌కు నివేదిక పంపినా పక్షంరోజుల పాటు ఎలాంటి సూచనలూ ఉన్నతాధికారుల నుంచి జిల్లా యంత్రాంగానికి అందలేదు. దీంతో జిల్లాలో ఆశాఖ పర్యవేక్షణ కుంటుపడకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయంగా ఇక్కడి డీసీసీబీలో ఓఎస్‌డీగా కొనసాగుతున్న డీఎల్‌సీవో హోదా కలిగిన ఇందిరాదేవిని ఇన్‌చార్జి డీసీవోగా కలెక్టర్ నియమించారు. ఆ కేడర్‌లో ఒంగోలులో ఇద్దరు, మార్కాపురంలో ఒకరు మాత్రమే అప్పటికి ఉండగా మార్కాపురంలో ఉన్న డీఎల్‌సీవో రోజూ ఒంగోలు రావడం కష్టసాధ్యం. ఒంగోలులో ఆ కేడర్‌లోని జిల్లా సహకార ఆడిట్ అధికారి(డీఎల్‌సీవో)గా ఉన్న అధికారిపై పలు ఫిర్యాదులు ఉండటంతోపాటు అప్పటికే ఆయన ఒంగోలు డీఎల్‌సీవోగా ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నారు. దీంతో ఇందిరాదేవిని ఇన్‌చార్జి డీసీవోగా కలెక్టర్ నియమించినట్లు సమాచారం. ఈ నియామకం ఉన్నతాధికారులకు రుచించలేదని సహకార వర్గాల్లో అప్పట్లోనే చర్చ సాగింది. అందుకు ఉన్నతాధికారుల వైఖరి ఊతమిస్తోంది.

జీరో అడ్మిషన్లు

- 89 బడుల్లో ఒక్కరూ చేరలేదు
- 138 పాఠశాలల్లో ఒక్కొక్కరే
- 900 చోట్ల ఏడుగురులోపే



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పడిపోతున్నాయి. ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలోని 89 బడుల్లో 1వ తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదంటేనే పరిస్థితి ఎంత ఆందోళన కరంగా ఉందో అర్థమవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్లను పరిశీలిస్తే వాటి మనుగడకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. సుమారు వెయ్యికిపైగా పాఠశాలల్లో ఏడుగురు కంటే తక్కువ మంది విద్యార్థులు ఈ ఏడాది చేరారు. పాఠశాల విద్యకు ప్రాథమిక పాఠశాలలు పునాది రాళ్లు వంటివి. అవి బలహీనపడి అడ్మిషన్లు నిలిచిపోతే ఆ తర్వాత ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు పేకమేడల్లా కూలిపోతాయి. ఇప్పటికీ కొంత బలంగా ఉన్నప్పటికీ భవిష్యత్‌లో వీటికి కూడా ముప్పువాటిల్లే పరిస్థితి పొంచి ఉంది.


ఒంగోలు విద్య, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 89 ప్రభుత్వ మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. జూన్ ఆఖరు నాటికి జిల్లాలో 245 ప్రాథమిక పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు ఉన్నాయి. ఈ విషయాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రస్తావించి హెచ్చరికలు జారీచేయడంతో క్షేత్రస్థాయిలో అధికారుల్లో కదలిక వచ్చింది. వెంటనే హెచ్‌ఎంలతో సమావేశాలు నిర్వహించి అడ్మిషన్లు పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారుల వత్తిడికి తలొగ్గిన హెచ్‌ఎంలు ఒకరిద్దరు పిల్లలను చేర్చి మమ అనిపించారు. ప్రస్తుతం జీరో అడ్మిషన్ల

మిగతా 6లో...

జీరో అడ్మిషన్ల స్కూళ్లు ఇవీ

జీరో అడ్మిషన్ స్కూళ్లలో జిల్లాలోని హనుమంతునిపాడు మండలం ప్రథమ స్థానంలో ఉంది. ఈ మండలంలో ఏకంగా పది పాఠశాలల్లో ఒక్కరు కూడా చేరలేదు. సీఎస్‌పురం మండలంలో ఐదు, బీపేట మండలంలో ఒకటి, చీమకుర్తిలో రెండు, దర్శిలో ఒకటి, దొనకొండ ఒకటి, గిద్దలూరులో మూడు, కనిగిరిలో ఐదు, కొమరోలులో 8, కొనకనమిట్లలో 5, కొండపిలో 2, కురిచేడులో 2, మద్దిపాడు 1, మార్కాపురం 4, నాగులుప్పలపాడులో 1, ఒంగోలు 3, పామూరులో 7, పొదిలిలో 1, పొన్నలూరులో 5, పుల్లలచెరువులో 2, రాచర్లలో 5, సింగరాయకొండలో 1, టంగుటూరులో 3, త్రిపురాంతకంలో 1, వెలిగండ్లలో 4, జరుగుమల్లి మండలంలో నాలుగు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్కరు కూడా చేరలేదు.

సార్వత్రిక సమ్మె నేడే



- జిల్లాలో పాల్గొననున్న 30వేల మందికిపైగా కార్మికులు
- ఒంగోలులో ర్యాలీకి సన్నాహాలు
- వివిధ సమస్యల పరిష్కారమే అజెండాగా సమ్మె

ఒంగోలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు బుధవారం దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ కార్మికవర్గంపై దాడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో సార్వత్రిక సమ్మెకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా గత పక్షంరోజులుగా సమ్మెను విజయవంతంచేసేందుకు కార్మికులు, వివిధ వర్గాలప్రజలతో పాటు వివిధ రంగాల్లోని కార్మికవర్గాన్ని సమాయత్తంచేయడంతో పాటు జిల్లా

మిగతా 6లో...

ఒక్క రోజులో.. 750 ఎకరాల్లో..

పండ్ల మొక్కల పెంపకం మొదలు

పండుగలా సాగిన కార్యక్రమం

పలుచోట్ల కీలక ప్రజాప్రతినిధులు హాజరు

ఉపాధి ద్వారా ఉద్యాన తోటలకు ప్రోత్సాహం



మార్కాపురం మండలం జమ్మనపల్లిలోని పొలంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఒంగోలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒక్క రోజులో 750 ఎకరాలలో పండ్ల మొక్కలు నాటారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగింది. పండ్లతోటలు ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు దృష్టి పెట్టిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి పథకం అనుసంధానంతో పెద్దఎత్తున ఈ ఏడాది పంట్లతోటల పెంపకం చేపట్టాలని నిర్ణయించింది. తదనుగుణంగా భారీ లక్ష్యాన్ని జిల్లాల వారీగా నిర్ణయించగా జిల్లాలో ఈ ఏడాది 61,500 ఎకరాల విస్తీర్ణంలో పండ్లతోటలు పెంపకం చేయాలంని లక్ష్యంగా నిర్దేశించారు. అందులో తైవాన్ జామ, కరేడు, డ్రాగన్, ఆపిల్, చింత, అంజీర, మామిడి, బత్తాయి తదితర రకాలు ఉన్నాయి. ఈ పథకాన్ని పెద్దఎత్తున ప్రచారం కూడా చేసే క్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం ఒక్క రోజే 25వేల ఎకరాలలో పండ్లమొక్కలు నాటించాలని, ఆ కార్యక్రమాల్లో కీలక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తదనుగుణంగా జిల్లాలో మంగళవారం 750 ఎకరాలలో పండ్లతోటల కార్యక్రమాన్ని డ్వామా, ఉద్యానశాఖ అధికారులు చేపట్టారు. కొత్తపట్నం మండల కేంద్రంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

మిగతా 6లో...

వక్ఫ్ భూముల్లో ఆక్రమణల తొలగింపు

- అడ్డుకునేందుకు పలువురి యత్నం
- ఇంటి స్థలాలు లేకపోతే వేరేచోట ఇస్తామని అధికారుల హామీ

పొదిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు వక్ఫ్ భూముల్లో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాలు, ఉన్నతాధికారుల సూచనతో మంగళవారం కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో రెవెన్యూ, పోలీస్, వక్ఫ్, నగర పంచాయతీ అధికారులు సంయుక్తంగా ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణల తొలగింపునకు పూనుకున్నారు. అక్కడ గుడిసెలు వేసుకొని నివాసముంటున్న కొందరు తొలగింపు చర్యలను అడ్డుకున్నారు. తమకు ఎక్కడా ఇంటి స్థలాలు లేవని, గుడిసెలు తొలగిస్తే ఎక్కడ ఉండాలని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ కృష్ణారెడ్డి ఆధార్ కార్డులు తీసుకురావాలని, ఇంటి స్థలం లేకపోతే వెంటనే కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయినా కట్టడాలను తొలగించేందుకు ససేమిరా అంటూ కొందరు మహిళలు ఎక్స్‌కవేటర్ల ముందు నిల్చొని అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు నేరమని, వాటిని తొలగించాలని ఎన్నో రోజులుగా చెప్తున్నా మార్పు రాకపోవడంతో కూల్చివేత చర్యలు

మిగతా 6లో...



వక్ఫ్ భూముల్లో అక్రమ కట్టడాలు తొలగిస్తున్న అధికారులు

ఆగని దందా

- తర్లుపాడు మండలంలో వసూళ్లు
- డబ్బులివ్వాలని ఇద్దరు కార్యదర్శులకు హుకుం
- మరో పంచాయతీలో రికార్డులు స్వాధీనం

మార్కాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎవరేమి అనుకుంటే నాకేంటి.. సిగ్గు అనుకున్నాడో ఏమో ఓ డివిజన్‌స్థాయి అధికారి బరితెగించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇప్పటికే ఆయనపై పలు ఫిర్యాదులు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయి. అయినా తీరు మార్చుకోవడంలేదు. గతంలో వైసీపీ హయాంలో చేసిన అవినీతిని నేటికీ కొనసాగిస్తున్నారు. అప్పట్లో జిల్లా స్థాయి అధికారిగా ఉండి లెక్కకు మిక్కిలి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అయినా కీలకమైన నాయకుల అండదండలు, సామాజికవర్గం తోడ్పాటుతో ఎలాంటి విచారణలు ఎదుర్కోకుండానే అవినీతి దందా కొనసాగించారు. పంచాయతీల నిధులను కొల్లగొట్టారు. చివరికి సార్వత్రిక ఎన్నికల్లో బరితెగించి మరీ పార్టీ కార్యకర్తలా వైసీపీకి

మిగతా 6లో...

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

- 306 మందికి అపరాధ రుసుం రూ.8.50 లక్షలు విధింపు
- 11 మంది అధికారులు, 84 మంది సిబ్బంది 31బృందాలుగా దాడులు

7

తాగునీటి కోసం ఆందోళన

ఖాళీ బిందెలు, డ్రమ్ములతో రోడ్డుపై మహిళల బైఠాయింపు

తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమార్తె

- ఐదు గంటల్లో గుర్తించిన పోలీసులు
- కుటుంబసభ్యులకు అప్పగింత

నాగులుప్పలపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి అదృశ్యమైన బాలికను నాగులుప్పలపాడు పోలీసులు ఐదు గంటల్లో గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బి.నిడమానూరు గ్రామానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికను ఆమె తల్లి సోమవారం రాత్రి మందలించారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున సదరు బాలిక ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా కుమార్తె ఆచూకీ కనిపించకపోవడంతో ఉదయం 8 గంటలకు ఎస్‌ఐ రజియాసుల్తానా దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఎస్‌ఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సదరు బాలిక ఒంగోలు వెళ్లే బస్సు ఎక్కినట్లుగా తెలుసుకొని పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆమె ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించిన ఎస్‌ఐ కేవలం ఐదు గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రజియాసుల్తానా, పోలీసు సిబ్బందిని ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

రేషన్ దుకాణం సీజ్

- తరచూ ఫిర్యాదులపై అధికారులు దాడులు
- 300 కిలోల బియ్యం, 57 పంచదార ప్యాకెట్స్ అధికంగా ఉన్నట్లు గుర్తింపు


సరుకులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీ

చీరాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణ రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దుడ్డు ప్రభాకరరావుకు చెందిన షాపు నెం.38ను మంగళవారం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు సీజ్ చేశారు. ఆ షాపుపై నిత్యం ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు చేశారు. దీంతో ఉండాల్సిన సరుకు కంటే 300 కిలోల బియ్యం, 57 ప్యాకెట్స్ పంచదార అధికంగా ఉన్నట్లు గుర్తించారు. రేషన్‌డీలర్లు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని, భిన్నంగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఆర్‌డీవో హెచ్చరించారు. అధికారులు వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతారాణి తదితరులు ఉన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల దాడులు

- 3,232 సర్వీసులు తనిఖీలు


మాట్లాడుతున్న అధికారులు

వేటపాలెం(చీరాల), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. 36 బృందాలుగా ఏర్పడి, 3,232 సర్వీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 66 మందికి రూ.2.35 లక్షలు అపరాధ రుసుం విధించారు. విద్యుత్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఆంజనేయులు, విజిలెన్స్ డీఈ భాస్కర్, ఏడీ విజయ, డీఈ థామస్, వేటపాలెం ఏడీ శ్రీనివాసరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ భూములకు పెరిగిన కౌలు వేలం

బల్లికురవ. జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం, సూరేపల్లి గ్రామాలలోని మూడు దేవాలయాలకు మంగళవారం బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. గతం కంటే రెండు రెట్ల కౌలు ధర పెరిగిందని దేవదాయ శాఖ ఈవో కృష్ణారెడ్డి తెలిపారు, సోమేశ్వరస్వామికి చెందిన 5.60 సెంట్ల భూములకు గతంలో రూ. 17 వేలు కౌలుఉండగా ఇప్పుడు రూ.56 వేలకు రైతులు వేలంలో భూములను దక్కించుకొన్నారు. అలానే సూరేపల్లి గ్రామంలో వినాయక దేవాలయానికి చెందిన 1.75 సెంట్ల భూమికి గతంలో కౌలు రూ.8 వేలు ఉండగా ఇప్పుడు రూ.29 వేలకు రైతులు కౌలు వేలం పాట పాడారు. ముక్తిలింగేశ్వర స్వామి దేవాలయానికి చెందిన 2. 50 ఎకరాలకు గతంలో రూ.6 వేలు వేలం ఉండగా ఇప్పుడు రూ.7 వేలకు రైతులు పాట పాడారు. ఏడాది కాలానికి ఈ పాట అమలులో ఉంటుందని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు.

దంచి కొట్టిన వాన



ఒంగోలు నగరంలో మంగళవారం రాత్రి వర్షం దంచి కొట్టింది. దాదాపు గంటన్నర సేపు విడవకుండా కురిసింది. దీంతోకాలువలు పొంగిప్రవహించాయి. జిల్లా అంతటా వర్షం కురిసింది. -ఆంధ్రజ్యోతి, ఒంగోలు

కలెక్టర్ బంగ్లా రోడ్డులో కూలిన భారీ చెట్టు

- తప్పిన పెనుప్రమాదం
- పాక్షికంగా దెబ్బతిన్న ఆటో

ఒంగోలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాల రాకపోకలు జరిగిన స్థానిక కలెక్టర్ బంగ్లా వద్ద మంగళవారం మధ్యాహ్న సమయంలో పెద్దచెట్టు రోడ్డుపై పడిపోయింది. సాధారణంగా ఆ రోడ్డులో నిరంతరం ఆర్టీసీ బస్సులు, ఆటోలు, కారులు, ద్విచక్రవాహనాలు, పాదచారులతో రద్దీగా ఉంటుంది. ఆ చెట్ల కింద యాచకులు కూడా ఉంటుంటారు. అయితే ఒక్కసారిగా ఆ చెట్టు కిందపడిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ఓ ఆటో రైల్వే స్టేషన్ నుంచి కలెక్టరేట్ వైపు వస్తుండగా దాని చెట్టు పడటంతో ఆద్దాలు పగిలిపోయాయి. ఆటోలో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.


చెట్టు విరిగి రోడ్డుపై పడడంతో దెబ్బతిన్న ఆటో

కాగా పడి పోయిన చెట్టును వెంటనే అక్కడి నుంచి తొలగించే ప్రక్రియను చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

సహకారశాఖలో విచిత్రం

(5వపేజీ తరువాయి)
శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వానికి కలెక్టర్ సరెండర్ చేశారు. ఆ చర్య సహకారశాఖ ఉన్నతాధికారులకు మింగుడు పడలేదు.

ఇన్‌చార్జి డీసీవో ధ్రువీకరణ

శ్రీనివాసరెడ్డిని సరెండర్ చేస్తూ కలెక్టర్ నివేదించినప్పుడే మరొకరిని నియమించాల్సిన ఉన్నతాధికారులు అలా చేయకపోగా ఇందిరాదేవి నియామకాన్ని మూడు నెలలు అయినా ధ్రువీకరించలేదు. దాంతో కలెక్టర్ అదేశాలతో ఇన్‌చార్జి డీసీవోగా బాధ్యతలు స్వీకరించిన ఇందిరాదేవి రోజూ కార్యాలయానికి వెళ్లి అవసరమైన ఫైళ్లు చూడటం తప్ప ఉద్యోగుల జీతాలతో సహా ఎలాంటి ఆర్థికపరమైన బిల్లులు, ఇతరత్రా వ్యవహారాల్లో సంతకం చేసే అవకాశం లేదు. ఉన్నతాధికారులు ఆమెను ఇన్‌చార్జి డీసీవోగా ధ్రువీకరించి సీఎఫ్‌ఎంఎస్‌లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల శాఖ అధికారులతో కలిసి ఉండే లాగిన్‌లో ఆమె పేరు చేర్చకపోవడమే కారణం. దాంతో తొలి నెలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఉద్యోగుల వేతనాలు నిలిచిపోయాయి. విషయాన్ని తర్వాత గుర్తించిన ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయి అధికారుల లాగిన్ నుంచి ఒంగోలు డీసీవోను తొలగించి ఇతర జిల్లాలకు ఇబ్బంది లేకుండా చేశారు తప్ప ఇక్కడి ఇన్‌చార్జి డీసీవోని ధ్రువీకరించి చేర్చే ప్రయత్నం చేయలేదు. తర్వాత ఇతర జిల్లాల వారికి జీతాలు వచ్చినా ఇక్కడి డీసీవో కార్యాలయం వారికి మాత్రం నేటికి రాలేదు. ఇదే సమయంలో అనారోగ్య కారణాలతో తాను రెండు బాధ్యతల్లో పనిచేయడం కష్టంగా ఉందని తనను ఇన్‌చార్జి డీసీవో బాధ్యతలను తొలగించాలని ఇందిరాదేవి అటు ప్రభుత్వ ఉన్నతాధికారులను, ఇటు కలెక్టర్‌ను లిఖితపూర్వకంగా కోరారు. దీనిపై కూడా స్పందన లేదు. ఈ పరిస్థితితో డీసీవో కార్యాలయ ఉద్యోగుల జీతాలు, ఇతర బిల్లులు నిలిచిపోయాయి.

మంత్రుల దృష్టికి జీతాల సమస్య

సహకారశాఖ ఉద్యోగులకు ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలలు జీతాలు ఆగిపోగా జూలై కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదని తెలుస్తోంది. ఈ విషయాన్ని గతంలో ఒకటికి రెండుసార్లు ఆ శాఖ ఉద్యోగ సంఘ నాయకులు ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఇన్‌చార్జి డీసీవో నియామకం చేసింది కలెక్టర్ కదా అక్కడ అడగండని కఠినంగా చెప్పినట్లు సమాచారం. ఇన్‌చార్జి బాధ్యతలు ఇక్కడ పాలన సౌలభ్యం కోసం ఇవ్వడం తప్ప ఆర్థిక అంశాల విషయం కలెక్టర్‌కు సంబంధం లేదన్నది పాలన విధానం తెలిసిన వారందరికి ఎరుకే. దీంతో తమకు జీతాలు రాక అవస్థలు పడుతున్న డీసీవో కార్యాలయ ఉద్యోగులు మూడు నెలలుగా ఎదురుచూసి చివరకు ఉమ్మడి జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామిల దృష్టికి మంగళవారం తీసుకెళ్లినట్లు తెలిసింది. కీలక వ్యక్తులు ఎలా పరిష్కారం చేస్తారన్న దానిపై వారి జీతాలు ఆదారపడి ఉన్నాయి.

విచారణపైనా మీనమేషాలు

డీసీసీబీపై విచారణలోనూ ఉన్నతాధికారుల వైఖరి అలాగే ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ పాలనలో డీసీసీబీలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని జిల్లా టీడీపీ కీలక ప్రజాప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకెళ్ళడంతో గతేడాది నవంబరు తొలివారంలో అప్పుడు ఎఫ్ఎస్‌వోగా ఉన్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని కలెక్టర్ నియమించారు. ఆ కమిటీ విచారించి భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు నిర్ధారించింది. ఆ నివేదికను ఉన్నతాధికారులకు కలెక్టర్ నివేదిస్తూ బ్యాంకులో అక్రమాలను మరింత లోతుగా పరిశీలించేందుకు సెక్షన్ 51 విచారణ చేయించాలని సిఫార్సు చేశారు. తదనుగుణ చర్యలపైనా ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తూనే ఉండగా మరోసారి జిల్లా ప్రజాప్రతినిధుల జోక్యంతో ఎట్టకేలకు నాలుగైదు నెలల క్రితం సెక్షన్ 51 విచారణకు ఆదేశించారు. అయితే ఆ విచారణ హేతుబద్ధంగా, నిజాయితీగా జరిపేందుకు వీలుగా పల్నాడు జిల్లాలో డీసీఎల్‌వో హోదాలో పనిచేస్తున్న ఒక అధికారి పేరును జిల్లా నేతలు సిఫార్సు చేశారు. ఆ శాఖ ఉన్నతాధికారులు దానిని పట్టించుకోకుండా జిల్లా స్థాయిలో విచారణాధికారిని నియమించుకోవాలని అవసరమైతే కమిషనరేట్‌లో ఉన్న గౌరీశంకర్ అనే అధికారి సేవలను వాడుకోవాలని కలెక్టర్‌కు సూచిస్తూ లేఖ రాశారు.

అలా వదిలేశారు..

ఆ స్థాయిలో సహకార శాఖ అధికారుల తీరుపై అప్పటికే తీవ్ర అసంతృప్తి ఉండటంతో స్థానికంగా విచారణాధికారిని కలెక్టర్ నియామకం చేయలేదు. అదే సమయంలో ఉన్నతాధికారుల సూచించిన గౌరీశంకర్ పేరును జిల్లా నేతలు వ్యతిరేకిస్తూ ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ కూడా ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మూడు మాసాలకుపైగా ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా వదిలేశారు. ఈలోపు అసెంబ్లీలో అన్ని జిల్లాల డీసీసీబీల తీరుపై చర్చ జరిగి సభా సంఘం కూడా ఏర్పాటు చేశారు. ఆవిషయం అలా ఉంచితే శాఖపరంగా నిర్వహించాల్సిన సెక్షన్ 51 విచారణపై మూడు నాలుగు మాసాలు గుంభనంగా ఉన్న ఉన్నతాధికారులు పది రోజుల క్రితం తొలుత వారు సూచించిన గౌరీశంకర్‌ను విచారణాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ విషయంలో డీసీసీబీలో అవకతవకలకు, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న కొందరు ఉద్యోగులు చక్రం తిప్పినట్లు సమాచారం. గత నెలలో కొందరు అలాంటి వారు సహకారశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసిన అనంతరం ఉన్నతాధికారులు ఈ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలుస్తుంది. డీసీసీబీలో జరిగిన అవినీతి, అక్రమాలు వెలుగులోకి రాకుండా చూసే చర్యలలో భాగంగానే ఇలా జరిగిందన్న చర్చ ప్రస్తుతం సహకార వర్గాల్లో సాగుతోంది. ఈవిషయం కూడా మంత్రులు, ప్రజాప్రతినిధుల దృష్టికి వెళ్లింది.

సార్వత్రిక సమ్మె నేడే

(5వపేజీ తరువాయి)
వ్యాప్తంగా ఎక్కడిక్కడ నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నారు. కేంద్ర కార్మిక సంఘాలైన సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ తదితర సంఘాలన్ని ఈ సమ్మెలో పాల్గొంటుండగా అన్ని వామపక్ష పార్టీలు కార్మిక సంఘాలకు మద్దతు ప్రకటించాయి. ప్రధానంగా కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, ఈక్రమలో నమోదైన అసంఘటిత కార్మికులందరికి బడ్జెట్ నిధులతో సామాజిక భద్రత కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని,అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టీకరణ నిలిపివేయాలని, రాష్ట్రంలో లేబర్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ముఠా, రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని తదితర డిమాండ్లతో ఈ సార్వత్రిక సమ్మెను చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు సుమారు 30వేలమందికిపైగా సమ్మెలో పాల్గొనున్నారు. సమ్మెను విజయవంతం చేయాలని విస్తృత ప్రచారాలతో పాటు కరపత్రాల పంపిణీ, మోటార్ సైకిల్‌ర్యాలీలు వంటివి నిర్వహించారు. మరో వైపు కార్మికులు ఎక్కువగా ఉండే ఒంగోలు, చీమకుర్తిలపై ఆయా కార్మిక సంఘాల నాయకులు ప్రత్యేక దృష్టి సారించి ఆయా ప్రాంతాల్లో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒంగోలులో బుధవారం ఉదయం 9గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి పాత మార్కెట్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీని ఏర్పాటు చేశారు. ఈ ర్యాలీ అనంతరం కలెక్టరేట్ ఎదుట సభను ఏర్పాటు చేశారు. సమ్మెకు మద్దతుగా ఇప్పటికే వామపక్ష పార్టీల నాయకులు మద్దతు ప్రకటించి పూర్తిస్థాయిలో సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు శ్రీకారం చుట్టారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చేపట్టే ఈ సమ్మెలో పలు ఉద్యోగ సంఘాలు కూడా సంఘీభావం ప్రకటించాయి.

ఆగని దందా

(5వపేజీ తరువాయి)
అనుకూలంగా పని చేశారు. దీంతో పలు కేసుల్లో కూడా ఇరుక్కుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఆ అధికారిని సస్పెన్షన్‌తో పక్కనబెట్టారు. కానీ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో ఉన్న పరిచయాల నేపథ్యంలో మార్కాపురం పోస్టింగ్ వేయించుకున్నారు. నాలుగు నెలల్లో రిటైరవుతున్నందున ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. అయినా ఆ అధికారి మార్పు చెందలేదు. పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యక్ష నరకం చూపుతూ గత రెండు నెలలుగా కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు.

జిల్లా అధికారులు వారించినా తగ్గేదేలే

తమపై ఒత్తిడి తెచ్చి అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు పలువురు పంచాయతీ కార్యదర్శులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ శాఖకు చెందిన ఉద్యోగుల సామాజిక మాధ్యమాల్లో కూడా విస్తృతంగా ప్రచారం జరిగింది. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారి ఈపాటికే పలుమార్లు హెచ్చరించారు. అయినా ఆ అధికారిలో మార్పు రాలేదు. తాజాగా తర్లుపాడు మండలంలోని పలు పంచాయతీల్లో తనిఖీల పేరుతో విస్తృతంగా పర్యటించారు.

కొనకనమిట్ల మండలంవైపు ఉండే ఓ పంచాయతీకి వెళ్లి మహిళా కార్యదర్శి దగ్గర రూ.5వేలు డిమాండ్ చేశారు. సమీపంలోని మరో పంచాయతీకి అధికారి వెళ్లారు. అక్కడ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో రికార్డులు మొత్తం తీసుకుని మార్కాపురం వచ్చారు. కార్యాలయంలో అందుబాటులో లేనందున రూ.15వేలు తీసుకుని డివిజన్ కార్యాలయానికి రావాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయానికి వెళ్లడంతో అక్కడ ఇన్‌చార్జి కార్యదర్శి ఉన్నారు.

'ఏమి చేస్తావో ఏమో నాకు తెలియదు రూ.20వేలు తనకు ఇవ్వాలి' అని ఆ అధికారి పట్టుబట్టారు. తాను రెగ్యులర్ ఉద్యోగిని కాదని, ఇక్కడ పనిచేసే కార్యదర్శి సెలవులో ఉండడంతో తాను ఇన్‌చార్జిగా ఉన్నానని చెప్పినా ససేమిరా అన్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ కార్యదర్శి ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలిపినట్లు సమాచారం.

జీరో అడ్మిషన్లు

(5వపేజీ తరువాయి)
పాఠశాలల సంఖ్య 89కి తగ్గింది. ఇప్పటివరకు అందించిన సమాచారం మేరకు 138 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి, 168 పాఠశాలల్లో ఇద్దరు, 91 పాఠశాలల్లో ముగ్గురు, 227 పాఠశాలల్లో నలుగురు, 145 పాఠశాలల్లో ఐదుగురు, 120 పాఠశాలల్లో ఏడుగురు మాత్రమే చేరారు.

టీచర్ల బదిలీలు ముఖ్య కారణం

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం నాటికి టీచర్లందరూ బదిలీల సందడిలో మునిగిపోవడంతో అడ్మిషన్లపై దృష్టి పెట్టలేకపోయారు. పాఠశాలల పునఃప్రారంభం నుంచి టీచర్లు బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరుకావడతో పిల్లల చేరికలను పట్టించుకోలేకపోయారు. దీనికితోడు ఏ పాఠశాలలో ఏ టీచర్ ఉంటారో ఎవరు బదిలీ అవుతారో తెలియని పరిస్థితి. కొందరు తప్పనిసరిగా బదిలీ కావాల్సినవారు ఉన్నప్పటికీ వారు బదిలీపై కొత్తగా వచ్చేవారు చూసుకుంటారులే అన్న ధీమాతో వారు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

750 ఎకరాల్లో.. ఒక్కరోజులో..

(5వపేజీ తరువాయి)
జనార్దన్, ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి కొబ్బరి మొక్కలు నాటగా సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మద్దిపాడు మండలం నాగన్నపాలెంలో డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలు నాటారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం మండలం జమ్మనపల్లిలో పండ్లమొక్కలు నాటగా గిద్దలూరు మండలం కొత్తకోటలో అక్కడి ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి మొక్కలు నాటారు. దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ దొనకొండ మండలం మల్లంపేటలో ఈ కార్యక్రమంలో పాల్గొనగా వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పుల్లలచెరువు మండలం పిడికిటివానిపల్లిలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో స్థానిక డ్వామా, ఉద్యానవన అధికారుల నేతృత్వంలో పండ్లతోటల కార్యక్రమం కొనసాగింది.

వక్ఫ్ భూముల్లో ఆక్రమణల తొలగింపు

(5వపేజీ తరువాయి)
చేపట్టామని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో కొందరు తామే స్వయంగా తొలగించుకుంటామని, అందుకు సమయం ఇవ్వాలని అధికారులను కోరారు. నోటీసులు ఇచ్చి నెల దాటినా మీరు తొలగించుకోలేదన్నారు. ఈక్రమంలో కొన్ని ఇళ్లను, మరి కొన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెలను తొలగించారు. వీటిలో ఆరు గృహాలపై కోర్టుస్టే ఉండడంతో వాటి తొలగింపుపై తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. వక్ఫ్‌బోర్డ్ సూపరింటెండెంట్ మమ్మద్ హస్సేన్, ఇన్‌స్పెక్టర్ అహమ్మద్‌బాషా, నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు వేమన, ప్రభాకర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏడీఏ హరిబాబు, ఆర్ అండ్‌బీ ఏఈ శ్రవంతి, పొదిలి, కొనకనమిట్ల పోలీస్ సిబ్బంది, నగరపంచాయతీ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌ను వినియోగించుకోవాలి

అవీఇవీ

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు


మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సౌర విద్యుత్ వినియోగం, మిగులు ఆదాయానికి మార్గమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. ఎర్రగొండపాలెంలో మంగళవారం జరిగిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.సోలార్ పలకల ఏర్పాటుకు రూ.2,22,222లక్షలు ఖర్చు అవుతుందని, దానికి రూ.7,800 ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. సోలార్ రూఫ్‌టాప్‌కు అయ్యే నికర ఖర్చు రూ.144,222 లక్షలు, మార్జిన్ అమౌంట్ రూ.22,222, బ్యాంకు రుణం రూ.1,22000 అని తెలిపారు. ఈ పథకం కింద బ్యాంకు తక్కువ వడ్డీకే రుణం ఇస్తుందని, విద్యుత్ బిల్లులు చెల్లించనవసరం కూడా ఉండదని వివరించారు. ఇంటిపై సోలార్ పలకలను ఏర్పాటు చేసుకుంటే 25ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్ సౌకర్యాన్ని పొందవచ్చిని డీఈ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం ఏడీఈ సియానాయక్, ఏఈ అల్లూరయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, టీడీపీ ముఖ్యనాయకులు శనగా నారాయణరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, బైపునేని మంత్రయ్య, కందుల నారాయణరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం


జమ్మనపల్లి పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పేదవానికి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని జమ్మనపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం సందర్శించి విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పించి సన్నబియ్యంతో భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫాం నాణ్యమైనవి అందించేలా మంత్రి లోకేష్ పర్యవేక్షణలో జరుగుతోందన్నారు. ఈనెల 10న తల్లిదండ్రుల కమిటీ సమావేశాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 580 మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధిస్తే తన సొంత నిధుల నుంచి రూ.లక్ష బహుమతిగా ఇస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పండుగలా మెగా పీటీఎంను నిర్వహించాలి

ఒంగోలు విద్య, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ప్రైవేటు పాఠశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహిద్దామని ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ కో చైర్మన్ పి.ప్రకాష్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఒంగోలులో అసోసియేషన్ అధ్యక్షుడు జి.అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యా సంస్కరణలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ తల్లికివందనం ఇవ్వడం అభినందనీయమన్నారు. గడిచిన సంవత్సర కాలంలో విద్యారంగంలో అనేకమార్పులకు శ్రీకారంచుట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. అందువల్ల మెగా పీటీఎం సభకు తల్లిదండ్రులను ఆహ్వానించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

సర్వీసు రెగ్యులరైజేషన్ చేయాలి


మంత్రికి వివరిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు విద్య, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరణను ప్రారంభించాలని కాంట్రాక్టు అధ్యాపకులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. మంగళవారం రాజధాని అమరావతిలో వారు మంత్రినికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం న్యాయ సలహాకోసం అడ్వకేట్ జనరల్ వద్ద ఉన్న దస్త్రాన్ని తెప్పించి ప్రక్రియను పునఃప్రారంభించాలన్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు గత ఏడాది మేనెల జీతం చెల్లింపులో జాప్యం జరగకుండా చూడాలని కోరారు. ఆయా అంశాలపై మంత్రి లోకేష్ స్పందిస్తూ కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసు క్రమబద్ధీకరణ విషయంలో తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ చైర్మన్ కుమ్మరికుంట సురేష్, కో చైర్మన్ కల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్యం కోసం పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం


నగదుసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పంగులూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి):తమతో పదవతరగతి వరకు కలిసి చదివి, ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నూతలపాటి షడక్ వైద్యం కోసం రూ.34 వేల నగదుసాయం అందించి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ముప్పవరం పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాలలో బి.ఆర్.పాలెం గ్రామానికి చెందిన షడక్ 2001 -2002 విద్యాసంవత్సరంలో పదవతరగతి చదివాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మోకాలిచిప్ప రెండుగా చీలి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు చక్రవరం చినఅంజంరాజు, ఒలేటి సత్యనారాయణ, బ్రహ్మయ్యలు తమతో కలసి చదివిన విద్యార్థుల నుండి రూ.34 వేల నగదు సేకరించి మంగళవారం షడక్‌కు అందచేశారు.

రుణ సహకారంతో చక్కని జీవన ప్రమాణాలు

వేటపాలెం(చీరాల), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళలకు అందిస్తున్న రుణసాయంతో జీవన ప్రమాణాలను చక్కగా మెరుగు పరచుకోవచ్చుని పీడీ శ్రీనివాస్, డీపీఎం రవికుమార్, ఎంపీడీవో రాజేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం వేటపాలెం మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం అంజిబాబు ఆధ్వర్యంలో పొదుపు సంఘాల అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్త్రీనిధి, ఎస్సీ, ఎస్టీ సబ్సిడీ రుణాలపై చర్చించారు. గ్రామ సంఘాల పనితీరుపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సోలార్ రిజిస్ట్రేషన్‌లలో వేగం పెంచాలని వివరించారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.78 వేలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ కామేశ్వరి, ఉన్నతి ఏపీఎం ఫణిబాబు, సీసీలు అనూరాధ, వీవోఏలు పాల్గొన్నారు.

బడికి స్వాగతం



ఆహ్వానపత్రాలను ఇళ్లకు తీసుకెళ్తున్న విద్యార్థులు

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో మెగా పేరెంట్స్ మీట్‌కు ఏర్పాట్లు

పండుగలా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు సిద్ధం

ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలు అందజేత

త్రిపురాంతకం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న తల్లిద్రండులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని ఓ పండుగలా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దాదాపు 400 పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులను ఆహ్వానిస్తూ ఉపాధ్యాయులు ఆహ్వానపత్రాలు తయారు చేసి అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లల సామర్థ్యాన్ని వారి తల్లిదండ్రులకు వివరించటంతో పాటు పాఠశాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు. తల్లికి వందనం ద్వారా ప్రభుత్వం నగదు అందజేయటంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తుండగా ఈ మీటింగ్ ద్వారా హాజరైన తల్లులకు వారి పిల్లలతో వందనం చేయించటం వారి పాదాలు కడగటం, పూలతో నమస్కరించటం, పిల్లలను వారి తల్లులు ఆశీర్వదించటం వంటి ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల వద్ద పండుగలా వాతావరణం కనిపిస్తోంది. ఫ్లెక్సీలతో తల్లిద్రండులకు ఆహ్వానం పలుకుతున్నారు. రంగులతో, కాగితపు పూలతో పాఠశాలలను అలంకరిస్తున్నారు.



వెంకటాద్రిపాలెంలో పేరెంట్స్‌కు ఆహ్వాన పత్రం అందిస్తున్న ఉపాధ్యాయుడు



పాఠశాల వద్ద ఆహ్వానం పలికే ఫ్లెక్సీ

స్వర్ణోత్సవ డిపాజిట్ పథకం పోస్టర్ ఆవిష్కరణ



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న చైర్మన్ సీతారామయ్య, ఉద్యోగులు

ఒంగోలు విద్య, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పీడీసీసీ బ్యాంకు 50వ వసంతంలోని అడుగుపెడుతున్న శుభసందర్భంగా బ్యాంకులో నూతనంగా స్వర్ణోత్సవ డిపాజిట్ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య తెలిపారు. మంగళవారం స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయంలో స్వర్ణోత్సవ డిపాజిట్ పథకం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుంచి ఈ పథకం ప్రారంభమవుతుందన్నారు. టూ వీలర్లు కొనుగోలుకు రుణ పథకాలు కూడా ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ పథకాలు ఖాతాదారులు, ప్రజలు తమ బ్యాంకు శాఖలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీకే రాఘవయ్య, నాబార్డు డీడీఎం రవికుమార్, ఆప్కాబ్ నోడల్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కల రవాణాకు రూ.15.68 లక్షలు

ఒంగోలు విద్య, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేయనున్నారు. ప్రధానమంత్రి పిలుపుమేరకు తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఈనెల 10న 1,99,660 మొక్కలను పంపిణీ చేయనున్నారు. 4 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వీటిని పంపిణీ చేస్తారు. మొక్కల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే పంపిణీ చేస్తారు. ఒక్కొక్క మొక్కకు రూ.7.85 చొప్పున మొక్కల రవాణాకు రూ.15.68 లక్షలను విడుదల చేసినట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్, విద్యాశాఖ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. మొక్కల సంఖ్యను బట్టి మండలాలకు ఈ నిధులు విడుదల చేశారు. మండల విద్యాధికారులు తమకు ఫారెస్టు అధికారులు ట్యాగ్ చేసిన నర్సీల నుంచి విద్యార్థులకు అవసరమైన మొక్కలు తీసుకొని అందజేయాలని డీఈవో ఆదేశించారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన

ఖాళీ బిందెలు, డ్రమ్ములతో రోడ్డుపై బైఠాయింపు



రోడ్డుపై ఆందోళన చేస్తున్న రామనగర్ కాలనీ మహిళలు

పొదిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కొన్నిరోజుల నుంచి సాగర్ నీరు రాకపోవడంతో తాగునీటికి కటకటలాడుతున్నామని పట్టణంలోని రామనగర్ చెందిన మహిళలు దర్శి పొదిలి ప్రధాన రహదారిలో ఖాళీ బిందెలు, డ్రమ్ములతో ఆందోళనకు దిగారు. 20 రోజులుగా సాగర్ నీరు రాకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, ఆయన వచ్చి పరిశీలించారే తప్ప చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులకు కలిసి ఫిర్యాదు చేసినా వస్తాం, చేస్తామంటున్నారే తప్ప సమస్య పరిష్కారం కాలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం వాడుక నీటిని కూడా ఇవ్వడం లేదని, రెండ్రోజుల కోసారి ట్యాంకర్లను పంపించాలని కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మహిళలతో మాట్లాడారు. కమిషనర్‌తో చెప్పి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.

పీటీఎంను ప్రతి స్కూలులోనూ నిర్వహించాలి

సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మార్కాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఈ నెల 10వ తేదీన పీటీఎమ్ 2.0 (పేరెంట్, టీచర్ మీటింగ్) కార్యక్రమం తప్పక నిర్వహించాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను మెరుగుపర్చేందుకు అవసరమైన ఇలాంటి కీలకమైన కార్యక్రమాలను పాఠశాలలు తప్పక నిర్వహించాలని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చూడాలన్నారు. వారితో విద్యార్థి సామర్థ్యాలను గురించి వివరించాలని సూచించారు. విద్యతోపాటు ఇతర సామర్థ్యాలు ఏమైనా ఉన్నా తల్లిదండ్రులకు తెలిపి వారి ఉన్నతికి తోడ్పాటు అందించాలన్నారు. మీటింగ్‌కు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఆ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు, పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను కూడా ఆహ్వానించాలని చెప్పారు. మధ్యాహ్నం అందరూ కలిసి భోజనం చేయాలన్నారు. తర్వాత తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించాలని చెప్పారు.

పండ్ల తోటల పెంపకంతో రెట్టింపు ఆదాయం

రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

దరఖాస్తు చేసుకున్న వారందరికీ లబ్ధి : ఎమ్మెల్యే జనార్దన్



కొబ్బరి మొక్క నాటుతున్న జేసీ గోపాలకృష్ణ, ఎమ్మెల్యే జనార్దన్

కొత్తపట్నం, జూలై 8(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతులు పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టడం ద్వారా రెట్టింపు ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ చెప్పారు. మంగళవారం కొత్తపట్నంలో పండ్ల మొక్కలను నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటలు సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులకు ఉచితంగానే 15 రకాల మొక్కలను అందజేస్తారన్నారు. సాగు చేసేందుకు రైతులకు పెట్టుబడి అంతా ఉపాధి హామీ పథకం కిందనే ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 25 వేల ఎకరాల్లో ఉపాధి హామీ పథకం కింద పండ్లతోట పెంపకాన్ని చేపట్టాలని లక్ష్యం కాగా జిల్లాలో 750 ఎకరాల్లో చేపట్టనున్నామన్నారు. ఎక్కువ ఉత్పత్తి ఇచ్చే పండ్ల రకాలను ఎంపిక చేసుకుని సాగు చేసుకుంటే మంచి ఫలితాలను రాబట్టవచ్చని తెలిపారు. జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు అనుకూలమైన పరిస్థితి ఉందన్నారు. శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటలను పెంచే పథకాన్ని జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎకరాకు దాదాపు రూ.5 లక్షల వంతున ప్రభుత్వం పండ్లతోట సాగుకు అందించబోతుందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అందరికీ ఈ పథకం కింద లబ్ధిచేకూరుతుందన్నారు. పేద రైతులు ఎక్కువగా ఉన్న కొత్తపట్నం మండలంలో ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్, ఎమ్మెల్యేలు రైతుల పొలంలో కొబ్బరి చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, జిల్లా పంచాయితీ అధికారి వెంకటనాయుడు, కొత్తపట్నం తహసీల్దార్ శాంతి, ఎంపీడీవో శ్రీకృష్ణ, నాయకులు గేనం సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గౌడకార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

- **306 మందికి అపరాధ రుసుం రూ.8.50 లక్షలు విధింపు**
- **11 మంది అధికారులు, 84మంది సిబ్బంది 31బృందాలుగా దాడులు**



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

జరుగుమల్లి, కొండపి జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఈఈ టి. హైమావతి, కందుకూరు ఆపరేషన్ ఈఈ ఎం. నాగేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు 11మంది, 84 మంది సిబ్బంది, 31 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మీటరు ఉన్నా అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న నలుగురిని గుర్తించి వారికి 30 వేల రూపాయలు, అనుమతి పొందినదానిలో కాకుండా ఇతర కేటగిరీలో కరెంటు వాడుకుంటున్న 8 మందికి 23 వేల రూపాయలు, అదనపు లోడ్ వాడుకుంటున్న 294 మందిని గుర్తించి వారికి 7 లక్షల 97వేల రూపాయలు మొత్తం 306 మందికి 8.50 లక్షల రూపాయలు అపరాధ రుసుం విధించారు. దాడుల అనంతరం జరుగుమల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈఈలు టి. హైమావతి, ఎం. నాగేశ్వరరావు వివరాలు వెల్లడించారు. మొదటి సారి చౌర్యానికి పాల్పడిన వారికి అపరాధ రుసుం విధిస్తామని, రెండోసారి చౌర్యానికి పాల్పడితే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిస్తామని వారు తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారి వివరాలను 9440812358 , 9440812359 సెల్ నంబర్లుకు నేరుగా, వాట్సప్ ద్వారా తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సమావేశంలో డీఈఈలు యుగంధర్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఏఈలు కుంచాల కోటయ్య, కోటేశ్వరరావు, ఏఈలు హర్డీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హైవే నిర్మాణ పనుల అడ్డగింత

న్యాయం చేయాలని బాధితుడి ఆవేదన

సర్దిచెప్పిన సబ్‌కలెక్టర్ త్రివినాగ్



పనులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్, డీఎస్పీ నాగరాజు

పెద్ద దోర్నాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నదోర్నాల అడ్డరోడ్డువద్ద జరుగుతున్న పనులను మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, డీఎస్పీ నాగరాజు, ఎర్రగొండపాలెం సీఐ సీహెచ్ ప్రభాకర్ రావు, తహసీల్దార్ అశోక్‌రెడ్డి, ఎస్సై వీ మహేష్ మంగళవారం పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కాంట్రాక్టర్ అడ్డరోడ్డు వద్ద పనులు చేయిస్తుండగా, భూమిని కోల్పోయిన నారాయణ పనులను అడ్డుకున్నారు. తనకు ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం రావాలసిన సొమ్ము కంటే చాలా తక్కువ వచ్చిందని బాధితుడు తెలిపారు. కాంట్రాక్టరు, నేషనల్ హైవే అధికారులు రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. సబ్ కలెక్టర్ త్రివినాగ్, డీఎస్పీ నాగరాజు, సీఐ ప్రభాకర్ రావు, ఎస్సై మహేష్, తహసీల్దార్ అశోక్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుడు తో సబ్ కలెక్టర్, తహసీల్దారు మాట్లాడుతూ మీభూమి వ్యవసాయ భూమిగానే ఉందని, మార్కెట్ ధర ప్రకారమే అందరికీ నష్ట పరిహారం చెల్లిస్తారని, అభివృద్ధి పనులను అడ్డుకోవడం చట్టరీత్యా నేరమని చెప్పారు. సర్దిచెప్పి పనులను యథావిధిగా కొనసాగేలా తోడ్పడాలని చెప్పారు. దీంతో నిర్మాణ పనులను ప్రారంభించారు.

రెండు పీఏసీఎస్‌లకు పీఐసీ కమిటీలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రెండు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(సొసైటీ)లకు నాన్ అఫీషియల్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ పదవీ కాలం వీరు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఈనెల 30 వరకు ఉంటుందని అందులో పేర్కొన్నారు. చీమకుర్తి మండలం గాడిపర్తివారిపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా జ్యోతి వేణు, సభ్యులుగా ఎం.అంకమ్మరావు, ఎం. తిరుపతిస్వామిలను నియమించగా పెద్దదోర్నాల పీఏసీఎస్ చైర్మన్‌గా బట్టు సుధాకర్‌రెడ్డి, సభ్యులుగా కే వెంకటమోహన్‌మురళీ, సోమేపల్లి శేఖర్‌బాబులను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఆ కుటుంబంలో ఆనందం..!



ఒంగోలులో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ (స్పందన)లో పలువురి సమస్యలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. 'అక్కడ ఎవరూ పట్టించుకోవడం లేదు.. మీరైనా కనికరించండి' కథనంపై వికలాంగుల సంక్షేమశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక భాగ్యనగర్ 4వ లైనులోని మహేష్ కుమారుడు మనీష్‌కు వీల్ ఛైర్‌ను ఏడీ సువార్త అందజేశారు. గత 11 ఏళ్లుగా మంచానికే పరిమితమైన మనీష్‌కు వీల్ ఛైర్ అందించడంపై ఆ కుటుంబం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, శరీరంలో అవయవాలు ఏమీ పనిచేయవని, చెవులు మాత్రమే వినిపిస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేయడంతోపాటు, ఇప్పటికే ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ రూ. 6వేలు పెంచాలని వారు కోరగా, సంబంధిత అధికారులు వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలవాలని సూచించడంతో జిల్లా వైద్యశాలకు వెళ్లిన వారికి నిరాశ ఎదురైంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆ వ్యాధికి తామేమీ చేయలేమని, సదరం సర్టిఫికెట్ మార్పు చేసుకోవాలని సూచించారు.

- ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

ఇంటి స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి కలెక్టర్, ఆర్డీవో ఓబులేసు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఇంటి స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు అవసరమైన భూసేకరణ వివరాలను రూపొందించాలని సీసీఎల్ఏ ప్రత్యేకకార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. అర్హులైన వారికి ఇంటి స్థలాలను కేటాయించేందుకు గ్రామాలవారీగా గుర్తించిన భూములపై నివేదికను పంపించాలన్నారు. జిల్లాల్లో పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను వందశాతం ఆడిట్ టీం చేత తిరిగి పరిశీలన చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బందెల నాసర్ ఆరోపించారు. బుధవారం స్థానిక మిరియాలపాలెం సెంటర్‌లోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాసర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విస్మరించారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక తూతూమంత్రంగా కేవలం రూ.600కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని ఫీజులు చెల్లించకలేక కళాశాలల్లో సర్టిఫికెట్లు ఉంచి ఉన్నత విద్య చదవలేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రాష్ట్ర వ్యాప్త నిరసనల్లో భాగంగా ఈనెల 11న అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, ఫణిరాజు, మరియబాబు, మధు, హుస్సేన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

250 మందికి వైద్యసేవలు

నాగులుప్పలపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దాసరివారిపాలెంలోని చర్చి వద్ద మంగళవారం ఆర్ఫాన్స్, ఓల్డర్, విడోస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.పౌలు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు 250 మందికి పలు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ డి.అశోక్, ఉపాస్ జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్, పీఆర్వో రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

మద్దిపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యాన్ని మరింతగా మెరుగుపర్చాలని ఎంపీడీవో వి.జ్యోతి ఆదేశించారు. మంగళవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు, సచివాలయం సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. స్వచ్ఛ సర్వేక్షణలో బాగంగా అధికారులు అంకితభావంతో పని చేయాలని చెప్పారు. పారిశుధ్య కార్మికులు వీధుల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని కోరారు. మండల పరిషత్ అధికారులతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

కొండపి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా బుధవారం జరిగే కార్మికుల సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ.మస్తాన్ పిలుపునిచ్చారు. మంగళవారం కొండపిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెటర్నటీ సెలవులు కార్మికులకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అన్ని శాఖల సమన్వయంతోనే అభివృద్ధి

సంతనూతలపాడు, జూన్8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే అన్నిశాఖల అధికారులు సచివాలయం స్థాయిలో సమన్వయంతో పనిచేస్తేనే సాధ్యమవుతుందని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంఈవో వెంకారెడ్డి, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

- మండలంలోని ఎనికపాడు, గుర్వారెడ్డిపాలెం, ఎండ్లూరు గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద రైతుల పొలాల్లో ఎంపీడీవో సురేష్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబులు మొక్కలను నాటారు.

పచ్చిరొట్ట పైరులను సాగు చేయాలి

కొండపి, జూన్8 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట పైర్లను సాగుచేయడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చని ఏవో మాల్యాద్రి తెలిపారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెరిదేపి గ్రామంలో రైతులకు వివిధ బీమా పథకాలు, పంటలసాగు విషయాలపై రైతులకు అవగాహన కలిగించారు.

పొన్నలూరు మండలంలో..

పొన్నలూరు: కౌలురైతులందరూ తాము సాగుచేస్తున్న పంటవివరాలన్నింటినీ తప్పక నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాము కోరారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మండలంలోని ముప్పాళ్ల, శింగరబొట్లపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది సుధీర్, పశువైద్యసిబ్బంది ఖాదర్‌వలి, రాకేష్, తేజస్విని, రైతులు పాల్గొన్నారు.


ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలి

మర్రిపూడి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సంఘం నిర్దేశించిన విధులను బూత్‌లెవెల్ అధికారులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి కుమార్ కోరారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ ఎలోన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు బీఎల్‌వోలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. 50మంది బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: ఓటర్ల నమోదు ప్రక్రియలో బీఎల్‌వోలు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వరకుమార్ తెలిపారు. చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం ఢిల్లీలో శిక్షణపొందిన ఆర్‌పీలు శిక్షణను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, కమిషనర్ రామకృష్ణయ్య, అధికారులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు కృషి చేయాలి


ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, వైద్యాధికారులు, ఉద్యోగులు

మద్దిపాడు,జూలై 8(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ కోరారు. మంగళవారం మద్దిపాడులో డెంగ్యూ నివారణ కోరుతూ ఆశ కార్యకర్తలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ మాట్లాడుతూ దోమల వ్యాప్తి నివారణకు డ్రైనేజీలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. అలాగే ఇంటి పరిసర ప్రాంతాల్లో ఖాళీ కొబ్బరి బొండాలను వేయకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, రజితకుమారి, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే బీఎన్ ● మంగమూరులో సుపరిపాలనలో తొలిఅడుగు ● ఒంగోలులో పర్యటించిన ఎమ్మెల్యే దామచర్ల


మంగమూరులో కరపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్


ఒంగోలులో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పక్కన మేయర్ సుజాత

సంతనూతలపాడు, జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాయని, అందుకే తమది మంచి ప్రభుత్వమని బాపట్ల ఎంపీ తేనేటీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మంగమూరు గ్రామంలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా వారు పర్యటించి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలను అభివృద్ధి వైపు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న పీ4 విజయవంతంగా అమలవుతుందని చెప్పారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి ఆర్.అంకారావు, నల్లూరి నారాయణ, కృష్ణారావు, అరుణ, గోపి, సింగరాజు, పుల్లయ్య, బుజ్జి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు, పింఛన్లు, ఇంటి స్థలాలు ఇస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని మంగళవారం 7,8 డివిజన్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మపాలెంలోని ఎన్టీఆర్ బొమ్మ వద్ద నుంచి ప్రారంభమైన పర్యటనలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజల అనేక అగచాట్లు పడ్డారన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇల్లు సంతోషంగా ఉండాలని, సంక్షేమ పథకాలు అందరికీ అందించడమే లక్ష్యమని తెలిపారు. ఎవరూ అధైర్యపడొద్దని తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దామచర్లకు ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్ దాచర్ల వెంకట రమణయ్య, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో ఉత్సాహంగా..

చీమకుర్తి: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం మంగళవారం చీమకుర్తి పట్టణంలో ఉత్సాహంగా నిర్వహించారు. గత ఏడాదికాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, అవనిగడ్డ శేషారావు, రావిపాటి శ్రీనివాసరావు, రావిపాటి రాంబాబు, గొల్లపూడి సుబ్బారావు, గొల్లపూడి కోటేశ్వరరావు, శివ, సత్యం, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


చీమకుర్తిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం

● ఎమ్మెల్యే విజయకుమార్


నాగన్నపాలెంలో డ్రాగన్‌ఫ్రూట్ మొక్కలు నాటిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్, అధికారులు

మద్దిపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పండ్లతోటలు సాగు చేసేందుకు సన్న, చిన్నకారు రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం నాగన్నపాలెంలో ఉద్యానశాఖ ద్వారా చేపట్టిన పండ్లతోటల సాగును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా పండ్లతోటల పెంపకానికి అండగా ఉంటుందన్నారు. పండ్ల మొక్కల పెంపకానికి మూడేళ్లపాడు రైతుల ఖాతాల్లో సబ్సిడీ డబ్బులు జమ చేస్తుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు నూరుశాతం సబ్సిడీతో ఉద్యాన పంటల సాగు చేసుకునేందుకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు నగదును రైతు ఖాతాలో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, టీడీపీ కో ఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు, ఎంపీడీవో జ్యోతి, తహసీల్దార్ ఆదిలక్ష్మి, నాగన్నపాలెం సర్పంచి కాకర్ల విజయకుమార్, దుగ్గినేని నరసింహారావు, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

పొన్నలూరు: పండ్లతోటల పెంపకం వల్ల రైతులకు ఎన్నో లాభాలున్నాయని ఏపీవో సుధాకర్ అన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద పండ్లతోటల పెంపకంపై చౌటపాలెంలో రైతులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. సన్న,చిన్నకారు రైతులు ఎలాంటి పెట్టుబడి పెట్టకుండానే ప్రభుత్వ ఆర్థికసాయంతో పండ్లతోటల పెంపకం చేపట్టవచ్చని సూచించారు.

యరజర్లలో..

ఒంగోలు(రూరల్): యరజర్ల గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రైతు వెంకట్రావు పొలంలో నిమ్మ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీవో కె.రాజశేఖర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్య, ఏపీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం

● మారిటైం బోర్డు దామచర్ల సత్య


కరపత్రాన్ని అందజేస్తున్న చైర్మన్ సత్య

సింగరాయకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. మండలంలోని మూలగుంటపాడులో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో ఉన్న ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నేరవేర్చడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అందులో మహిళలకు దీపం పథకం కింద గ్యాస్‌సిలెండర్లు, తల్లికి వందనం పథకాలను అందజేస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే పింఛన్‌ను రూ.4వేలకు పెంచామని వివరించారు. పాలన దక్షత కలిగిన సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అమరావతి, పోలవరం నిర్మాణాలను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పునఃప్రారంభించారని, ఉత్తరాంధ్రకు రైల్వేజోన్‌ను మంజూరు చేయించారని తెలిపారు. రామపట్నం దగ్గర బీపీసీఎల్ రిఫైనరీ కంపెనీ రాబోతుందని త్వదారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని సత్య వివరించారు. పాకల తీరప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, సన్నెబోయిన శ్రీనివాసులు, షేక్ సంధానీబాషా, మించల బ్రహ్మయ్య, చంటి, గుదే వెంకటేశ్వర్లు, గాలి హరిబాబు, గిరి, సన్నెబోయిన మల్లికార్జున, సన్నెబోయిన శ్రీనివాసులు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించడంలో బూత్‌లెవల్ అధికారులు(బీఎల్‌వో)ల బాధ్యతగా వ్యవహరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకొని ఎలాంటి పొరపాట్లకు తావ్వికుండా బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో మంగళవారం ఓటర్ల జాబితా తయారీ, బీఎల్‌వో యాప్ నిర్వహణపై ఒంగోలు నియోజకవర్గ బీఎల్వోలు, బీఎల్‌వోల సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడంలో బీఎల్వోలదే కీలకమన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు సంబంధించి ఓటరు జాబితా రూపకల్పనపై బీఎల్‌వో యాప్ నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ఆయా అంశాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేషు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు సకాలంలో అందాలి

ఒంగోలు(రూరల్): ప్రజలకు రెవెన్యూ సేవలు సత్వరం అందేలా చూడాలని ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి మండల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకం అర్హులకు అందేలా చూడాలన్నారు. ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కార్డు వచ్చేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని, నూతన రేషన్‌కార్డులు పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేసు, జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఒంగోలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైసీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబులు హాజరయ్యారు. ముందుగా చర్చిసెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పార్టీ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు కఠారి శంకర్ పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో

నాగులుప్పలపాడు: మాజీ సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను వైసీపీ శ్రేణులు మంగళవారం నాగులుప్పలపాడులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నలమలపు అంజమ్మ కేక్ కట్ చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నలమలపు కృష్ణారెడ్డి, ఇనగంటి పిచ్చిరెడ్డి, కొమ్మూరి కనకారావు, పోలవరపు శ్రీమన్నారాయణ, కాటూరి ఆదెయ్య, ఇమ్మిశెట్టి బాలకృష్ణ పాల్గొన్నారు. అమ్మనబ్రోలులో జరిగిన వేడుకల్లో కాట్రగడ్డ శ్రీనివాసరావు మారెళ్ల భాస్కరరావు, కట్టా రాజశేఖర్ పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి : మాజీ సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం చీమకుర్తి ఘనంగా జరిపారు. వైఎస్ఆర్ విగ్రహాలకు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివారావు, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పమిడి వెంకటేశ్వర్లు, క్రిస్టిపాటి శేఖరరెడ్డి, ఓబుల్‌రెడ్డి, పాటిబండ్ల గంగయ్య, సోమా శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కొండపి: వైసీపీ ఆధ్వర్యంలో కొండపి, టంగుటూరు, జరుగుమల్లి మండలాల్లో దివంగత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆపార్టీ నాయకులు నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

టంగుటూరు, (కొండపి) : దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మర్లపాడు, కందులూరు గ్రామాల్లో ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు స్వీట్లు పంచారు. మండల అధ్యక్షుడు బి.శశికుమార్, డాక్టర్ శ్రీపతి సతీష్, పోలయ్య, కోటేశ్వరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీహర్షిణితో అడ్మిడిజిటెక్ ఒప్పందం


ఒప్పందపత్రాన్ని అందుకుంటున్న రవికుమార్

ఒంగోలు విద్య, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీహర్షిణి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మహిళా కళాశాల హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డిజిటల్ మార్కెటింగ్ సంస్థ అడ్మిడిజిటెక్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీని ద్వారా డిజిటల్ మార్కెటింగ్ రంగంలో విద్యార్థులకు శిక్షణ, పరిశీలన, ప్రాజెక్టు అవకాశాలు కల్పిస్తారు. సోషల్ మీడియా మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్స్ డిజిటల్ ప్రకటనపై ప్రామాణిక శిక్షణ, ప్రతి సెమిస్టర్‌కు ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభిస్తాయి. ఒప్పంద పత్రాల మార్పిడి కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, డైరెక్టర్ గోరంట్ల హర్షిత్, అకడమిక్ డీన్ దాది అంజనేయులు, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసనాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్‌చక్రవర్తి, అడ్మిటిజిటెక్ సంస్థ ప్రతినిధి కె.సందీప్ పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు

మద్దిపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివరామయ్య హెచ్చరించారు. మంగళవారం మద్దిపాడులోని నాగార్జున హైస్కూలు పాఠశాలలో అవగాహన సదస్సు కరస్పాండెంట్ మాధవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శివరామయ్య మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించటం, తాకటం లాంటి చర్యలకు పాల్పడితే కేసు నమోదు చేస్తామన్నారు. విద్యార్థినులకు ఎవరైనా సైగలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఒంగోలు(రూరల్), జూలై8(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం పాతతోపు బడిలో బ్రాహ్మణ సేవాసమితి భవన నిర్మాణం కోసం ఘెర కవి సుబ్బారావు, సతీమణి మీనాక్షిమ్మలు రాఘవరావు, ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం రూ.లక్ష చెక్కును మంగళవారం సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. అనంతరం శేషయ్య మాట్లాడుతూ భవన నిర్మాణం కోసం దాతలు ముందుకురావాలని కోరారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి గురువారం ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. అనంతరం కనిగిరి మండలం కంచర్లవారిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో కలిసి పాల్గొంటారు. సాయంత్రం దర్శి నియోజకవర్గంలో జరిగే సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మితో కలిసి మాగుంట పాల్గొంటారు. సాయంత్రం ఒంగోలులో పర్యటిస్తారు.

కౌలు రైతులకూ అన్నదాత సుఖీభవ : ఏడీఏ


కొప్పోలులో మాట్లాడుతున్న రమేష్

ఒంగోలు(రూరల్), జూలై 8(ఆంధ్రజ్యోతి): కౌలు రైతు కార్డులు కలిగి ఉన్న వారందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని వ్యవవసాయశాఖ ఏడీఏ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కొప్పోలు, దశరాజుపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంటలో పేరు నమోదు చేయించుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర కౌలు రైతులకు అక్టోబరు, జనవరి నెలల్లో అన్నదాత సుఖీభవ పథకం నగదు రెండు విడతలలో బ్యాంక్ ఖతాల్లో జమ అవుతుందన్నారు. అదేవిధంగా డి పట్టాదారులు, అసైన్డ్ భూములు, ఇనామ్ భూములు గల రైతులు కూడా అన్నదాత సుఖీభవకు అర్హులని తెలిపారు. ప్రభుత్వ భూములు సాగు చేసేవారికి ఈ పథకం వర్తించదని చెప్పారు. అర్హత గల రైతులు ఎవైనా సమస్యలు ఉంటే సరిచేయింకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏవో రమేష్‌బాబు, కాట్రగడ్డ రఘుపతి, మాలంపాటి యానాదినాయుడు పాల్గొన్నారు

వైద్య సిబ్బందికి సత్కారం


వైద్యులు, సిబ్బందిని సత్కరించిన ఉద్యోగులు

సింగరాయకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక వైద్యశాలలో బదిలీపై వెళ్తున్న వైద్యులు చైతన్యకృష్ణ, ఉజ్వల, ఫార్మసీ అధికారి పద్మ, సూపర్‌వైజర్లు సంపూర్ణమ్మ, ఏఎన్ఎంలు మస్తానమ్మ, నాగమణి, గిరిజ, నసీమ్, కల్యాణి, సలోమిను వైద్యశాలలో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో వాణిశ్రీ మాట్లాడుతూ పీహెచ్‌సీలో చైతన్యకృష్ణ, ఉజ్వల, సిబ్బంది అత్యుత్తమ సేవలు అందజేశారని కొనియాడారు. వారిని సత్కరించారు. నూతనంగా విధుల్లో చేరిన డాక్టర్ ఆయేషా, సెల్వంకు ఆహ్వానం పలికారు.

గంజాయి అమ్మితే కఠిన చర్యలు


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ ప్రేమ్‌కుమార్

కొండపి, జూలై8 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మితే కఠిన చర్యలు చేపడతామని ఎస్ఐ ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి కొండపిలోని పలు స్కూళ్ల పరిసరాల్లోని దుకాణాలను, హోటళ్లను, పాన్‌షాప్‌లను ఆయన సిబ్బందితో తనిఖీ చేశారు. గుట్కా, ఖైనీ, గంజాయి ఆనవాళ్ల కోసం అన్ని దుకాణాల్లో సిబ్బందితో ముమ్మరంగా తనిఖీ చేశారు. గంజాయి అమ్మినా, తాగినా నేరమన్నారు. ప్రధానంగా విక్రయదారులపై కఠిన చర్యలు చేపడతామన్నారు. అక్కడక్కడ చిల్లర దుకాణాల్లో గుట్కా ప్యాకెట్లను గుర్తించినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు.

మేయర్ సుజాతకు స్వల్ప గాయాలు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత కాలికి గాయమైంది. మంగళవారం స్థానిక బీఏ అపార్ట్‌మెంట్ వద్ద కారు ఎక్కుతుండగా జారడంతో కాలుకుదెబ్బ తగిలింది. వెంటనే నగరంలోని వెంకటరమణ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఇరవై రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు ఆమెకు సూచించారు.

జేసీఐ సేవా కార్యక్రమాలు భేష్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాతీయ అధ్యక్షుడు జంజన్‌వాలా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ గత 50 ఏళ్లుగా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమని జేసీస్ నేషనల్ ప్రెసిడెంట్ అంకుర్ జంజన్‌వాలా పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక వీకేబీ రెస్టారెంట్‌లో జరిగిన కార్యక్రమానికి జేసీస్ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటసుబ్బారావు అధ్యక్షత వహించారు. అంతకు ముందు మేయర్ గంగాడ సుజాతతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. అనాథ యువకుడికి ఫీజు కోసం నగదును అందజేశారు. ఒంటరి మహిళలకు కుట్టుమిషన్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరవింద్, నయనాల రామకృష్ణ, నేషనల్ ట్రైనర్ రవికుమార్, దాసరి కృపారావు, ఆపాటి విష్ణువర్ధనరావు, అద్దంకి శ్రీనివాసరావు, పువ్వాడ రాజేష్, వీవీ.రమణ, కార్పొరేటర్ మలగా రమేష్, అడుసుమల్లి వెంకట్రావు, ఆత్మకూరి బ్రహ్మయ్య, గణేష్, శ్రీకాంత్, దివ్య, బాలకృష్ణ, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

నాగులుప్పలపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మెకు ఆశావర్కర్లు మద్దతు తెలిపారు. తాము సమ్మెలో పాల్గొంటున్నట్లు నాగులుప్పపాడు, పోతవరం వైద్యశాలల వైద్యులు ఒనారియల్, కుమారస్వామిలకు మంగళవారం సమ్మె నోటీసులను అందజేశారు.

అన్ని వర్గాల ప్రజలకు మేలు





అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి   రాజ్యలక్ష్మి కాలనీలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రాచర్ల, జూలై 8 (ఆంధ్ర జ్యోతి) : ప్రజా ప్రభుత్వ ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సుపరిపాలలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని సత్యవోలు, యడవల్లి, గుడిమెట్ట, సోమిదేవిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా పలు ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశోక్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల అమలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన ప్రతి మామీని ఒకొక్కక్కటిగా నెరవేర్చుతున్నామన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అరాచకాలు, అవినీతి, విధ్వంస పాలన సాగిందన్నారు. ప్రజా ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని చంద్రబాబు వమ్ముచేయరన్నారు. ప్రభుత్వ పాలనను జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు అప్రతిష్టపాలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అశోక్‌రెడ్డి ధ్వజమెత్తారు. జగన్‌రెడ్డి ఎత్తులను, మాయ మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. గ్రామా ల్లో సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అశోక్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కటిక యోగానంద్, నాయకులు షేక్ సయ్యద్ మియా, శ్రీనివాసులు, భవనం పుల్లారెడ్డి, భవనం శ్రీధర్ రెడ్డి, కాశిరెడ్డి, బుడమ నాగేశ్వరరెడ్డి, కొప్పెట వెంకటేశ్వరరెడ్డి, రమణ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

గిద్దలూరు టౌన్ : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, డ్వామా ఆధ్వర్యంలో తాళ్లపల్లి గ్రామంలో జరిగిన పండ్ల మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. జామ చెట్లను నాటి మట్టిపోసి నీరు పోశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జామ, మామిడి పండ్ల మొక్కలు వేసే రైతులకు ప్రభుత్వం ఉచితంగా మొక్కలు అందచేయడమే కాకుండా నాటించి నీరు అందించడంలో సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి బుడత మధుసూదన్, మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, ఎంపీడీవో రమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం ఎమ్మెల్యే కందుల

మార్కాపురం : ఎన్నికలల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం స్థానిక 31వ వార్డు పరిధిలోని రాజ్యలక్ష్మీ కాలనీలో ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అన్నింటినీ త్వరలోనే అమలు చేస్తామన్నారు. ఇప్పటికే పెంచిన పింఛన్లు, తల్లికి వందనం, మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీ, అన్నా క్యాంటీన్ల ద్వారా రూ.5లకే నాణ్యమైన అల్పాహారం, భోజనం అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి అమలు కానున్నాయని అన్నారు. ఇవేకాక 16,437 పోస్టులతో డీఎస్సీ నియామకాలు త్వరలోనే చేపట్టబోతున్నట్లు తెలిపారు. పారిశ్రామికరంగంలో 8.5 లక్షలమందికి ఉద్యోగాల కల్పనకు ఇప్పటికే ఒప్పందాలు జరిగాయన్నారు. త్వరలోనే మార్కాపురం జిల్లా సాధించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, తాళ్లపల్లి సత్యనారాయణ, మాలపాటి వెంకటరెడ్డి, కనిగిరి బాలవెంకటరమణ, షేక్ మౌళాలి, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఇబ్రహీం ఖాన్, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ నాలి కొండయ్య, పెరుమాళ్ల కాశీరావు, పఠాన్ హుసేన్‌ఖాన్ పాల్గొన్నారు.

కొనకనమిట : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ మని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని నాగంపల్లి, సిద్ధవరం, చేరెడ్డివారిపల్లి గ్రా మాలలో మంగళవా రం ఆయన తొలిఅడుగు లో భాగంగా పర్యటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుతో లాభాలు

మార్కాపురం రూరల్ : పండ్ల తోటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని జమ్మనపల్లి గ్రామంలో ఉపాధి పథకం ద్వారా మంజూరైన పండ్ల తోటల పథకంలో భాగంగా రైతుల పొలాల్లో పొలాలల్లో మంగళవారం అధికారులు, నాయకులతో కలిసి మామిడి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏపీవో నాగరాజు, ఈసీ కిషోర్‌కుమార్, నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం: ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు : గ్రామాల్లో వసతులను కల్పించి అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని పిడికిటివారిపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పథకాలను సక్రమంగా అమలు చేస్తున్నామన్నారు. ఉపాధి కింద పండ్ల తోటల పెంపకం, ఇతర అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.15కోట్లతో చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్,నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగ నారాయణ రెడ్డి, కొలుకులూరి కుమార్,మేడికొండ లక్ష్మీనారాయణ, గజ్వేల్లి భాస్కర్, ఎంపీపీ వెంకటయ్య పాల్గొన్నారు.



పిడికిటివారిపల్లెలో పథకాలను తెలియజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

రసాయనిక ఎరువులను అతిగా వాడొద్దు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి

గిద్దలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అధిక దిగుబడుల కోసం కొందరు రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులను వాడుతున్నారని, దాని వలన భూమి భౌతిక, రసాయనిక లక్షణాలు దెబ్బతిని పంట దిగుబడులపై కూడా ప్రతికూల ప్రభావం ఏర్పడుతుందని వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంబవరం, వెల్లుపల్లి గ్రామాలలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారి పాల్గొని ప్రసంగించారు. అధిక ఎరువుల వాడకం వలన నేల ఆరోగ్యం దెబ్బతింటుందని, సూక్ష్మజీవులు నాశనమై భూమి చౌడుబారుతున్నదని, పర్యావరణ సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు శేఖర్ పాల్గొన్నారు.

బేస్తవారపేట : మండలంలో మొక్కజొన్న విత్తన ఉత్పత్తికి సాగు చేసే రైతులు విత్తనాలు కొన్న కంపెనీ నుంచి రసీదు పొందాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రఫీక్ అన్నారు. ఎరువుల దుకాణంలో కొనుగోలు చేసిన వాటికి కూడా రసీదు పొందాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి సత్యనారాయణ, వీపీ ఇంద్రసేనారెడ్డి, నారా ఆది గణేష్, సుజాత, ప్రతాప్ పాల్గొన్నారు.

కంభం : మండలం దర్గా గ్రామంలో మంగళవారం వ్యవసాయాధికారి మహమ్మద్ పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులందరూ పంటలకు బీమాను చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన విస్తరణాధికారి శేషగిరి, గ్రామ వ్యవసాయ సహాయకులు, పశుసంవర్ధకశాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న విత్తనాలు ఉత్పత్తి చేసే ప్రతి రైతు కంపెనీలతో ఒప్పందం చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని చట్లమిట్ల, రేగుమానుపల్లిలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ మండలంలో సుమారు 100 ఎకరాల్లో పలు కంపెనీల మొక్క.జొన్న విత్తనోత్పత్తి కోసం రైతులు నాటారన్నారు. కంపెనీలతో ఒప్పందం పత్రాలు తీసుకోని రైతులు భవిష్యత్తులో జరిగే పరిణామాలకు వారే బాధ్యులన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత ఉండి జాబితాలో పేర్లు లేనివారు రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని కలిసి సంబంధిత పత్రాలు ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులరెడ్డి, వ్యవసాయ సహాయకులు రఫీ, ఏఈవో సునీల్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : పత్తిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏవో జవహర్ లాల్ నాయక్ అన్నారు. మండలం లోని పెద్ద బొమ్మలాపురం, చట్టుతాండాలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా గ్రామాల్లో సాగు చేసిన అరటి, పత్తి పంటలను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పత్తి సాగు చేసిన రైతులు విధిగా ఎకరానికి రూ.2100 చెల్లించి వాతావరణ బీమా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో చైతన్యకుమార్, సిబ్బంది నాగరాజు, నీలానాయక్ పాల్గొన్నారు.

పొదిలి : కంది సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం 100శాతం రాయితీపై కందుల మినీ ప్యాకెట్‌ను అందజేస్తున్నట్లు ఏవో డీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండంలోని ఉప్పలపాడు, తలమళ్ల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రాచర్ల : పత్తి పంట వివిధ దశల్లో ఉందని, దానికి పచ్చ, తెల్లదోమ ఆశించకుండా నివారించేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో షేక్ మహబూబ్ బాషా అన్నారు. మండలంలోని అనుములపల్లి, చోళ్లవీడు గ్రామాల్లో మంగళవారం ఆయన పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమల నివారణకు రైతులు తక్షణమే లీటర్ నీటికి ఒక గ్రాము చొప్పున ఎసిటామి ప్రైడ్ మందును వారం వారం వ్యవధిలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరెడ్డి, సుమంత్, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

తర్లుపాడు : రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఫసల్ బీమా దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని మీర్జపేట, కారుమానుపల్లెలో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకుంటే ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏవో జోత్స్న దేవిక, ఏఈవో దేవేంద్ర గౌడ్, వ్యవసాయ సహాయకురాలు సావిత్రి, రైతులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అమర్నాథ్‌రెడ్డి అన్నారు. పూలసుబ్బయ్య వీధిలో ఏకల్ గ్రామోథన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. శిక్షణ కేంద్రం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో ఉదయ్ కర్ణేఖర్, శ్రీధర్ రెడ్డి, రామకృష్ణ, గోపాల్, నరసింహారెడ్డి, మేడా ప్రసాద్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రంగనాయులు

ఉపాధి ద్వారా పండ్ల తోటల పెంపకం

బేస్తవారపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సన్న చిన్న కారు రైతులకు ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం సాయమందిస్తుందని ఎంపీడీవో రంగనాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని చిన్న ఓబినేనిపల్లె గ్రామంలో మంజూరైన పండ్ల తోటల వద్ద మొక్కలు నాటి రైతులకు ఉపాధి పథకం ద్వారా రైతులకు అందించే సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏపీవో గురువరకుమార్, సర్పంచ్ బోయిళ్ల శ్రీనీశ్వరరెడ్డి, కార్యదర్శి జమాల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాచర్ల : సన్న చిన్నకారు రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీప మండల అధ్యక్షుడు కటిక యోగానంద్ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి రాచర్ల గ్రామానికి చెందిన రైతు మంద భాస్కర్ రెడ్డి పొలంలో చేపట్టారు. పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని ఆయన తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందే పంటలు పండ్లతోటలేనని అన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి వెంకటేష్, ఏపీవో ఆర్ మహాలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాసులు స్వామి, కోటిలింగారెడ్డి, సత్యబాబు, బిఎఫ్‌టి కోటి, లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు దప్పిలి కాశిరెడ్డి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : పండ్ల మొక్కల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ఏపీవో కే శైలజ అన్నారు. అమానిగుడిపాడు గ్రామంలో పొలాల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఈసీ లక్ష్మనాయక్, టీఏ శ్రీనివాసరెడ్డి, ఎఫ్ఏ రైతులు పాల్గొన్నారు.

పేరెంట్స్ మీటింగ్‌కు ఏర్పాట్లు

కంభం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం ఈనెల 10న పాఠశాలలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ సమావేశానికి మండలంలోని ఉపాధ్యాయులు పెళ్లి వేడుకలా ఏర్పాట్లను చేస్తున్నారు. పాఠశాలల అలంకరణ, ప్రగతి పత్రాల ప్రదర్శనతో పాఠశాల వైభవానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో తల్లిదండ్రులను, అతిథులను ఆహ్వానించేందుకు స్వహస్తాలతో తయారు చేసిన మెగా టీటీఎం ఇన్విటేషన్ కార్డులకు గులాబీలు గుచ్చి స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. రావిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పాండురంగయ్య ఎంఈవో శ్రీనివాసరావు, అబ్దుల్‌సత్తార్‌లకు ఇన్విటేషన్ కార్డు ఇచ్చి ఆహ్వానించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

మార్కాపురం రూరల్, జూలై8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులను కోరారు. కార్యాలయ సమావేశపు హాలులో మంగళవారం సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలపై అవగాహన కల్పించుకుని ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. పంచాయతీ పురోగతి సూచిక 2.0ని తయారుచేసే విధానంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, పంచాయతీ రాజ్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : గ్రామీణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో జాన్ సుందరం అన్నారు. కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి మంగళవారం పంచాయితీ పురోగతి సూచిక 2.0పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో జాన్ సుందరం మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లోరైడ్‌పై అవగాహన ర్యాలీ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు, ఎంఎల్‌హెచ్‌పీలకు ఫ్లోరోసిస్ గురించి అవగాహన కల్పించారు. జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ మాట్లాడుతూ.. ఫ్లోరోసిస్ పీపీఎం మించి ఫ్లోరైడ్ ఉన్నటువంటి నీటిని తాగడం వలన దంత, వెన్నెముక సమస్యలు వస్తాయన్నారు. వీటి నివారణకు ఆర్‌వో వాటర్ ప్లాంట్ నీరు తాగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్ తేజ, శివారెడ్డి, డాక్టర్ భాగిరథి పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

తర్లుపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఎల్‌ఓలకు శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను మార్కాపురం వెంకట త్రివినాగ్ తనిఖీ చేశారు. శిక్షణా తరగతుల్లో ట్రైనర్ బాలవెంకటేశ్వర్లు బీఎల్‌ఓలకు 6ఏ, 7ఏ, 8ఏల గురించి వివరించారు. అనంతరం బీఎల్‌ఓలకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కిశోర్ కుమార్, ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు : గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని 50 మంది బూత్‌లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం.వి.శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో వసతులు ఎలా ఉన్నాయో సమాచారం సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరమైన వసతుల గురించి జాబితా సిద్ధం చేసుకోవాలని సూచించారు. వివిధ అంశాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం.ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమీషనర్ ఇ.వి.రమణబాబు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీంఖలీల్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

పొదిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కరాటే నేర్చుకోవడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండవచ్చని మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అన్నారు. కరాటే మాస్టర్ రాజు వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులు షేక్ సుమయ ఫాతిమా, చిట్టెం లక్కీషాలోమ్ కరాటే బ్లాక్‌బెల్ట్ మెదటి డాన్ సాధించిన సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మంగళవారం ఏర్పాటు చేసిన సభలో అభినందించారు. కొనకనమిట్ల మండల తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఆటల పోటీల్లో పాల్గొనడంతో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే తత్వం అలవడుతుందన్నారు. కరాటేలో రాణించే విధంగా శిక్షణ ఇచ్చిన రాజు తల్లిందండ్రులను అభినందించారు. అనంతరం కరాటే మాస్టర్‌ను తల్లిదండ్రులు చిట్టెం లింగయ్య, షేక్ బాజీ, బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి క్రీడాకారుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.



విద్యార్థులకు పత్రాలను అందజేసి అభినందిస్తున్న తహసీల్దార్



సప్లై చానల్‌లో ఉన్న వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్

సప్లై చానల్‌లో చెత్త వేస్తే చర్యలు

గిద్దలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సప్లై చానల్‌లో చెత్తాచెదారాన్ని వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణబాబు హెచ్చరించారు. పట్టణంలోని రాచర్ల గేటు అవతల ఉన్న పలు వీధులను మంగళవారం పరిశీలించారు. రోడ్లపై, కాలువల్లో చెత్త వేయకూడదని, ఇళ్ల వద్దకు వచ్చే చెత్త రిక్షాలలో మాత్రమే చెత్తను వేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆప్రాంతం గుండా వెళ్లే సగిలేరు సప్లై చానల్ చెత్తాచెదారంతో పూడిపోయి ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి, దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిన వైనాన్ని పరిశీలించారు. సప్లై చానల్‌లో చెత్తను వేయొద్దని ఆకాలువ వెంట ఉండే కుటుంబాలకు సూచించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఆహార నాణ్యతపై పేదలను ఆరా తీశారు. పరికరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చూసుకోవాలని నిర్వాహకులకు కమిషనర్ సూచనలు చేశారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి

పెద్దదోర్నాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ అధ్యక్షుడిగా తనను ప్రభుత్వం నియమించినట్లు బట్టు సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సభ్యులుగా సోమేపల్లి శేఖర్, కేతి వెంకట మురళిని నియమించినందులకు ప్రభుత్వానికి, ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

చెత్తను కార్మికులకు అందజేయాలి

బేస్తవారపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో ఏపీ రంగనాయకులు తనిఖీ చేశారు. గ్రామంలోని ప్రజలతో మాట్లాడుతూ ప్రజలు పొడి, తడి చెత్తను వేరువేరుగా ఉంచి గ్రామ పంచాయతీ సిబ్బంది మీ ఇంటి వద్దకు ప్రతి రోజు వస్తారని వారికి అందజేస్తే దానిని చెత్త సంపద కేంద్రనికి తరలిస్తారని తెలిపారు. దీంతో గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.జమాల్ పాల్గొన్నారు

రాచర్లలో వీధి లైట్ల ఏర్పాటు

రాచర్ల, జూలై 8 (ఆంధ్ర జ్యోతి) : రాచర్లలో పంచాయతీ కార్యదర్శి ఎంవీ నాయక్ మంగళవారం వీధి లైట్లను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రధాన రహదారితోపాటు వీధుల్లోని అంతర్గత రోడ్లలో కూడా దాదాపు 150 ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లైట్ల ఏర్పాటు, తాగునీరు, పారిశుధ్యంపై నిరంతరం దృష్టి సారిస్తున్నామని అన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

గిద్దలూరు టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీని వైద్య సిబ్బంది నిర్వహించారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో డెంగీ వ్యాధి మాసోత్సవ ర్యాలీని ప్రధాన వీధుల్లో నిర్వహించారు. దోమల ద్వారా డెంగీ వ్యాధి వస్తుందని, దోమలు పెరగకుండా ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఒంటిపై దద్దుర్లు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ చంద్ర, డాక్టర్ భార్గవ, మలేరియా యూనిట్ ఆఫీసర్ ఐ.రమేష్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు సుధారాణి, రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంభం : డెంగీ మాసోత్సవాల సందర్భంగా కంభం మండలం తురిమెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు. ఈసందర్భంగా ర్యాలీలో పాల్గొన్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం మారిన వాతావరణంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ గృహాల పరిసరాల్లో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. డెంగీ వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ పర్వీన్, డాక్టర్ సతీష్‌బాబు, ఎన్‌ఈబీడీసీపీ సిబ్బంది చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ కాలనీకి నూతన డ్రైనేజీ మంజూరు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 16వ వార్డు భగత్‌సింగ్ కాలనీలో నూతన డ్రైనేజీ కోసం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రూ.40లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, కౌన్సిలర్ హర్షితాబాబీ వార్డులో పర్యటించి డ్రైనేజీ నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు పరిశీలించారు. గత కొన్నేళ్లుగా భగత్‌సింగ్ కాలనీలో డ్రైనేజీ కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కౌన్సిలర్ కృతజ్ఞతలు తెలిపారు. 10 రోజులలో పనులు ప్రారంభిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈలో భూపాల్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు నివాళి

గిద్దలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయం తిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. రాచర్లగేటు సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాం గ్రెస్ ఇన్‌చార్జి పగడాల రంగస్వామి, పట్టణశాఖ అధ్యక్షుడు మునగనూరి సత్యనారాయణ, గిద్దలూరు, రాచర్ల మండలశాఖల అధ్యక్షులు నాగేశ్వరరావు, జమాల్ పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ తప్పనిసరి

రాచర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో రికార్డుల నిర్వహణ తప్పనిసరి అని బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వి గిరిధర శర్మ అన్నారు. మంగళవారం ఆయన కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇటీవల విద్యార్థులకు పంపిణీ చేసిన సామగ్రి సమాచారాన్ని ప్రిన్సిపాల్ మాలకొండమ్మను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వివరాలు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య, రుచికరమైన భోజనం తప్పకుండా అందించాలని సూచించారు. సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు.

ఎర్రగొండపాలెం, జులై 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో చేతివృత్తిదారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం తహశిల్దార్ కార్యాలయం ఉద్యోగి వినతి పత్రం అందజేశారు. చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి కే వి కిష్టగౌడ్ మాట్లాడుతూ చేతివృత్తిదారులకు వయస్సుతో సంబంధం లేకుండ , స్వంత పూచీకత్తుపై రుణాలు మంజూరు చేయాలని అన్నారు.ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా ప్రతి కుటుంబానికి 2లక్షలు తగ్గకుండ రుణం మంజూరుచేయాలని డిమాండు చేశారు.

రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, జూలై8 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం రైల్వే స్టేషన్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అతడు అనారోగ్యంతో మృతి చెంది ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా ఈ ప్రాంతంలోనే సంచరిస్తున్నట్లుగా స్థానికులు తెలిపారని అన్నారు. గుంటూరుకు వైద్యం చేయించుకుని మధ్యలో మార్కాపురం రైల్వే స్టేషన్‌లో దిగి ఇక్కడ మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలం వద్ద వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన రూరల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

బైకుపై నుంచి జారిపడి మహిళ మృతి

ముండ్లమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేముల గ్రామానికి చెందిన గుజ్జుల శైలజ(46) మంగళవారం ఉపాధి పనులకు వెళ్లివస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందారు. బైకుపై ఇంటికి వస్తుండగా జారి కిందపడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే ఏపీవో వెంకటరావు శైలజ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ గజ్జల వెంకటరెడ్డి ఉన్నారు.

డ్రైనేజీ కాలువలో పడి వ్యక్తి మృతి

ముండ్లమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూరిమెట్ల గ్రామానికి చెందిన నిడిగంటి వెంకటేశ్వర్లు(65) సోమవారం రాత్రి డ్రైనేజీ కాలువలో పడి మృతిచెందాడు. గ్రామంలో ప్రధాన రహదారి పక్కన డ్రెయినేజ్ కాలువ వద్ద కల్వర్టుపై కూర్చొని ప్రమాదవశాత్తు డ్రైనేజీలో కాలువలో పడి పోయాడు. ఆ సమయంలో ఎవ్వరూ చూడలేదు. ఆతర్వాత గ్రామస్థులు చూసి వెంకటేశ్వర్లుగా గుర్తించారు. మృతునికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు.

జూదరుల అరెస్టు

ముండ్లమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలవరం గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో మంగళవారం ఎస్ఐ కె.కమలాకర్ తన సిబ్బందితో దాడిచేశారు. పది మంది పేకాట రాయుళ్లను అరెస్టుచేసి రూ. 10,190 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కమలాకర్ తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ పీవీ హనుమంతరావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ప్రేమానిధి, మరియబాబు, మహేష్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేయాలి

ముండ్లమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేయాలని ఎంపీడీవో ఎం.శ్రీదేవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2-0పై జరిగిన శిక్షణలో ఆమె మాట్లాడారు. 2023- 24 సంవత్సరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, పథకాలు ఏమేరకు ప్రజలకు అందాయి, 2025-26లో ఏఏ పనులు చేపట్టాలి , ప్రజలకు ఏవి అవసరమో గుర్తించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పేదరికంలో ఎన్ని కుటుంబాలున్నాయో సర్వే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ఎం.వెంకటేశ్వర్లు, ఏఈవో శ్రీకీర్తి, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ముండ్లమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి తిరుమలరావు అన్నారు. మంగళవారం మండలంలోని శంకరాపురం, నూజెళ్లపల్లి గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకుండా సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్నారు. ఈసందర్భంగా రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న పైరును పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.నారాయణస్వామి, జె.ప్రభాకర్, ఎం.కోటయ్య, అనూష, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పామూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ టి.కిశోర్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీచైతన్య హైస్కూల్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల అలవాటుతో ఆరోగ్య సమస్యలతో పాటు సమాజంలో గౌరవం దెబ్బతింటుందన్నారు. అనంతరం పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈవ్ టీజింగ్‌తో కలిగే నష్టాలు గురించి మాట్లాడారు. అలాగే పట్టణంలో పలు పాఠశాలల వద్ద ఉన్న దుకాణాలను తనిఖీచేసి పలు సూచనలు చేశారు.

పామూరులో ఏబీవీపీ ర్యాలీ

పామూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యార్థుల డే సందర్భంగా మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సరస్వతి శిశుమందిర్ పాఠశాల నుండి పట్టణంలో పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బత్తుల రామాంజనేయులు, జిల్లా కన్వీనర్ గురునాథ్, కదిరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 8(ఆంధ్రజ్యోతి): పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటాలని ఎంఈవో జె.ప్రసాదరావు అన్నారు. మంగళవారం ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10న జరిగే మెగా పీటీఎంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షణకు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా 2,411 మొక్కలను పంపిణీ చేశారు.

విధ్వంసం నుంచి వికాసం వైపు..

- గాడిన పడుతున్న రాష్ట్రం
- అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ విమర్శలు
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



మల్లంపేటలో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దొనకొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రంలో పాలన సాగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా మంగళవారం మండలంలోని మల్లంపేట, కొచ్చెర్లకోట పంచాయతీల్లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అరాచకం సాగిందని ధ్వజమెత్తారు. దొనకొండ మండలంలో పేదల వలసలను నివారించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేలా పారిశ్రామిక అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. దొనకొండలో విమానాశ్రయ ప్రాంతాన్ని పారిశ్రామిక ప్రాంతంగా మార్చేందుకు కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో చర్చించినట్లు చెప్పారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో సోలార్‌పార్క్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు విధ్వంసాన్ని కొనసాగించేందుకు విద్వేషాలు రెచ్చగొడుతూ పర్యటనలు సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మండల అధ్యక్షుడు మోడి ఆంజనేయులు, నాగులపాటి శివకోటేశ్వరరావు, పులిమి రమణాయాదవ్, షేక్ మగ్బూల్‌అహమ్మద్, మోడి వెంకటేశ్వర్లు, వల్లపునేని వెంకటస్వామి, వడ్లమూడి చెన్నయ్య, కామేపల్లి చెంచయ్య, కందుల నారపురెడ్డి, మన్నెం గాలయ్య, కొమ్మతోటి సుబ్బారావు, పత్తి వెంకటేశ్వర్లు, యరగొర్ల బసవయ్య, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, విప్పర్ల శేషు, సింగమనేని హనుమంతు, కుందుర్తి లక్ష్మణ్, వైకే చౌదరి, పెమ్మసాని లక్ష్మీనారాయణ, వల్లపునేని కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు దారుణం

దర్శి, జూలై 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నాయకుడు నల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయటం శోచనీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదలచేశారు. వైసీపీ నేతలకు మహిళల పట్ల గౌరవం లేదన్నారు. అనేక సందర్భాల్లో మహిళలను కించపర్చే విధంగా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ప్రశాంతిరెడ్డి వ్యక్తిగత జీవితాన్ని ఉద్దేశించి మాట్లాడటం దారుణమన్నారు. వైసీపీ నాయకులు అనుసరించిన వైఖరి వలనే గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పి 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. ఇప్పటికైనా బుద్ధితెచ్చుకొని గౌరవప్రదంగా వ్యవహరించాలని సూచించారు. వైసీపీ నాయకులు గతంలో మాదిరిగా వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు దక్కకుండా పోతాయని స్పష్టం చేశారు. మహిళలపై దాడులు, అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

దొనకొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని దర్శి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మల్లంపేట గ్రామంలో ఉపాధిహామీ పథకం నిధులతో రైతులకు ఉచితంగా మంజూరైన పండ్ల మొక్కలను మంగళవారం ఆమె పంపిణీ చేశారు. ఈసందర్భంగా రైతుల పొలాల్లో మొక్కలు నాటి మాట్లాడారు. గ్రామాల్లో సన్న, చిన్నకారు రైతులకు ఐదు ఎకరాల వరకు పూర్తి సబ్సిడీతో పండ్ల తోటలను పెంచుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మోడి ఆంజనేయులు, శివకోటేశ్వరరావు, ఏపీవో కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

- డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు



పూరిమెట్లలో మురుగు కాలువను పరిశీలిస్తున్న డీపీవో

ముండ్లమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు అన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులపై ఉందన్నారు. మంగళవారం మండలంలోని పూరిమెట్ల గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని మురుగు కాలువలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలు అధ్వానంగా ఉంటే వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఎప్పటికప్పుడు గ్రీన్ అంబాసిడర్ల ద్వారా మురుగు కాలువలను శుభ్రం చేయటంతో పాటు వీధుల్లో పేరుకుపోయిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామంలో మౌలిక వసతులకు ఖర్చు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారిని గుర్తించి, వారికి ప్రతి పథకాన్ని వర్తించే విధంగా చూడాల్సిన బాధ్యత ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల చెంతకు చేరాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలుచేసి అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆర్.జనార్దన్, పంచాయతీ కార్యదర్శి బి.వేణు, టీడీపీ నాయకుడు చింతపల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికీ సంక్షేమ ఫలాలు'



హనుమంతునిపాడు మండలం వేములపాడులో కరపత్రాలు పంపిణీచేస్తున్న సానికొమ్ము తిరుపతిరెడ్డి

కనిగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఇంటింటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో మంగళవారం కనిగిరి పట్టణంతో పాటు వివిధ గ్రామాలు, హెచ్‌ఎంపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో టీడీపీ నేతలు ఇంటింటిని సందర్శించి ఏడాదిలో అందించిన సుపరిపాలనపై ప్రజలకు వివరించారు.

కనిగిరి మున్సిపాల్టీ పరిధిలోని 19వ వార్డులో తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్ ఆధ్వర్యంలో ఇంటింటిని సందర్శించి ఏడాది సుపరిపాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు సంక్షేమ పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అహ్మద్, ఐవీ నారాయణ, పీర్ల మస్తాన్‌వలి, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, అహ్మద్, డీలర్ ఫిరోజ్, తులసి తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో మండలపార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్) వేములపాడు, నల్లగండ్ల, తిమ్మారెడ్డిపల్లి, పాపిరెడ్డిపల్లి, వాలిచర్ల గ్రామాలలో ఏడాది సుపరిపాలనపై ప్రజలకు వివరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో గాయం తిరుపతి, తాతపూడి స్టాలిన్, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, రెడ్డెం తిరుపతిరెడ్డి, దశరథ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పామూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పామూరు మండలంలోని బలిజపాలెం, బొట్లగూడూరు, గోపాలపురం గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, వై.బాల, కోటపాటి వెంకటేశ్వర్లు, రేగలగడ్డ కోటేశ్వరరావు, జి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు

ముండ్లమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని నూజెండ్లపల్లి, భట్లపల్లి గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. రానున్న నాలుగు సంవత్సరాల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సుంకర రామవరెడ్డి, బరిగ రామలక్ష్మయ్య, అంజయ్య, బాబు నాయక్, కిలారి ఆంజనేయులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల ప్రగతిపై దృష్టి సారించాలి

- మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

తాళ్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల ప్రగతిపై సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని బీసీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ సమావేశం హాలులో పంచాయతీల పురోగతి సూచికపై జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు పేదవర్గాలకు అందేలా సచివాలయ సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ప్రధానంగా తాగునీరు, ఆరోగ్యంపై దృష్టి సారించి పెట్టాలన్నారు. మండలస్థాయి అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని జిల్లాలో అగ్రగామిగా నిలిచేలా చూడాలన్నారు. రిసోర్స్ పర్సన్ కల్యాణ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. గ్రామపంచాయతీ పురోగతి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పలు అంశాలపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి సానికొమ్ము సత్యం, ఎంఈవో జి.సుబ్బయ్య, ఏపీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.


విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

తాళ్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 10న జరుగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలకు సంబంధించి ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సమావేశాలకు ప్రొటోకాల్ ప్రకారం అందరికి ఆహ్వానాలు పంపాలన్నారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాల్లో చదువుకునే పిల్లలందరికీ ప్రభుత్వం తల్లికి వందనం నగదు జమచేస్తూ విద్యనభ్యశించేలా చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులకు పచ్చదనంపై అవగాహన కల్గించాలన్నారు. గ్రీన్ పాస్‌పోర్ట్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జి.సుబ్బయ్య, ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు, హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేయాలి

పీసీపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికలు తయారుచేయాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. మంగళవారం పంచాయతీల పురోగతి సూచికపై సచివాలయ సిబ్బందికి స్థానిక మండలపరిషత్ సమావేశపు హాలులో జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. తమ పరిధిలోని పంచాయతీల అభివృద్ధికి సంబంధిత ఉద్యోగులు ప్రణాళికలు తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సంజీవి, శ్రీనివాసులు, ఏఈ తిరుపాలయ్య, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఈఆర్‌వో జాన్సన్, పాల్గొన్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో బీఎల్‌వోల విధులు ఎంతో ప్రాముఖ్యమైనవని దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.జాన్సన్ పేర్కొన్నారు. బీఎల్‌వోలు గ్రామాల్లో బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. స్థానిక విశ్వభారతి విద్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఓటర్ల నమోదు, చనిపోయినవారిని తొలగించటం, సవరణలు తదితర బాధ్యతలపై బీఎల్‌వోలకు భారత ఎన్నికల కమిషన్ శిక్షణ ఇస్తుందన్నారు. శిక్షణలో అన్నివిషయాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు. ఏ సమయంలో ఎటువంటి దరఖాస్తులు పెట్టుకోవాలనే అంశాలపై బీఎల్‌వోలు అవగాహన కలిగిఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్లు ఎలా ఉన్నాయి, పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా, తదితర సమాచారంపై అవగాహనతో ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఏవిధంగా రికార్డు నమోదు చేస్తారో పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలు పేర్కొనే అంశాలే కీలకమన్నారు. ఈసందర్భంగా బీఎల్‌వోలకు కేంద్ర ఎన్నికల కమిషన్ సూచించిన అనేక అంశాలను ప్రొజెక్టర్ ద్వారా వివరిస్తూ శిక్షణ ఇచ్చారు. అనంతరం ప్రతి బీఎల్‌వోకు శిక్షణకు సంబంధించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కనిగిరి ఏఎంసీ వైస్‌చైర్మన్‌గా పాలపర్తి వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

పామూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా పామూరు మండలం తూర్పుకట్టకిందపల్లికి చెందిన పాలపర్తి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. మండలంలోని పడమటకట్టకిందపల్లికి చెందిన టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు సతీమణి రమాదేవి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన సంగతి తెలిసిందే. ఒకే మండలానికి ఏఎంసీ, వైస్ ఏఎంసీల పదవులు దక్కడం ఇదే ప్రథమం కావడం విశేషం. తనపై ఉగ్ర ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పాలపర్తి తెలిపారు.

వైఎస్‌కు నివాళి



కేకు కట్‌చేసి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డికి తినిపిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

దర్శి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు దర్శిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గడియారస్తంభం సెంటర్, రెడ్డి కాంప్లెక్స్ వద్ద వైఎస్ విగ్రహాలకు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. ఈసందర్భంగా అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనిగిరి: అధికారంలో వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వైసీపీ నేతలు కదిరి బాబూరావు, దద్దాల నారాయణయాదవ్, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్ జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక పవిత్ర ఫంక్షన్ హాలులో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జడ్పీటీసీ కస్తూరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: దొనకొండలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద కేకు కట్‌చేసి అభిమానులకు పంచారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: ముండ్లమూరు బస్టాండ్ సెంటర్లో వైఎస్ విగ్రహానికి జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లూరు: తాళ్లూరులో వైసీపీ మండల అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి, బెల్లంకొండవారిపాలెంలో మాజీ ఎంపీపీ పోశం మధుసూదనరెడ్డిలు మంగళవారం వైఎస్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు.

అన్నిప్రాంతాల్లో మురుగుకాల్వలు నిర్మిస్తాం

దర్శి, జూలై 8(ఆంధ్రజ్యోతి): దర్శి మున్సిపాలిటీ పరిధిలోని అన్నిప్రాంతాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలను నిర్మించి అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. దర్శిలోని 4వ వార్డులో వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, కమిషనర్ వై.మహేశ్వరరావుతో కలిసి మంగళవారం పర్యటించారు. అక్కడ మురుగునీరు నిల్వ ఉన్న కాలువను పరిశీలించారు. ఈప్రాంతంలో మురుగు క్లావలు నిర్మించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, దినకర్, నక్కా రంగా తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలి

ముండ్లమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలని ఎంపీడీవో ఎం.శ్రీదేవి అన్నారు. పండ్ల తోటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. మంగళవారం మండలంలోని పసుపుగల్లులో ఆమె మొక్కలు నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఐదు ఎకరాలలోపు పొలం ఉన్న ప్రతిరైతు పండ్ల తోటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో టి.వెంకటరావు, ఈసీ శివరామకృష్ణ, వరగాని పోలు, పందుగుల శ్రీనివాసరెడ్డి, చింతల రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పీసీపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ఎస్ఐ జి.కోటయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు తప్పనిసరిగా కార్డులు తీసుకోవాలి

పామూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని ఏవో టి.అబ్రహంలింకన్ అన్నారు. ప్రభుత్వం నుంచి రాయితీలు రావాలంటే ఈ కార్డు ఉండాలన్నారు. మంగళవారం మండలంలోని పడమటకట్టకిందపల్లి, చిలంకూరులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఏ.మల్లికార్జున, వై . కోటిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పీసీపల్లి: కౌలు రైతులు తప్పనిసరిగా కౌలుకార్డులు పొందాలని మండల వ్యవసాయ అధికారి ఎన్.రంగాక్రిష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని గుంటుపల్లి, పీసీపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కౌలు కార్డులు ఉంటేనే ప్రభుత్వ రాయితీ పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఆవులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెలిగండ్ల, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాటిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గోనా నాగభూషణం వారంరోజుల క్రితం ప్రమాదవశాత్తు తాటి మొద్దు పడటంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి మంగళవారం గుడిపాటిపల్లి గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతిని భార్య సుజాతకు రూ.పదివేలు అందజేశారు. కార్యక్రమంలో ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, ఇంద్రభూపాల్ రెడ్డి, ప్రతాప్, కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థినులకు అవగాహన

తాళ్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి):చెడుగా ప్రవర్తించే వారిపట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కలిగించారు.

రైతులకు మెరుగైన విద్యుత్

ముండ్లమూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన విద్యుత్ అందిస్తామని ఏడీఈ రవికుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని శంకరాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. అనంతరం నూజెండ్లపల్లి గ్రామం వెళ్ళి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈ టి.చిన అంకబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠినచర్యలు

ముండ్లమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కమలాకర్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మారెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న చిల్లర దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.



పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే ఉపేక్షించం : ఎస్పీ

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : విద్యాసంస్థల సమీపంలో సిగిరెట్లు, పాన్, గుట్కా, గంజాయి, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే ఉపేక్షించమని ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌ల సిబ్బంది ఆపరేషన్ సేఫ్ క్యాంప్ జోన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాసంస్థల సమీపంలోని దుకాణాలు, బడ్డీకొట్టులలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఈగల్ చీఫ్ ఆర్.రవికృష్ణ సూచనల మేరకు ఈగల్‌సెల్ సిబ్బంది కూడా ఈ తనిఖీలలో పాల్గొన్నారు.



రేపల్లె మెయిన్ డ్రెయిన్‌లో మందు స్ప్రే చేసి వదిలేసిన దృశ్యం

పనులు చేస్తే.. ఇదేంది?

- రూ.కోటిన్నరతో డ్రెయిన్ల మరమ్మతులు మమ
- మందు స్ప్రే చేసి వదిలేయడంతో ఎండిన గుర్రపుడెక్క

వేమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే వెదనాట్లు ప్రారంభించడంతో పాటు నారుమళ్లు పోస్తున్నారు. అయితే గత ఐదేళ్లలాగే ఈ సారి కూడా సాగునీరు తిప్పలు తప్పవేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి సంఘాల రాకతో కాల్వల దుస్థితి మారుతుందని రైతులు ఆశించగా మరమ్మతులు మమ అనిపిస్తుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వేమూరు నియోజకవర్గ పరిధిలోని కాల్వల మరమ్మతులకు రూ.కోటిన్నర కేటాయించారు. ఆ నిధులు సరిపోవని భట్టిప్రోలు, రేపల్లె, తుంగభద్ర, గుండేరు, అమృతలూరు, కావూరు, గుండ్లపల్లి, మోపర్రు, రేపల్లె ట్రాక్, పర్ర చానల్ డ్రెయిన్లు మరమ్మతుల విషయంలో అసంపూర్తిగా పనులు చేపట్టారు. డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు నకు మందు స్ప్రే చేసి వదిలేశారు. దీంతో అది ఎండిపోయి కాల్వల నిండా పేరుకుపోయింది. గుండేరు, జంపని డ్రెయిన్లలో చెత్తాచెదారం పేరుకుని పూర్తిగా మూసుకుపోయా యి. మరికొన్ని చోట్ల గుర్రపు డెక్క నివారణకు కనీసం మందు కూడా స్ప్రే చేసిన దాఖలాలు కూడా లేవు. డెల్టా కాల్వలకు సాగునీరు విడుదల చేసినా కాల్వల దుస్తితి మారకపోవడంతో నీటికి అల్లాడాల్సిందేనని రైతులు వాపోతున్నారు. తుంగభద్ర రైల్వేట్రాక్ పర్రా చానల్, అమృతలూరు, కావూరు, గుండ్లపల్లి, మోపర్రు, ప్రధాన కాల్వలు, బీఎం డ్రెయిన్, రేపల్లె, భట్టిప్రోలు కాల్వల దుస్థితి సక్రమంగా లేని కారణంగా నీరు ముందుకు సాగకపోగా ఎ దురు తన్నే పొలాలను ముంచేస్తుందని దీనివల్ల సాగు విషయంలో సమస్యలు ఏర్పడతాయని రైతులు వాపోతున్నారు.



రేపల్లె మెయిన్ డ్రెయిన్ ఎగువున పేరుకుపోయిన గుర్రపు డెక్క

అసైన్డ్ అక్రమాలు అలాగే..

- చర్యలపై అడుగుముందుకు పడితేఒట్టు
- వివిధ వేదికలపై దాదాపు 850పైగా ఫిర్యాదులు
- ఏడాదిగా విచారణలు, పరిశీలనలతో హడావిడి
- ఫ్రీహోల్డ్ భూములపైనా నివేదికలకే పరిమితం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అసైన్డ్ భూముల అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టేది లేదని అసెంబ్లీ వేదికగా కూటమి పాలకులు అట్టహాసంగా ప్రకటించారు. అసైన్డ్ భూముల అవకతవ కలకు సంబంధించి వివిధ వేదికలపై నుంచి దాదాపు 850 ఫిర్యాదులు ప్రభుత్వం వద్దకు చేరాయి. అయితే పరిశీలనలు, నివేదికలు, విచారణల హడావిడితోనే ఏడాది గడిచిందే తప్ప అక్రమార్కులపై తీసుకున్న చర్యలు లేవు. నివేదికల ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమి స్తుందని ఆశించిన వారిలో నిరాశ నెలకొంది. నిరుపేద లకు ఇచ్చిన ప్రభుత్వ భూమి కేవలం అనుభవించడానికే తప్ప చేతులు మారడానికి వీలు లేదని అసైన్డ్ చట్టం స్పష్టంగా నిర్వచిస్తోంది. కానీ ఇవేవీ పట్టకుండా కేవలం అగ్రిమెంట్ల ప్రాతిపదికన నిరుపేదల ఆర్థిక అవసరాలు అసరాగా చేసుకుని అసైన్డ్ అక్రమాలు గత ఏలుబడిలో యధేచ్ఛగా జరిగాయి. 2003కు ముందు ప్రభుత్వం దగ్గర నుంచి భూమి పొందిన పేదలకు దానిపై యాజమాన్య హక్కు పొందేలా వైసీపీ ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. దీనిని ఆసరాగా చేసుకుని వేల ఎకరాల అసైన్డ్ భూములను వైసీపీ కీలక నేతాగణంతో పాటు వారి అనుచరులు ఫ్రీ హోల్డ్ చేయించుకున్నారన్న ఆరోపణలు అప్పట్లో పెద్ద ఎత్తున వచ్చాయి. నాలుగు దశాబ్దాల వ్యవధిలో చీరాల, బాపట్ల పరిధిలో దాదాపు 23,000 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు అసైన్డ్ చేసినట్లు రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి. ఇందులో ప్రస్తుతం 3,000 ఎకరాలు కూడా పేదల దగ్గర లేదని సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే దాదాపు 6,000 ఎకరాల అసైన్డ్ భూమి చేతులు మారినట్లు తెలుస్తోంది. ఫ్రీహోల్ ముసుగులో వైసీపీ నేతలు అసైన్డ్ అక్రమాలకు తెరలేపారు. ఇదే విషయాన్ని కూటమి ప్రభుత్వం కూడా ధ్రువీకరించింది. జిల్లా వ్యాప్తంగా 3,300 ఎకరాలు ఫ్రీహోల్ చేసినట్లు అధికారులు గుర్తిం చారు. మొత్తం ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో 15 శాతం అనర్హులేనని విచారణలో తేలింది. ప్రభుత్వం మారగానే ఫ్రీహోల్డ్ చేసిన భూముల రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేసిం దే. కానీ సదరు అక్రమార్కులపై ఇప్పటికీ చర్యలు దిశగా ఒక్క అడుగు ముందుకు పడకపోవడం గమనార్హం.



బాపట్ల రూరల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చేతులు మారిన అసైన్డ్ భూమి

గత పాలనలో ఎన్నెన్నో వింతలు..

అసైన్డ్ భూమిని కొనడమే చట్టవిరుద్ధమని నిబంధనలు చెబుతుంటే గత ప్రభుత్వం ప్రారంభించిన మెడికల్ కళాశాల నిర్మాణానికి ఓ దాత అసైన్డ్ భూమిని విరాళంగా ఇచ్చారని ఆయనకు ప్రభుత్వ పెద్దలు సన్మానం చేయడం గమనార్హం. నిరుపేదల నుంచి అసైన్డ్ భూమిని కొనుగోలు చేయడమే నేరమైతే దానిని ప్రభుత్వం విరాళంగా తీసుకోవడం మరో విడ్డూరం. ప్రభుత్వ ఉద్యోగులంతా కలిసి బాపట్ల పరిధిలో అసైన్డ్ భూమి పెద్ద ఎత్తున కొనుగోలు చేయడంతో పాటు అక్కడ ప్లాట్లు పంచుకోవడం వైసీపీ ప్రభుత్వంలో మరో అడ్డగోలు అసైన్డ్ దందా. ఇలాంటి లీలలు గత ప్రభుత్వ పాలనలో లెక్కలేనన్ని జరిగాయి. వీటన్నింటిపై ప్రభుత్వం నివేదికలు గతంలోనే తెప్పించుకుంది. కానీ చర్యలేమిటన్నదానికే ఇప్పటికీ సమాధానం లేదు.



కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా పాలన

ఆర్టీసీ బస్సులు ప్రారంభోత్సవంలో మంత్రులు



బస్‌లో ప్రయాణిస్తున్న మంత్రులు, రాంప్రసాద్‌రెడ్డి, రవికుమార్

అద్దంకి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్‌కు రెండు సూపర్‌లగ్జరీ బస్సులు, శ్రీశైలానికి రెండు, తిరుపతికి ఒక ఎక్స్‌ప్రెస్ బస్సును మంగళవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో ఆర్టీసీని నిర్వీర్యం చేయడంతో పాటు దివాళా తీయించిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన శాఖల వలే ఆర్టీసీని కూడా గాడిలో పెట్టి అభివృద్ధి పథం వైపు నడిపిస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 1470 కొత్త బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నామన్నారు. అద్దంకిలో పాత బస్టాండ్ స్థానంలో నూతనంగా బస్టాండ్ నిర్మించనున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్టీసీని సామాన్య ప్రజానికానికి చేరువ చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఏడాదిలో అద్దంకి డిపోలో 12 కొత్త బస్సులు ప్రారంభించినట్లు చెప్పారు. ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని రంగాల అభివృద్ధికి కృతనిశ్చయంతో ఉందన్నారు. మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి ప్రారంభించిన బస్సులో బంగ్లారోడ్డు వరకు ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్, డిప్యూటీ సీటీఎం రవి కాంత్, డీపీటీవో సామ్రాజ్యం, అద్దంకి, బాపట్ల, చీరాల డీఎంలు రామ్మోహనరావు, శ్రీమన్నారాయణ, శ్యామల, అసిస్టెంట్ డీఎం మహబూబీ, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర పాల్గొన్నారు.

వీధులకు త్రివర్ణ వెలుగులు



త్రివర్ణ పతాక రంగు విద్యుత్ దీపాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగేశన, బావుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు తదితరులు

బాపట్ల సుందరీకరణకు చర్యలన్న ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణ ప్రధాన వీధులు త్రివర్ణ పతాక రంగుల వెలుగులతో నిండి బాపట్ల కొత్తబస్టాండ్ కూడలిలో త్రివర్ణ పతాక రంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసిన స్తంభాలు —రు. మూడు రంగుల విద్యుత్ దీపాలను ప్రధాన వీధుల్లోని సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు అమర్చారు. గడియార స్తంభం కూడలిలో ఈ దీపాలను మంగళవారం స్విచ్‌ను మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. దీంతో జీబీసీ రోడ్డు, సూర్యలంక రోడ్డు, జమ్ములపాలె రోడ్లు మూడు రంగుల దీపాలు త్రివర్ణ కాంతులు విరజిమ్ముతున్నాయి. బాపట్ల సుందరీకరణలో భాగంగా త్రివర్ణ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వైసీపీ పాలకుల వలే కాకుండా దేశభక్తిని చాటేలా త్రివర్ణ రంగులతో దీపాలను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణ సుందరీకరణకు సహకరిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల కొత్తబస్టాండ్ కూడలిలో త్రివర్ణ పతాక రంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసిన స్తంభాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు చేపట్టాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో డెంగ్యూ, చికెన్ గూన్యా, మలేరియా వైరల్ ఫీవర్ వంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ అమరావతి సచివాలయం నుంచి మంగళవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌కు బాపట్ల నుంచి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ జ్వరాల కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నీరు నిల్వకుండా చూడాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన ఔషధాలను నిల్వ చేసుకోవాలన్నారు. నిర్లిప్తంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూమిలో కుళ్లిపోయే వ్యర్థాలను పచ్చకుండీలలో వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెల్టా, సాగర్ కాల్వలు నుంచి నీరు విడుదల అవుతున్నందున చెరువులను నింపుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీపీవో ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌డీఈ కటికల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మరో ఐదు అన్న క్యాంటీన్లు!

- ఒక్కోటి రూ.61 లక్షలతో నిర్మాణం
- రూ.3.05 కోట్ల నిధుల విడుదల
- అక్టోబరు 2న ప్రారంభించడమే లక్ష్యం

(కొల్లూరు, ఆంధ్రజ్యోతి)

అన్న క్యాంటీన్‌లు పేదల కడుపు నింపుతున్నాయి. పట్టణాలకే పరిమితమైన క్యాంటీన్‌లను మండల కేంద్రాలకు ప్రభుత్వం విస్తరిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మరో ఐదు క్యాంటీన్‌ల నిర్మాణం చేపడుతోంది. ఒక్కొక్క క్యాంటీన్ రూ.61 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. క్యాంటీన్ భవనాలు, ఫర్నీచర్ తదితర వసతులకు రూ.3.05 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయింది. అక్టోబరు 2న కొత్త క్యాంటీన్‌లు ప్రారంభించాలని ప్రభుత్వం సంకల్పించింది. పబ్లిక్ హెల్త్ శాఖ పనులు నిర్వహిస్తోంది.

స్థల కేటాయింపు పూర్తి

పల్నాడు జిల్లాలోని అమరావతి, గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, ఫిరంగిపురం, దుగ్గిరాల, బాపట్ల జిల్లాలోని బట్టిప్రోలులో కొత్తగా అన్న క్యాంటీన్‌ల నిర్మాణం చేపడుతున్నారు. ఒక్క ఫిరంగిపురం మినహా మిగతా నాలుగు చోట్ల స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. స్థలాలను పబ్లిక్ హెల్త్ శాఖకు అప్పగించారు. పట్టణాల్లో ఈ శాఖ ఆధ్వర్యంలోనే క్యాంటీన్‌లను నిర్మించారు. మండల కేంద్రాల్లో కూడా అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తామని పేదలకు ఇచ్చిన ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. పట్టణాల తరహాలోనే ఈ ఐదు చోట్ల క్యాంటీన్‌లు ప్రారంభించి రుచికరమైన భోజనం, అల్పాహారం రూ.5కే పేదలకు అందిస్తారు. రోజుకు రూ.15 చెల్లిస్తే.. మరో 2,500 మంది పేదలకు ఆహారం అందించేందుకు ప్రభుత్వ చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది.

సొసైటీలకు.. త్రిసభ్య కమిటీలు

- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఒక్కో సొసైటీకి చైర్‌పర్సన్.. ఇద్దరు సభ్యులు
- ఎమ్మెల్యేలు పంపిన పేర్లను ఆమోదించిన ప్రభుత్వం
- మూడు జిల్లాల్లో 93 సొసైటీల్లో 279 మందికి పదవులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలక వర్గాలుగా త్రిసభ్య కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కొన్ని నెలల తరబడి చేస్తున్న కసరత్తు ఎట్టకేలకు ఒక కొలిక్కివచ్చింది. గత నెలలో సొసైటీల నిర్వహణ బాధ్యతలను అధికారులకు ప్రభుత్వం అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పట్లో సహకార ఎన్నికలు లేవని రైతులు నిరాశ చెందారు. పైగా వైసీపీ హయాంలో ప్రవేశపెట్టిన త్రిసభ్య కమిటీలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో రైతు నేతల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ క్రమంలో సొసైటీల్లో అధికారుల పాలన ఈ నెల 30తో ముగియనున్నది. దీంతో త్రిసభ్య కమిటీల నియామకానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పైగా ఆయా కమిటీల్లో పలువురికి పదవులు దక్కడంతో నేతల్లో హర్షం వ్యక్తమవుతోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తొలివిడతలో 93 సొసైటీలకు

(మిగతా 6లో)



అన్నవరం సొసైటీ కార్యాలయం

తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమార్తె

● ఐదు గంటల్లో గుర్తించిన పోలీసులు

● కుటుంబసభ్యులకు అప్పగింత

నాగులుప్పలపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి అదృశ్యమైన బాలికను నాగులుప్పలపాడు పోలీసులు ఐదు గంటల్లో గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బి.నిడమానూరు గ్రామానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికను ఆమె తల్లి సోమవారం రాత్రి మందలించారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున సదరు బాలిక ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా కుమార్తె ఆచూకీ కనిపించకపోవడంతో ఉదయం 8 గంటలకు ఎస్ఐ రజియాసుల్తానా దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఎస్ఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సదరు బాలిక ఒంగోలు వెళ్లే బస్సు ఎక్కినట్లుగా తెలుసుకొని పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆమె ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించిన ఎస్ఐ కేవలం ఐదు గంటల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ రజియాసుల్తానా, పోలీసు సిబ్బందిని ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

రేషన్ దుకాణం సీజ్

● తరచూ ఫిర్యాదులపై అధికారులు దాడులు

● 300 కిలోల బియ్యం, 57 పంచదార ప్యాకెట్స్ అధికంగా ఉన్నట్లు గుర్తింపు



సరుకులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీ

చీరాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణ రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దుడ్డు ప్రభాకరరావుకు చెందిన షాపు నెం.38ను మంగళవారం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు సీజ్ చేశారు. ఆ షాపుపై నిత్యం ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు చేశారు. దీంతో ఉండాల్సిన సరుకు కంటే 300 కిలోల బియ్యం, 57 ప్యాకెట్స్ పంచదార అధికంగా ఉన్నట్లు గుర్తించారు. రేషన్‌డీలర్లు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని, భిన్నంగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఆర్డీవో హెచ్చరించారు. అధికారులు వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతారాణి తదితరులు ఉన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల దాడులు

● 3232 సర్వీసులు తనిఖీలు



మాట్లాడుతున్న అధికారులు

వేటపాలెం(చీరాల), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. 36 బృందాలుగా ఏర్పడి, 3232 సర్వీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 66 మందికి రూ.2.35 లక్షలు అపరాధ రుసుం విధించారు. విద్యుత్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెంట్ ఆంజనేయులు, విజిలెన్స్ డీఈ భాస్కర్, ఏడీ విజయ, డీఈ థామస్, వేటపాలెం ఏడీ శ్రీనివాసరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ భూములకు పెరిగిన కౌలు వేలం

బల్లికురవ. జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం, సూరేపల్లి గ్రామాలలోని మూడు దేవాలయాలకు మంగళవారం బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. గతం కంటే రెండు రెట్ల కౌలు ధర పెరిగిందని దేవదాయ శాఖ ఈవో కృష్ణారెడ్డి తెలిపారు, సోమేశ్వరస్వామికి చెందిన 5.60 సెంట్ల భూములకు గతంలో రూ. 17 వేలు కౌలుఉండగా ఇప్పుడు రూ.56 వేలకు రైతులు వేలంలో భూములను దక్కించుకొన్నారు. అలానే సూరేపల్లి గ్రామంలో వినాయక దేవాలయానికి చెందిన 1.75 సెంట్ల భూమికి గతంలో కౌలు రూ.8 వేలు ఉండగా ఇప్పుడు రూ.29 వేలకు రైతులు కౌలు వేలం పాట పాడారు. ముక్తిలింగేశ్వర స్వామి దేవాలయానికి చెందిన 2. 50 ఎకరాలకు గతంలో రూ.6 వేలు వేలం ఉండగా ఇప్పుడు రూ.7 వేలకు రైతులు పాట పాడారు. ఏడాది కాలానికి ఈ పాట అమలులో ఉంటుందని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు.

దంచి కొట్టిన వాన





ఒంగోలు నగరంలో మంగళవారం రాత్రి వర్షం దంచి కొట్టింది. దాదాపు గంటన్నర సేపు విడవకుండా కురిసింది. దీంతోకాలువలు పొంగిప్రవహించాయి. జిల్లా అంతటా వర్షం కురిసింది. -ఆంధ్రజ్యోతి, ఒంగోలు

కలెక్టర్ బంగ్లా రోడ్డులో కూలిన భారీ చెట్టు

● తప్పిన పెనుప్రమాదం

● పాక్షికంగా దెబ్బతిన్న ఆటో

ఒంగోలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాల రాకపోకలు జరిగిన స్థానిక కలెక్టర్ బంగ్లా వద్ద మంగళవారం మధ్యాహ్న సమయంలో పెద్దచెట్టు రోడ్డుపై పడిపోయింది. సాధారణంగా ఆ రోడ్డులో నిరంతరం ఆర్టీసీ బస్సులు, ఆటోలు, కారులు, ద్విచక్రవాహనాలు, పాదచారులతో రద్దీగా ఉంటుంది. ఆ చెట్ల కింద యాచకులు కూడా ఉంటుంటారు. అయితే ఒక్కసారిగా ఆ చెట్టు కిందపడిన సమయలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ఓ ఆటో రైల్వే స్టేషన్ నుంచి కలెక్టరేట్ వైపు వస్తుండగా దాని చెట్టు పడటంతో అద్దాలు పగిలి పోయాయి. ఆటోలో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



చెట్టు విరిగి రోడ్డుపై పడడంతో దెబ్బతిన్న ఆటో

కాగా పడి పోయిన చెట్టును వెంటనే అక్కడి నుంచి తొలగించే ప్రక్రియను చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

కోలలపూడిలో 'సుపరిపాలనకు తొలిఅడుగు

మార్టూరు, జూలై8(ఆంధ్రజ్యోతి):పేద ప్రజలకు అన్నిరకాలుగా అండగా ఉండేది, వారికి మంచి చేసేది కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా, ఈ ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచి పనులను తెలియచేసేందుకు, రానున్న నాలుగేళ్లలో చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికి, 'సుపరిపాలనకు తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఏలూరి మంగళవారం రాత్రి మండలంలోని కోలలపూడి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మమేకమయ్యారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ప్రజలకు అందిస్తున్న పెన్షన్లు, గ్యాస్ డబ్బులు, తల్లికి వందనం డబ్బులు సక్రమంగా చేరాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా ఆగస్టు 15వ తేదీ నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన హామీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులు నుంచి కొనుగోలు ధాన్యం రూ.1700 కోట్లు బకాయిలు పెట్టగా కూటమి ప్రభుత్వం ఈ బకాయిలను చెల్లించిందన్నారు. వ్యవసాయరంగంతో పాటు అన్ని రంగాలను నీరుగార్చిన జగన్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు.పొగాకు రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వమే పొగాకు కొనుగోలును ప్రారంభించిందన్నారు.ప్రతి రైతు పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రానున్న రోజులలో రైతులకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆయన గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన యూనిఫామ్‌లతో విద్యార్థులు కనిపించగా వారితో కొంచెంసేపు ఎమ్మెల్యే ఏలూరి ముచ్చటించారు. అదేవిదంగా పలువురు గ్రామస్తులు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించాలని గ్రామనాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మాన్యం భూముల వేలం అడ్డగింత

● 15 ఏళ్లగా వసూలు కాని కౌలు బకాయిలు

● ప్రస్తుతం పాట నిర్వహించడంపై ప్రజల ఆగ్రహం



అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

దగ్గుబాడు/పర్చూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా ఆలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత 15 ఏళ్లగా కౌలు బకాయిలు వసూలు చేయకుండా మళ్లీ వేలం నిర్వహించడం ఏమిటని గ్రామస్థులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కారంచేడు మండలం దగ్గుబాడులో మంగళవారం చెన్నకేశవ, వేణుగోపాలస్వామి, సిద్ధేశ్వర నాగవరపమ్మ స్వామివార్ల ఆలయాలకు సంబంధించిన మాన్యం భూములకు కౌలు వేలం నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు. దేవాదాయశాఖ ఈవో శిరీష, ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తుండగా దగ్గుబాడు, పోతినవారిపాలెం, నాయుడువారిపాలెం గ్రామస్తులు వేలంపాట వద్దకు వచ్చి కౌలు వసూలు వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. తరువాత వివరాలు చెబుతామని ముందు కౌలు నిర్వహించే విధంగా సహకరించాలని అధికారులు కోరారు. ముందు వివరాలు చెప్పిన తరువాతనే కౌలు వేలం నిర్వహించాలని పట్టుపట్టారు. 15 ఏళ్లగా ఆలయ మాన్యం భూముల కౌలు చెల్లించకుండా బినామీ పేర్లతో వేలంలో పొలం దక్కించుకుంటూ సాగు చేస్తున్నా అధికారులు ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. పాత బకాయిలు వసూలు చేసిన తరువాత ఈఏడాదికి సంబంధించిన కౌలు వేలం నిర్వహించాలని స్పష్టం చేశారు. కొంత మంది అధికారులు కౌలుదారులతో కుమ్మక్కై, కౌలు వసూలు చేయక పోవడంతోపాటు, ఆలయాలకు సంబంధించిన సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా వాడుకున్న ఈవోలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వేలం నిర్వహించే విధంగా సహకరించాలని అధికారులు కోరినా ససేమిరా అనటంతో కౌలు వేలం పాటను వాయిదా వేసినట్లు ఈవో శిరీష ప్రకటించారు. కౌలు బకాయి దార్ల అందరికీ నోటీసులు పంపాలని, తీసుకోని వారికి స్వయంగా అందజేయాలని దేవాదాయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ఈవోను ఆదేశించారు.

సొసైటీలకు.. త్రిసభ్య కమిటీలు

(5వ పేజీ తరువాయి)

కమిటీలను నియమించింది. సొసైటీల వారీగా త్రిసభ్య కమిటీల కోసం ఎమ్మెల్యేలు పంపిన పేర్లకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. దీంతో ఈ నెల 30నే త్రిసభ్య కమిటీలు సొసైటీల బాధ్యతలు స్వీకరించనున్నాయి. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ పాలకవర్గాలనే 2019 వరకు పొడిగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తారని రైతులు ఆశించారు. అయితే సభ్యుల గుర్తింపు ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. దీంతో కొత్త ఓటర్ల జాబితాలు రూపొందించే వరకు త్రిసభ్య పాలనకు ప్రభుత్వం మొగ్గు చూపింది.

279 మందికి పదవులు..

ఒక్కో సొసైటీలో చైర్‌పర్సన్‌తో ఇద్దరు సభ్యులు ఉంటారు. ఈ ప్రకారం మూడు జిల్లాల పరిధిలో తొలివిడతలో 279 మంది కూటమి నేతలను పదవులు వరించాయి. పల్నాడు జిల్లాలో 36 సొసైటీలకు నామినేటేడ్ కమిటీలను ప్రభుత్వం నియమించింది. గుంటూరు జిల్లా పరిధిలో 7, బాపట్ల జిల్లా పరిధిలో 50 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించింది.

నాడు నిర్వీర్యం..

సహకార రంగాన్ని వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారు. సహకార సంఘాల్లో నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యకర్తలను సభ్యులుగా చేర్చారు. దీంతో సొసైటీలు రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. సహకార రంగాన్ని ఆ పార్టీ నేతలు ఐదేళ్ల దోచేశారు. నాబార్డు ద్వారా వచ్చిన నిధుల్ని కూడా పంచుకుతిన్నారు. రూ.లక్షల్లో స్కాంలు జరిగినట్లు విచారణల్లో వెలుగుచూస్తున్నాయి. చాలా సంఘాలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఎరువులు అమ్మకాలను నీరుగార్చి రైతు భరోసా కేంద్రాలకు అప్పగించారు. ఇంధన బంకులు, జన ఔషధి కేంద్రాలు ఇలా అన్నింటిలోనూ వైసీపీ వారికే ప్రాధాన్యం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా సహకార వ్యవస్థ ఆర్థికంగా కుదేలైంది. ఇదే పాలనను కూటమి ప్రభుత్వం కూడా అమల్లోకి తీసుకురావడంతో పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాలి.

ప్రజా నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి



అద్దంకిలో నివాళి అర్పిస్తున్న హనిమిరెడ్డి, నాయకులు

చీరాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజానాయకుడని, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో వైఎస్ఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని గడియార స్థంభం కూడలిలో కేక్ కటింగ్ నిర్వహించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఏరియా వైద్యశాలలో రోగులకు, గర్భిణీలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మండల పరిధిలోని పాత చీరాల గ్రామంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం మార్టూరులో వైసీపీ పార్టీనాయకులు నిర్వహించారు. మండల కాంప్లెక్స్ వద్ద వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భుక్యా సుమితాబాయి, కాకోలు రామారావు, కారచోల సులేమాన్, గడ్డం మస్తానవలి, బాబునాయక్, గడ్డం మస్తానవలి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి: వైఎస్ఆర్ 76వ జయంతి సందర్భంగా స్థానిక ఎన్‌టీఆర్‌నగర్‌లో మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం శింగరకొండ రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాలలో జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం చినహనిమిరెడ్డి, స్థానికక నేతలు పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

● డీఎల్‌డీవో పద్మావతి



వివరాలు అడుగుతున్న డీఎల్‌డీవో

కారంచేడు(పర్చూరు), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయితీల్లో స్వచ్ఛత కార్యక్రమాలు బలోపేతం చేసేందుకు చెత్తసంపద కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని బాపట్ల జిల్లా డీఎల్‌డీవో పద్మావతి అన్నారు. మంగళవారం కారంచేడు మండలంలో డీఎల్‌డీవో పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణపై అధి కారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వ్యర్థ సేకరణ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు తడిచెత్త, పొడిచెత్తను ఎలా వేరుచేసి అందజేయాలని అన్న అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణ, పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యానపంటలపై రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

ఇంకొల్లు,జూలై 8,(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఉద్యానపంటలను ప్రోత్సహించి రైతులకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. మండలంలోని గొల్లపాలెం, గంగవం, సూదివారిపాలెం గ్రామాలలో మంగళవారం ఉద్యానపంటల కింద డ్రాగాన్, నిమ్మ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో ముల్లియ్య, టీడీపీ నాయకులు కరి శ్రీనివాసరావు, ఎస్సై సురేష్, తహసీల్దార్ శ్రీనివాస్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అవీఇవీ

సౌర విద్యుత్‌ను వినియోగించుకోవాలి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జులై 8 (ఆంధ్రజ్యోతి) : సౌర విద్యుత్ వినియోగం, మిగులు ఆదాయానికి మార్గమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. ఎర్రగొండపాలెంలో మంగళవారం జరిగిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.సోలార్ పలకల ఏర్పాటుకు రూ.2,22,222లక్షలు ఖర్చు అవుతుందని, దానికి రూ.7,800 ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. సోలార్ రూఫ్‌టాప్‌కు అయ్యే నికర ఖర్చు రూ.144,222 లక్షలు, మార్జిన్ అమౌంట్ రూ.22,222, బ్యాంకు రుణం రూ.1,22000 అని తెలిపారు. ఈ పథకం కింద బ్యాంకు తక్కువ వడ్డీకే రుణం ఇస్తుందని, విద్యుత్ బిల్లులు చెల్లించనవసరం కూడా ఉండదని వివరించారు. ఇంటిపై సోలార్ పలకలను ఏర్పాటు చేసుకుంటే 25ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్ సౌకర్యాన్ని పొందవచ్చిని డీఈ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం ఏడీఈ సియానాయక్, ఏఈ అల్లూరయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, టీడీపీ ముఖ్యనాయకులు శనగా నారాయణరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, బైపునేని మంత్రయ్య, కందుల నారాయణరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం



జమ్మనపల్లి పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పేదవానికి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని జమ్మనపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం సందర్శించి విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పించి సన్నబియ్యంతో భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫాం నాణ్యమైనవి అందించేలా మంత్రి లోకేష్ పర్యవేక్షణలో జరుగుతోందన్నారు. ఈనెల 10న తల్లిదండ్రుల కమిటీ సమావేశాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 580 మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధిస్తే తన సొంత నిధుల నుంచి రూ.లక్ష బహుమతిగా ఇస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పండుగలా మెగా పీటీఎంను నిర్వహించాలి

ఒంగోలు విద్య, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ప్రైవేటు పాఠశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహిద్దామని ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ కో చైర్మన్ పి.ప్రకాష్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఒంగోలులో అసోసియేషన్ అధ్యక్షుడు జి.అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యాసంస్కరణలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ తల్లికివందనం ఇవ్వడం అభినందనీయమన్నారు. గడిచిన సంవత్సర కాలంలో విద్యారంగంలో అనేకమార్పులకు శ్రీకారంచుట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. అందువల్ల మెగా పీటీఎం సభకు తల్లిదండ్రులను ఆహ్వానించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాలల కరస్పాడెంట్లు పాల్గొన్నారు.

సర్వీసును రెగ్యులరైజేషన్ చేయాలి



మంత్రికి వివరిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు విద్య, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరణను ప్రారంభించాలని కాంట్రాక్టు అధ్యాపకులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. మంగళవారం రాజధాని అమరావతిలో వారు మంత్రినికి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం న్యాయ సలహాకోసం అడ్వకేట్ జనరల్ వద్ద ఉన్న దస్త్రాన్ని తెప్పించి ప్రక్రియను పునఃప్రారంభించాలన్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు గత ఏడాది మేనెల జీతం చెల్లింపులో జాప్యం జరగకుండా చూడాలని కోరారు. ఆయా అంశాలపై మంత్రి లోకేష్ స్పందిస్తూ కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసు క్రమబద్ధీకరణ విషయంలో తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ చైర్మన్ కుమ్మరికుంట సురేష్, కో చైర్మన్ కల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్యం కోసం పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం



నగదుసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పంగులూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి):తమతో పదవతరగతి వరకు కలిసి చదివి, ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నూతలపాటి షడ్రక్ వైద్యం కోసం రూ.34 వేల నగదుసాయం అందించి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ముప్పవరం పీఎస్‌ఎన్‌సీసీ ఉన్నత పాఠశాలలో బి.ఆర్.పాలెం గ్రామానికి చెందిన షడ్రక్ 2001 -2002 విద్యాసంవత్సరంలో పదవతరగతి చదివాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మొకాలిచిప్ప రెండుగా చీలి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు చక్రవరం చినఅంజంరాజు, ఒలేటి సత్యనారాయణ, బ్రహ్మయ్యలు తమతో కలసి చదివిన విద్యార్థుల నుండి రూ.34 వేల నగదు సేకరించి మంగళవారం షడ్రక్‌కు అందచేశారు.

రుణ సహకారంతో చక్కని జీవన ప్రమాణాలు

వేటపాలెం(చీరాల), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళలకు అందిస్తున్న రుణసాయంతో జీవన ప్రమాణాలను చక్కగా మెరుగు పరచుకోవచ్చని పీడీ శ్రీనివాస్, డీపీఎం రవికుమార్, ఎంపీడీవో రాజేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం వేటపాలెం మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం అంజిబాబు ఆధ్వర్యంలో పొదుపు సంఘాల అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్త్రీనిధి, ఎస్సీ, ఎస్టీ సబ్సిడీ రుణాలపై చర్చించారు. గ్రామ సంఘాల పనితీరుపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సోలార్ రిజిస్ట్రేషన్‌లలో వేగం పెంచాలని వివరించారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.78 వేలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ కామేశ్వరి, ఉన్నతి ఏపీఎం ఫణిబాబు, సీసీలు అనూరాధ, వీవోఏలు పాల్గొన్నారు.

కరిగిపోతున్న కొండలు

- బ్లాస్టింగ్ లలోనూ నిబంధనలు ఉల్లంఘనలు
- గ్రావెల్ కోసం అనుమతులు గోరంత... తవ్వకాలు కొండంత


గ్రావెల్ కోసం తవ్విన బల్లికురవ సమీపంలోని సనకొండ

అద్దంకి, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రావెల్ కోసం కొండలను ఇష్టారాజ్యంగా కరిగించేస్తున్నారు. అనుమతులు కొద్దిమేర తీసుకొని తవ్వకాలు మాత్రం కొండంత చేస్తున్నారు. అద్దంకి మండలంలోని ధర్మవరం, బల్లికురవ మండలంలోని బల్లికురవ సమీపంలోని సనకొండ, రామాంజనేయపురం వద్ద ఉన్న కొండ, సంతమాగులూరు మండలం ఏల్చూరు కొండ, పంగులూరు మండలం రామకూరు, కొండమంజులూరు సమీపం లోని కొండల నుంచి యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. దశాబ్దాల నుంచి తవ్వకాలు చేస్తుండంతో ఇప్పటికే పలు కొండలు ఆనవాళ్ల కూడా కోల్పోయాయి. అయితే అనుమతులు తీసుకునే సమయం లో రెండు, మూడు హెక్టార్లలోపే తీసుకొని తవ్వకాలు చేస్తున్నది మాత్రం అందిన కాడికి చేస్తున్నారు. ఆయా ప్రాంతాలలో పదుల సంఖ్యలో క్రషర్లు ఉండడంతో నిత్యం పెద్దఎత్తున బ్లాస్టింగ్‌లు చేసి కొండలను పగుల గొడుతు న్నారు. బ్లాస్టింగ్ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా జరుపుతున్నారు. దీంతో బ్లాస్టింగ్ సమయంలో రాళ్లు సమీపంలో పంట పొలాలలో కూడా పడుతూ పంటలకు నష్టం వాటిల్లుతుంది. అదే సమయంలో పొలాలలో పనులు చేసుకునే రైతులు కూడా భయంభయంగా గడపాల్సిన పరిస్థితి నెలకొంది. పర్యవేక్షణ చేయాల్సిన మైనింగ్ అధికారులు మామూళ్ల కు అలవాటు పడి మిన్నకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. .అదేసమయంలో అనుమతు లకు మించి తవ్వకాలకు జరుగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొన్ని దశాబ్దాలలో పలు కొండల ఆనవాళ్లు పూర్తిగా కనుమరుగు అయినా ఆశ్చర్యం లేదని పలువురు అభి ప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతించిన మేర మాత్రమే తవ్వకాలు జరిగేలా చర్యలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించి బ్లాస్టింగ్‌లు జరపకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.


సొరంగంలా తవ్విన ధర్మవరం సమీపంలోని కొండ

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన

పట్టణంలోని రెండవవార్డులో పర్యటించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని 2వ వార్డు పరిధిలో 575 కుటుంబాలు ఉండగా వారిలో 466 మందికి తల్లికి వందనం ద్వారా రూ.60.58 లక్షలు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే కొండయ్య స్పష్టం చేశారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని మంగళవారం ఈ వార్డులో నిర్వహించారు. వార్డు అంతటా పర్యటించి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వార్డులో 258 మందికి గాను పెన్షన్ల ద్వారా ప్రతి నెల రూ.10.68 లక్షలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పీ4 ద్వారా 336 బంగారు కుటుంబాలు గుర్తించి వారి అభ్యున్నతికి 12 మంది మార్గదర్శకు లను సిద్ధం చేసినట్లు వివరించారు. వీరిలో ఒక్కో మార్గదర్శకులు 15-20 మంది సభ్యు లకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తారన్నారు. అలాగే తాగునీరు. డ్రయిన్ సమస్యలపై పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతామని వివరించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి అట్టహాసంగా జరుగు తుంటే జగన్‌రెడ్డి దుర్మార్గపు ప్రచారాలు చేస్తు న్నట్లు చెప్పారు. జగన్ బూటకపు మాటలు జనం నమ్మే పరిస్థితి లేదన్నారు. అలాగే మండల పరిధిలోని పిట్టువారిపాలెంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యువనాయకులు గౌరీ అమర్నాథ్‌తో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మొక్కనాటుతున్న ఎమ్మెల్యేకొండయ్య అధికారులు

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం

పండ్లతోటల పెంపకంతో తక్కువ ఖర్చు, అధికంగానే లాభార్జన సాగించవచ్చని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. మండల పరిధిలోని తోటవారిపాలెంలో రైతు సతీష్‌బాబుకు చెందిన పొలంలో డ్వామా పీడీ విజయలక్ష్మీతో కలిసి రైతు పొలంలో పండ్ల తోటల పెంపకం ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా పొలంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే లాంఛనంగా మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు తోడ్పాటు అందించి తోటలు పెంపకాల అభివద్ధికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివన్నారాయణ, ఏపీవో దాసు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు తాగునీరు

ఖరీఫ్‌లో సాగుకు ఇబ్బంది లేకుండా నీరు అందించనున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని తోటవారిపాలెం వద్ద ఉన్న పంట కాలువను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అధిక శాతం చిన్న, సన్నకారు ప్రజలు రైతాంగంపై ఆధారపడి ఉన్నట్లు వివరించారు. వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. అలాగే కాలువలో తూటి కాడను పరిశీలించి, సమస్యలు లేకుండా చూస్తామని చెప్పారు. ఆయన వెంట పలువురు టీడీపీ కూటమి నేతలు, రైతులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

పంగులూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో డి.సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని బూదవాడ, కల్లంవారిపాలెం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యకమం నిర్వహించారు. ఖరీఫ్‌లో వరి, మినుము, కంది సాగు చేపట్టే రైతులు ఈనెల 30వ తేదీలోగా పంటల బీమా పథకం ప్రీమియం చెల్లించాలని కోరారు. పొగాకు సాగుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, జొన్న, పప్పుదాన్యాల సాగు చేపట్టాలన్నారు. కౌలు రైతులు గుర్తింపుకార్డులు పొందడం ద్వారా సాగు ప్రయోజనాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అలగ్జాండర్, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- రైతులు వినియోగించుకోవాలి : ఎంపీడీవో


తూర్పు కొప్పెరపాడులో సీతాఫలం మొక్కలు నాటుతున్న ఎంపీడీవో

పంగులూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా పండ్లతోటలు, కూరగాయల సాగుకు అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో స్వరూపారాణి సూచించారు. ప్లాంటేషన్‌డే సందర్భంగా ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ పథకం ద్వారా తూర్పు కొప్పెరపాడు రైతు బత్తుల ధనలక్ష్మి పండ్లతోట సాగుకు సిద్ధం చేసిన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం ఎంపీడీవో స్వరూపారాణి సీతాఫలం మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో పాలపర్తి శ్రీనివాసరావు 1.50 ఎకరాల్లో సీతాఫలం, కొండమంజు లూరు గ్రామంలో రెండెకరాల విస్తీర్ణంలో గ్రామరైతు బొప్పూడి లింగారావు మామిడి మొక్కలు నాటినట్లు ఏపీవో సంతోషం తెలిపారు. పండ్లతోటల సాగుకు ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలు ఉపాధిహామీ పథకం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జ్‌ల నియామకం

అద్దంకి, జూలై8 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గంలోని 9 సొసైటీ లకు పర్సన్‌ఇన్‌చార్జులను, సభ్యులను(త్రిమెన్ కమిటీ) నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. గోవాడ సొసైటీ ఛైర్‌పర్సన్‌గా భైరపునేని వెంకటసత్యనారాయణ, సభ్యులుగా మన్నెం బ్రహ్మయ్య, కందిమళ్ల వెంకట్రావు, మణికేశ్వరం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా నర్రా బ్రహ్మానందం, సభ్యులుగా షేక్ మస్తాన్‌వలి, వెలనాటి వీరరాఘవయ్య, వల్లాపల్లి సొసైటీ ఛైర్‌పర్సన్‌గా మాలపాటి వెంకటసుబ్బయ్య, సభ్యులుగా మందా యాకోబు, షేక్ ఖాజా వలి, జాగర్లమూడివారిపాలెం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా అల్లంనేని బ్రహ్మానందస్వామి, సభ్యులుగా దూళిపాళ్ల ప్రసన్నాంజనేయులు, మట్టకొయ్య బ్రహ్మయ్య, రావినూతల సొసైటీ ఛైర్‌పర్సన్‌గా పూనాటి వెంకటరావు, సభ్యులు గా నాదెండ్ల తిరుపతిరావు,తిమ్మనపాలెం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా మొరవనేని రమేష్‌బాబు, సభ్యులుగా పల్లెపోతుల శ్రీరాములు, మన్నె ఫణీంద్ర, కొమ్మాలపాడు సొసైటీ ఛైర్‌పర్సన్‌గా షేక్ చెన్నుపల్లి సుభాని, సభ్యులుగా గడె హనుమంతరావు, కొప్పాక ఏడుకొండలు, కుందుర్రు సొసైటీ ఛైర్‌పర్సన్‌గా కొప్పాక ఏడుకొండలు, సభ్యులుగా నిడమానూరి నరసింహరావు, కొండేటి శ్రీనివాసరావు, సంతమాగులూరు సొసైటీ ఛైర్‌పర్సన్ గా అట్లా పెద వెంకటరెడ్డి, సభ్యులుగా ధూళిపాళ్ల చలపతి, చల్లా ఏడుకొండలును నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చినగంజాం, జూలై 8(ఆంధ్రజ్యోతి) : ఇంటి పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్.సిరివెన్నల, చీరాల సబ్ యూనిట్ అధికారి పి.శ్రీనివాసరావులు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది జాతీయ డెంగ్యూ మాసోత్సవాలలో భాగంగా చినగంజాం గ్రామంలో డెంగ్యూ వ్యాధులపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తదనంతరం పీహెచ్‌సీ ఆవరణలో జరిగిప సభలో వైద్యాధికారి మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు దోమ తెరలు వినియోగించాలన్నారు. మలేరియా, డెంగ్యూ లక్షణాలు కనబడిన వెంటనే వైద్యశాలకు వచ్చి చికిత్స తీసుకొని పక్షంలో ప్రమాదాలు ఏర్పడతాయని తెలిపారు. ఫ్రైడే డ్రైడే రోజు పరిసరాల పరిశుభ్రత , ఇంటి లోపల, వెలుపల దోమలు పెరిగే ప్రదేశాలను, కొబ్బరి బోండాలు, , పాత కూలర్లు, గుంతలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సబ్ యూనిట్ అధికారి తెలిపారు. నీటిలో నిల్వ ఉన్న దోమల లార్వాలను గుర్తించి ఎబెట్ ద్రవంతో పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.చిరంజీవి, టీ.హెచ్.ఎస్ స్వర్ణలత, హెచ్‌వీ ఉల్దారాణి, హెల్త్ అసిస్టెంట్ నర్రా మురళి, ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటి హెల్త్ అధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలురైతులు గుర్తింపు కార్డులను తీసుకోవాలి

యద్దనపూడి,(మార్టూరు)జూలై8(ఆంధ్రజ్యోతి):కౌలుదారులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలంటే తప్పనిసరిగా సిసిఆర్‌సి కార్డులను తీసుకోవాలని ఏవో కుమారి అన్నారు.మంగళవారం యద్దనపూడి మండలంలోని పూనూరు, గన్నవరం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నవరంలో జరిగిన కార్యక్రమంలో కుమారి మాట్లాడుతూ ఎకరాకు రూ.1900 వంతున పత్తిపంటను సాగుచేస్తున్న రైతులు ఈ నెల 15 వతేదీలోపు పంటలబీమాను చెల్లించాలన్నారు. త ద్వారా పత్తిపంట సాగులో రైతు నష్టానికి గురైతే ఎకరాకు రూ.38 వేలు బీమా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నల్లపనేని రంగయ్యచౌదరి, ఎంపీటీసీ సభ్యుడు గొట్టిపాటి సతీష్, వీఏఏలు ఏసుబాబు,హరీష్ తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్'

చినగంజాం, జూలై 8(ఆంధ్రజ్యోతి) : చినగంజాంలో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి ఎస్ఐ శీలం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గంజాయి, మాదకద్రవ్యాల మీద రాష్ట్ర ఈగల్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వందమీటర్ల దూరంలో ఉన్న షాపులను ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. షాపుల్లో పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థలకు సంబంధించిన వాటిని అమ్ముతున్నారేమోనని పరిశీలించారు. పాఠశాలకు వంద మీటర్ల దూరంలో ఉన్న షాపులలో మత్తు పదార్థలు, పొగాకు ఉత్పత్తులు అమ్మరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పి.ప్రకాష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై ర్యాలీ

యద్దనపూడి,(మార్టూరు)జూలై8(ఆంధ్రజ్యోతి):డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా మంగళవారం యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుండి ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ లో వైద్యాధికారి శ్రీహర్ష మాట్లాడుతూ నివాసగృహాల వద్ద దోమలు అభివృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. డెంగ్యూ వ్యాధిపై అందరూ అవగాహనతో మెలగాలన్నారు. వ్యాధి లక్షణాలను ఆయన వివరించారు. వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో డాక్టరు వేణుబాబు,డాక్టరు నవీన, హెల్త్ అసిస్టెంట్ ఇండేల సింగారెడ్డి, ఆశా కార్యకర్తలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- ఎస్ఐ వినోద్‌బాబు హెచ్చరిక


అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పంగులూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని ఎస్ఐ. వినోద్‌బాబు హెచ్చరించారు. మండల కేంద్రమైన పంగులూరు లోని జడ్పీ ఉన్నత పాఠశాల బాలబాలికలకు మంగళవారం ఫోన్ యాప్‌ల వినియోగం, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా పిన్నవయస్సులో వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అలాంటి చర్యలకు విద్యార్థులు పాల్పడవద్దని సూచించారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు చదువు, క్రీడలపై దృష్టిసారించి ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం. సోమేపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహువార్షిక గ్రాసాలతో పాడిరైతులకు మేలు

బోయినవారిపాలెం(చీరాల), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు, పాడి యజమానులు విధిగా గడ్డి మేతపై అవగాహన పొందడం వలన బహుళ ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా పశుసవర్ధక శాఖ అధికారి డా. వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోయినవారిపాలెం పొలాల్లో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. రైతు తనకున్న భూమిలో నాలుగవ వంతు నీటి లభ్యత చర్యలు చేపట్టాలని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరక్టర్ డా.చిట్టిబాబు, డా.పావని, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

కారంచేడులో ముంచుకొస్తున్న నీటిఎద్దడి

- ఎండిపోయిన జయప్రకాష్ నారాయణ్ చెరువు
- అరకొరగా లైబ్రరీ చెరువు
- మూడురోజులకు ఒకసారి సరఫరా


ఎండిపోయిన జయప్రకాష్ నారాయణ్ చెరువు

కారంచేడు (పర్చూరు), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కొమ్మమూరు కాలువలో నీటి సరఫరా ఉన్న సమయంలో చెరువులను పూర్తిస్థాయిలో నింపడంలో వైఫల్యం కారణంగా తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోనే పేరొందిన కారంచేడు గ్రామ ప్రజలకు నీటిసరఫరా సక్రమంగా జరగక తీవ్రంగా ఇబ్బంది పడుతు న్నారు. ఈ గ్రామంలో 14వేల పైచిలుకు జనాభాతోపాటు, పదిహేను వందలకు పైగా పశువులు ఉన్నాయి. గ్రామంలో ప్రస్తుతం ఉన్న రెండు మంచినీటి చెరువులకు గాను ఒక చెరువు పూర్తిగా ఎండిపోగా, మరో చెరువులో నీరు అడుగంటాయి. దీంతో నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. కూతవేటు దూరంలో కొమ్మమూరు కాలువ ఉన్న అధికా రుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రెండు దశాబ్దాల క్రితం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో భారీ విస్తీర్ణంలో జయప్రకాష్ నారాయణ్ చెరువును అభివృద్ధి చేశారు. కొమ్మమూరు కాలువ నుంచి నీటిని నింపేలా పైపులైన్‌ను కూడా ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు నీటి సరఫరా చేసేవిధంగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌నూ నిర్మించారు. ఈ వేసవికి ముందు ఈ చెరువులో పూర్తిస్థాయిలో నీటిని నింపుకోక పోవడంతో ప్రస్తుతం నీటికి కటకటలాడాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతు న్నారు. జయప్రకాష్ నారాయణ్ చెరువు పూర్తిగా ఎండిపోయింది. గ్రామంలోని మరో లైబ్రరీ చెరువులో నీరు అరాకొరాగానే ఉంది. ప్రస్తుతం అందులో ఉన్న నీటిని రెండు మూడు రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన పరిస్థితి నెలకొంది. పైపులైన్‌కు లీకులు పడడంతో అరాకొరా నీటి సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొమ్మమూరు కాలువలో అరాకొరా నీరు ఉండడం, ప్రస్తుతం ఉన్న నీటి పరిమాణం దృష్ట్యా చెరువులకు నీరు నింపలేని పరిస్థితి. కేవలం మూడు మాసాలు మినహా కొమ్మమూరు కాలువ ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. పంచాయతీ వైఫల్యంతో కొద్దికాలం అవసరాలకు సరిపడ నీటిని నిల్వచేసి సరఫరా చేయడంలో ప్రస్తుతం చెరువులు ఒట్టిపోయాయి. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సరైన కార్యాచరణ రూపొందించి ఇలాంటి పరిస్థితులు పునావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.


చెరువులో నీటి సరఫరా లేక పరిస్థితి ఇలా

అవీ..ఇవీ..

రోటరీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ అధికారులు, ప్రతినిధులు

చీరాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రోటరీ కమ్యూనిటీ భవనంలో మంగళవారం నూతన కార్యవర్గం ఎంపిక, ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా రోటరీ మాజీ 3150 జిల్లా గవర్నర్ టీవీఆర్ మూర్తి హాజరయ్యారు. పోలియోపై పోరాటంలో క్లబ్ విశేషంగా కృషి చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా 35 వేల క్లబ్‌లు ఉండగా, 13 లక్షలు మంది సభ్యులు ఉన్నట్లు వివరించారు. ఈక్రమంలో సమష్టిగా కృషి చేస్తూ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పాట్నా యూనివర్సిటీలో ఐటీఐ చదువుతున్న భోగిరెడ్డి సంయుక్తకు రూ.40 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జాలాది కృష్ణమూర్తి, లక్ష్మీప్రతాప్, బండారుపల్లి హేమంత్‌కుమార్, డా.ఐ.బాబురావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం


చెక్కులు అందజేస్తున్న మంత్రులు రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డి

అద్దంకి, జూలై8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో అద్దంకి నియోజకవర్గంలో 53 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఎల్‌వోసీలను మంత్రులు రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళీలు అందజేశారు. మెప్మా మహిళలకు ట్యాబ్‌లను అందజేశారు. అద్దంకిలో టెంపరరీ ఎంవీఐ కార్యాలయం స్థానంలో పర్మినెంట్ యూనిట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, వెలనాటి శ్రీనివాసరావు, దూళిపాళ్ల సుబ్బారావు, నాదెండ్ల సుబ్బారావు, కరి వేణు, రామకృష్ణ, దామా హనుమంతరావు తదితరులు మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, రవికుమార్‌లకు వినతిపత్రాలు అందజేయగా సానుకూలంగా స్పందించారు. అమరావతిలో టంగుటూరి ప్రకాశం పంతులు స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని మంత్రులకు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్లు టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు


మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ. జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రజల సమక్షంలో వారి సమస్యలు తెలుసుకొని ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల పురోగతి సూచిక 2.0పై పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ముఖ్యంగా శానిటేషన్ కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాలన్నారు. అలానే ప్రజా సమస్యలను గుర్తించి సకాలంలో పూర్తిచేయాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి వారికి అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. రోడ్ల వెంబడి చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ శిక్షణలో డిప్యూటీ ఎంపీడీవో సుమతి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

బల్లికురవ. జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చు అని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బాలమురళిధర్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులు పంటలసాగు సమయంలో తగుజాగ్రత్తలు పాటించాలన్నారు. మొక్కజొన్న పంటకు ఎరువుల యాజమాన్యం అనేది దిగుబడిని పెంచడానికి చాలా ముఖ్యమన్నారు. నత్రజని, భాస్వరం పోటాష్ వంటి పోషకాలును సరైన మోతాదులో అందించడం ద్వారా ఎదుగుదల మెరుగుపరచవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో ఏవో పి. శ్రీనివాసరావు, ఏఈవో మౌలాలి, వీఏఏలు ప్రవీణ్, శ్రీకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో యువత భవిత చిత్తు

- జోరుగా పోలీసుల అవగాహన కార్యక్రమాలు


ప్రచారం నిర్వహిస్తున్న సీఐ శేషగిరిరావు, ఎస్సై జనార్ధన్

వేటపాలెం(చీరాల), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల బారిన పడిన యువత భవిష్యత్తు ఛిన్నాభిన్నమవుతుందని, వాటికి దూరంగా ఉండి, ఉన్నతంగా రాణించాలని రూరల్ సీఐ శేషగిరిరావు, వన్‌టౌన్ సీఐ సుబ్బారావు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేటపాలెంలో, చీరాల పట్టణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆకర్షణ, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కూలీ నాలీ చేసి తల్లిదండ్రులు పిల్లల్ని చదివిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అలాగే పాఠశాల సమీపంలోని దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సిగరెట్స్, పాన్, గుట్కా, గంజాయి వంటి వాటిపై తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థల విక్రయాలు గమనిస్తే టోల్ ఫ్రీ నెం.1972కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై జనార్ధన్, ఆయా స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కడప పీఠాధిపతి అరీఫుల్లా హుసేనీ తదితరులు


స్వర్ణాల చెరువు ఘాట్‌లో కిక్కిరిసిపోయిన భక్తజనం


జర రోటీ దేదో దీదీ!! : ఇష్టమైన రొట్టె కోసం పోటీపడుతున్న భక్తులు

భక్తజనం తుళ్లింత.. సింహపురి పులకింత!

అర్ధరాత్రి తర్వాత గంధమహోత్సవం

భక్తులతో కిక్కిరిసిన స్వర్ణాల చెరువు ఘాట్

ఒక్కరోజే 4 లక్షల మంది వచ్చి ఉంటారని అంచనా



నెల్లూరు (సాంస్కృతికం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మతసామరస్యానికి ప్రతీకగా కోరికలు తీర్చే రొట్టెల పండుగకు భక్తజనం పోటెత్తింది. ఆకాశం ఉరిమిందా.. నేల ఈనిందా అన్న చందంగా బారాషహీద్ దర్గాకు భక్తులు తరలివచ్చారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత మంగళవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో గంధమహోత్సవం జరిగింది. కోటమిట్టలోని అమీనియా మసీదులో గంధం కలిపిన బిందెలతో ఊరేగింపుగా బారాషహీద్ దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం దర్గాలోని అమరుల సమాధులకు కడప పీఠాధిపతి అరీఫుల్లా హుసేనీ, ఇతర మతపెద్దలు గంధం ఎక్కించారు. ఈ సందర్భంగా గంధం కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ ఘట్టం ముగిచడంతో తెల్లవారుజాము నుంచి రొట్టెల పండుగ ప్రారంభమైంది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. దారులన్నీ దర్గా వైపే అనే విధంగా దర్గాకు వచ్చే రోడ్లన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేసవిని తలపించేలా భానుడు భగ్గుమన్నా మొక్కవోని విశ్వాసంతో వరాల రొట్టెను అందుకునేందుకు భక్తులు రావడం విశేషం. మంగళవారం ఒక్కరోజే దాదాపు 4 లక్షలు మందికిపైగా హాజరయ్యారని అధికారులు అంచనా వేశారు. దీంతో ఇప్పటివరకు రొట్టెల పండుగకు సమారు 8లక్షలు మందికిపైగా హాజరై ఉంటారని అధికారులు తెలిపారు.

● రొట్టెల కోసం పోటీ

స్వర్ణాల తీరంలో వరాల రొట్టెల కోసం భక్తులు ఆరాటం అంతాఇంతా కాదు. లక్షలాది మంది జనంలో ఉద్యోగం, వివాహం, సంతానం రొట్టెలు పట్టుకునేందుకు ఎంతో శ్రమించారు. స్వర్ణాల ఘాట్‌లో ఏర్పాటు

- మిగతా 7లో..

మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అన్ని రాజకీయ పార్టీలు, మహిళా సంఘాలు దుమ్మెత్తిపోశాయి. నల్లపరెడ్డి కుటుంబ ప్రతిష్టను ప్రసన్న మంట గలిపాడంటూ మండిపడ్డారు. వైసీపీ నాయకులకు మహిళల పట్ల ఏమాత్రం గౌరవం లేదనడానికి ప్రసన్న మాటలే నిదర్శనమన్నారు. నెల్లూరు, కోవూరులలో మహిళలు భారీ ప్రదర్శనలు చేపట్టాయి. అలాగే టీడీపీ, జనసేన, బీజేపీ, కమ్యూనిస్టుపార్టీలు, వివిధ మహిళాసంఘాలు వేర్వేరు ప్రకటనలు, ప్రెస్‌మీట్లలో ప్రసన్న తీరును తీవ్రంగా ఖండించాయి.


బుచ్చిలో ప్రసన్న దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు



నెల్లూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న మహిళలు



ప్రసన్నపై ఫైర్!

- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలపై దుమారం
- నల్లపరెడ్డి కుటుంబం ప్రతిష్టను దెబ్బతీశాడంటూ ఆగ్రహం
- వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్
- కోవూరు, నెల్లూరులో మహిళల ప్రదర్శనలు
- బుచ్చిలో దిష్టిబొమ్మ దహనం

కోవూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కోవూరులో మహిళలు నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక శ్రీవీరాంజనేయస్వామి ఆలయం నుంచి తాలూకాఫీసు కూడలి వరకు ఈ ర్యాలీ జరిగింది. మహిళల ఔనత్యాన్ని కించపరుస్తున్న ప్రసన్నకుమార్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించే ప్రసన్నను శిక్షించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కోవూరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి మహిళలు తరలిరావడంతో కోవూరు- నెల్లూరు మార్గం కిక్కిరిసిపోయింది. అనంతరం పోలీసుస్టేషన్‌లో సీఐ సుధాకరరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ప్రదర్శనకు మహిళా నాయకులు అమరావతి, యాకసిరి వెంకటరమణమ్మ, కప్పిర రేవతి, యాకసిరి వనమ్మ, చలంచర్ల కామేశ్వరి, భవాని తదితరులు నాయకత్వం వహించారు.



● ప్రసన్నపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసన్నకుమార్‌రెడ్డిని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి డిమాండు చేశారు. తహసీల్దారు కార్యాలయ కూడలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రసన్న ఇలా అసభ్యంగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ప్రదర్శనలో టీడీపీ నాయకులు మల్లారెడ్డి, అశోక్‌రెడ్డి, సుధాకరరెడ్డి, జనార్దనరెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, అచ్యుతరెడ్డి, నాపా వెంకటేశ్వర్లు, వీరేంద్ర, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక బస్టాండు సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను టీడీపీ శ్రేణులు దహనం చేశాయి. పట్టణ యూత్ అధ్యక్షుడు కాలంశెట్టి కిషోర్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రసన్న పద్ధతులు మార్చుకోవాలని, ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు పార్థసారథి, సుమన్, లోకేష్, మణి, పవన్, నాగేశ్వరరావు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

● కొడవలూరు : గుండాలమ్మపాలెం ప్రధాన కూడలి నుంచి రోడ్డు వరకు మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రసన్న ఎమ్మెల్యే ప్రశాంతికి ప్రసన్న క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుజిత్ కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రసన్నను అరెస్ట్ చేయాలి

నెల్లూరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ నెల్లూరురూరల్‌లో మహిళలు మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. గాంధీనగర్ వాటర్ ట్యాంకు నుంచి నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రమం వరకు ర్యాలీ చేపట్టి, విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న చేసిన వ్యాఖ్యలు సగటు సమాజం తలదించేకునేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రసన్న చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల పోలీసులు లోతైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మాజీ మేయర్ భానుశ్రీ, మమతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ వ్యాఖ్యలు సరికాదు : శ్రీధర్‌రెడ్డి

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై నల్లపరెడ్డి ప్రసన్న చేసిన వ్యాఖ్యల పట్ల రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రసన్న ఇంటిపై దాడి వీపీఆర్ దంపతుల పనికాదని, వారి అభిమానులు చేసి ఉండవచ్చని తెలిపారు. ఈ దాడి జరిగిన వెంటనే వీపీఆర్ దంపతులు పోలీసులకు తగు విచారణ జరపాలని ఆదేశించినట్లు వెల్లడించారు. నిత్యం పేదలకు సహాయం చేసే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు.



ప్రజాజీవితం నుంచి ప్రసన్నను బహిష్కరించాలి

ఏఎస్పీకి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఫిర్యాదు

నెల్లూరు (క్రైం) : సంస్కార రహిత ప్రసన్నను ప్రజాజీవితం నుంచి బహిష్కరించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యను ప్రశాంతిరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయంగా ఎదుర్కోలేక తనను అసభ్య పదజాలంతో దూషించారని అన్నారు. తాను ప్రసన్న హయాంలో జరిగిన గ్రావెల్ దోపిడీ, అవినీతి అక్రమాల గురించి మాట్లాడుతుంటే మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా సభ్య సమాజం తలదించుకునేలా నోరు పారేసుకున్న ప్రసన్నను మహిళా సమాజం క్షమించదన్నారు. ప్రసన్న అవినీతి అక్రమాలు చెల్లవంటూ కోవూరు ప్రజానీకం ఛీ కొట్టి శాశ్వతంగా ప్రజా జీవితం నుంచి వెలివేశారన్నారు. సంస్కార రహితంగా మాట్లాడే ప్రసన్నపై చట్టపరంగా ఎదుర్కొంటానన్నారు. ఏఎస్పీని కలిసిన వారిలో బుచ్చి నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిళలే బుద్ధి చెబుతారు : ఇంటూరి

కందుకూరు : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన దిగజారుడు వ్యాఖ్యలు సిగ్గుచేటని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మహిళలపై ఇలాంటి సంస్కారహీన వ్యాఖ్యలు తగవని, సమాజానికి సేవచేస్తూ ప్రజల్లో విశ్వాసం, అభిమానం సంపాదించిన మహిళా నాయకురాలిపై అసభ్యంగా మాట్లాడటం ప్రసన్నకుమార్‌రెడ్డి దిగజారుడుతనాన్ని సూచిస్తోందన్నారు.

వైసీపీ కుట్రలో భాగమే : కావ్య

కావలి : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వాఖ్యలు వైసీపీ కుట్రలో భాగమేనని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు వైసీపీ కూటమి నేతలపై ఒక పథకం ప్రకారం రెచ్చగొట్టే విధంగా మాట్లాడిస్తోందన్నారు. మహిళ ఎమ్మెల్యేపై అసభ్యంగా మాట్లాడి నల్లపురెడ్డి కుటుంబానికే ప్రసన్న కళంకం తెచ్చారన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, వ్యక్తిగత విషయాల్లోకి వెళ్లి అసభ్య పదజాలాలు వాడటం వైసీపీ నేతలకే చెల్లుతుందన్నారు. ఇప్పటికైనా ప్రసన్న ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందన్నారు.

వ్యక్తిగత విమర్శలు చేయద్దు : బీజేపీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : రాజకీయ విమర్శలు చేయాలే కానీ వ్యక్తిగత విమర్శలు చేయవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్ వంశీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధి తదితర అంశాలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు విమర్శలు, ప్రతి విమర్శలు చేయడం సహజమన్నారు. అయితే అందుకు భిన్నంగా కోవూరులో ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గుమంటోందన్నారు. ఇది మంచి పద్ధతి కాదని రాజకీయాలలో ఇలాంటి పరిస్థితులు రాబోవు రోజుల్లో పునరావతం కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు రాఘవేంద్ర, ముక్కు రాధాకృష్ణగౌడ్, దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రసన్నపై చర్యలు తీసుకోవాలి : జనసేన



నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట) : సభ్య సమాజం తలదించుకునేలా ఒక మహిళా ఎమ్మెల్యేపై అనుచిత వాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నేత, ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పట్ల అసభ్యకరమైన పదజాలంతో దూషించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఓడిపోయినా వైసీపీ నేతలకు బుద్ధిరాలేదని, దౌర్జన్యకాండను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ప్రశాంతిరెడ్డి నివాశంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్ తదితరులు ఉన్నారు.

'పశు సంవర్ధక'ంలో బదిలీ'లీలలు'

నెల్లూరు(వ్యవసాయం), జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధక శాఖలో మొన్నటి వరకు ఓ సీటు కోసం పోటీ పడటం చర్చనీయాంశ మైంది. అనంతరం ఓ వివాదంపై రాష్ట్ర వ్యాప్తంగా మాట్లాడుకున్నారు. తాజాగా పశుసంవర్ధకశాఖ సహాయకుల బదిలీల్లో అవకతవకలు జరిగా యంటూ కలెక్టరుకే ఏహెచ్‌ఏలు ఫిర్యాదు చేయడం చర్చకు దారితీసింది. రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న పశుసంవర్ధకశాఖ సహాయకుల(ఏహెచ్‌ఏ)లో ఒకేచోట ఐదేళ్ల సర్వీసు నిండిన వారిని బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఐదేళ్ల సర్వీసు నిండని వారు రిక్వెస్టు పెట్టుకుంటే వారికి కూడా బదిలీలు చేపట్టాలని సూచించింది. ఈ క్రమంలో ఐదేళ్లు నిండిన ఏహెచ్‌ఏలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించాలి. సీనియారిటీ ప్రాతిపదికన ఆప్షన్లు ఇవ్వాలి. అనంతరం బదిలీలు జరపాలి. అయితే జిల్లాలో ఈ నిబంధనలేవీ పాటించలేదనే ఆరోపణలున్నాయి. ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫారసు లెటర్లు తెచ్చుకున్న వారికి కూడా పని జరగలేదనేది చర్చనీయాంశంగా మారింది.

● కౌన్సెలింగ్‌లో అధికారులేరి..

ఒకేచోట ఐదేళ్ల సర్వీసు నిండిన ఏహెచ్‌ఏలు జిల్లాలో దాదాపు 75 మంది ఉన్నారు. కుటుంబ పరిస్థితులు, అనారోగ్య సమస్యలతో 61 మంది రిక్వెస్టు బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు జిల్లా కార్యాలయాల అధికారుల సమక్షంలో బదిలీల కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. అయితే ఓ అధికారి అన్నీ తానై, ఓ ఏహెచ్ఏను అసిస్టెంటుగా పెట్టుకుని మొత్తం వ్యవహారం నడిపి నట్లు కార్యాలయంలో చర్చించుకుంటున్నారు.

● రిక్వెస్టులు పెట్టని వారు దాదాపు 30మంది..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్లు నిండిన వారికి, రిక్వెస్టులు పెట్టిన వారికి మాత్రమే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఇటీవల బదిలీలపై వచ్చిన, కొత్తగా ఉద్యోగంలో చేరిన దాదాపు 30మందికి పైగా ఏహెచ్‌ఏలను సైతం బదిలీ చేసినట్లు విమర్శలు వస్తున్నాయి. వారు పనిచేస్తున్న రైతు సేవా కేంద్రం నుంచి రిలీవ్ చేసి అక్కడ మరొకరిని నియమించినట్లు సమాచారం. ఇలా రిక్వెస్టులు లేకుండా బదిలీ అయిన దాదాపు 12 మందికి పోస్టింగు ఎక్కడో చూపకుండా గాల్లోనే ఉంచినట్లు సమాచారం. దీంతో వీరందరూ లబోదిబో మంటున్నారు. పశు సంవర్ధకశాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

● భారీగానే వసూళ్లు...?

ఒక అధికారి అన్నీ తానై చూసుకుంటూ, మిగిలిన అధికారుల జోక్యం అవసరం లేదంటూ బదిలీల ప్రక్రియ నడిపినట్లు పలువురు విమర్శిస్తున్నా రు. ఈ క్రమంలో ఒక్కో బదిలీకి భారీగానే ముడుపులు వసూళ్లు చేసినట్లు కూడా జిల్లా కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్కరి నుం చి రూ.30వేల నుంచి అవసరాన్ని బట్టి రూ.50వేల వరకు దండినట్లు చెప్పుకుంటున్నారు. దీనిపై ఏహెచ్‌ఏలు కలెక్టరుకు సైతం ఫిర్యాదు చేశారు. డబ్బులిచ్చిన వారికి దగ్గర్లో పోస్టింగు ఇచ్చారని, తమకి మాత్రం 200కి.మీ దూరంలో ఇచ్చారంటూ కలెక్టరుకు విన్నవించారు. విచారించి న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై కలెక్టర్ సైతం విచారణ చేపట్టే అవకాశం ఉందని పలువురు అధికారులు చెబుతున్నారు.

● ప్రజాప్రతినిధుల ఆగ్రహం

పశుసంవర్ధకశాఖ ఏహెచ్‌ఏల బదిలీలకు సంబంధించి జరుగుతున్న వ్యవహారంపై జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే కొంతమంది ఆ అధికారికి ఫోన్ చేసి ఆగ్రహం, అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. తామిచ్చిన సిఫార్సు లెటర్లను కూడా పట్టించుకోకుండా పక్కన పెడతావా అంటూ తీవ్ర స్థాయిలో ఆగ్రహించినట్లు తెలిసింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 570

ఉపాధి హామీలో రూ.3 లక్షల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశం

అల్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో రూ.3 లక్షల రూపాలయతో చేపట్టిన పనులు తేలకపోవడంతో ఆ నిధులు గోల్‌మాల్ అయినట్లు భావించి ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించి సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికలో డీఆర్‌డీఏ పీడీ గంగాభవాని పాల్గొన్నారు. జరిగిన పనులపై సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారులకు వివరించారు. అయితే రూ.3 లక్షల పనులకు సంబంధించిన వివరాలు సరిగా లేకపోవడంతో మళ్లీ విచారణ చేపట్టాలని ఆదేశజంచారు. అలాగే రూ.20 వేల రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడీవో విజయలక్ష్మి, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎస్‌పీఎం కొండయ్య, ఎంపీడీవో రజనీకాంత్, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్

కందుకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో పేద మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ కె.అనూష మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుట్టుశిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఆమె వెంట కల్లూరి శైలజ, ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

కందుకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మేక్ ఏ ఛేంజ్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని మాల్యాద్రి కాలనీ ప్రాథమిక పాఠశాల, విక్కిరాలపేట హెచ్‌పీ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులకు మంగళవారం ప్లేట్లు, వాటర్‌బాటిల్స్, నోట్ పుస్తకాలు, బోధనా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌతమ్, శివతేజ, స్రవంతిలతో పాటు రవ్వా శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జె. పద్మ, షేక్ బుడేసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసత్తా మండల మహిళా కమిటీ ఏర్పాటు

బిట్రగుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల ప్రజాసత్తా మహిళా నూతన కమిటీ ఏర్పాటు జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది, మండల మహిళ అధ్యక్షురాలిగా పందిళ్ల సునీత, ఉపాధ్యక్షురాలు వేదగిరి సుహాసిని, కార్యదర్శి రాచూరు శివప్రియ, సహాయక కార్యదర్శి పిడుగు కవిత, కోశాధికారిగా కండ్లగుంట నిర్మల, కన్వీనర్ బిజ్జం పద్మ, కో కన్వీనర్ అమ్ములు జలిని ఏకగ్రీవ ఎంపిక చేసినట్లు ప్రజాసత్తా రాష్ట్ర కన్వీనర్ చింతల దయాకర్ తెలిపారు.

346 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, జూలై 08(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 501పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 346 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-121, ఆర్ఆర్-5, సీఆర్-28, జంపింగ్‌లాట్స్-1 కారణాలతో 155బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.197.29గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

జువ్వలదిన్నెలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

బిట్రగుంట, జూలై 8(ఆంధ్రజ్యోతి): జువ్వలదిన్నెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు టీ.వెంకయ్య డిమాండ్ చేశారు. బోగోలులోని పార్టీ కార్యాలయంలో మంగళ వారం ఆయన విలేకర్లతో మాట్లాడుతు తీరప్రాంత గ్రామమైన జువ్వలదిన్నెలో పీహెచ్‌సీ ఏర్పాటుతో చుట్టుపక్కల సుమా రు 17 గ్రామాలకు చెందిన దాదాపు 5000 మందికి పైగా వైద్య సేవలు అందించవచ్చన్నారు.

నేడు మండల సమావేశం

కలిగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మెట్టుకూరు శిరీష ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

పశువైద్యం దైన్యం!

- శిథిలావస్థలో వైద్యశాల భవనాలు
- వేధిస్తున్న పశువైద్యుల కొరత
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



వలేటివారిపాలెం ప్రాంతీయ పశువైద్యశాల

వలేటివారిపాలెం, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండలంలో పశువైద్యం అందని ద్రాక్షాలా మారింది. ఓపక్క పశువైద్యుల కొరత వేధిస్తుండగా మరోపక్క వైద్యశాలల భవనాలు శిథిలావస్థకు చేరి దైవాధీనంగా ఉన్నాయి. దీంతో పాడి రైతులు సకాలంలో పశు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. వలేటివారిపాలెం ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాలు ఉన్నాయి. వలేటివారిపాలెం మండలంలోని పోకూరు, లింగసముద్రం మండలంలోని వీఆర్‌కోట, లింగసముద్రం పశువైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పోకూరుతో పాటు లింగసముద్రం ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా ఉన్న పులి వంశీ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ప్రకాశ జిల్లా తూర్పు గంగవరం పశువైద్యశాలకు బదిలీ అయ్యారు. వీఆర్‌కోట పశువైద్యాధికారి శ్రీకాంత్ కందుకూరు మండలం కోవూరు పశువైద్యాధికారిగా బదిలీ అయ్యారు. దీంతో పోకూరు, లింగసముద్రం, వీఆర్‌కోట పశువైద్యుల పోస్టులు ఖాళీ అయ్యాయి. పోకూరు ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా కందుకూరు మండలం మాచవరం పశువైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా లింగసముద్రం, వీఆర్‌కోట ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా చినపవని రెగ్యులర్ పశువైద్యాధికారి సుబ్రహ్మణ్యంకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయా పశువైద్యశాలల పరిధిలోని గ్రామాల్లో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షాలా మారింది. ఓ పక్క పశువైద్యులు లేక మరో పక్క సరిపడు వసతుల లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు.

● శిథిలావస్థకు పశువైద్యశాల భవనం

మండలంలోని పోకూరు పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. భవనం లోపల భాగంలో స్లాబు పెచ్చులూడిపోయి వర్షం నీరు భవనంలోకి వచ్చి చేరుతుంది. దీంతో పశువుల మందులు తడిచిపోతున్నాయి. అంతేగాకుండా మహిళా పశువైద్య సిబ్బందికి మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటి కీ పట్టించుకునేవారు లేరు. పశువైద్యశాల భవనం పునఃనిర్మాణానికి, వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించి ఏడాది కావస్తోంది. అయినప్పటికీ ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో వసతులు లేక వైద్యులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● స్థాయి పెంచారు.. వసతులు మరిచారు

వలేటివారిపాలెం పశువైద్యశాలను ఐదారేళ్ల క్రితం ప్రాంతీయ పశువైద్యశాలగా స్థాయిని పెంచారు. ఇప్పటి వరకు అందుకువగ్గట్లు వసతులు మాత్రం ఏర్పాటు చేయలేదు. ప్రాంతీయ పశువైద్యశాలకు స్టోర్ రూము, రికార్డు రూము, ఏడీ రూము, మీటింగ్ హాలు, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించాలి. అయితే ఆ దిశగా వసతులు లేవు. దీంతో సమావేశం సందర్భంలో సిబ్బంది, వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వైద్యులు లేరు.. వసతులు లేవు



వలేటివారిపాలెం ప్రాంతీయ పశవైద్యశాల పరిధిలోని పోకూరు, లింగసముద్రం, వీఆర్‌కోటలో పశువైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నాం. పోకూరు పశువైద్యశాల భవనం పునఃనిర్మాణానికి, మరుగుదొడ్లు తదితర వసతులకు ప్రతిపాదనలు పంపించాం. వలేటివారిపాలెంలో ప్రాంతీయ పశువైద్యశాల స్థాయికి తగ్గట్లుగా వసతులు లేవు. వసతులు కల్పించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- డాక్టర్ చెన్న కేశవులు, ఏడీ, వలేటివారిపాలెం

గురుపూర్ణిమ వేడుకలు ప్రారంభం



ఓంకారం ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు, భక్తులు

కావలి(టౌన్), జూలై 8(ఆంధ్రజ్యోతి): ముసునూరు మందాటి చెరువు వద్ద వెలసిన శ్రీసాయి క్షేత్రంలో మంగళవారం గురుపూర్ణిమ వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రీ సాయి క్షేత్రం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు పర్యవేక్షణలో మంగళవారం ఉదయం కాకడ హారతి అనంతరం ఓంకార ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. సాయినాథుడిని ప్రత్యేకంగా అలంకరించి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర నామార్చన, మధ్యాహ్న హారతి, ప్రసాద వినియోగం జరిగింది. భక్తులు బాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు



లింగసముద్రంలో పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

లింగసముద్రం, జూలై 8(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని మీసేవా కేంద్రం వద్ద పగిలిన మంచినీటి పైపులన్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది మరమ్మతులు చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన మడుగు కాదు.. రోడ్డే వార్తకు ఆర్‌డబ్ల్యూఎస్ మండల అధికారులు స్పందించారు. ఉదయం ఎక్స్‌కవేటర్‌తో బురద మట్టిని తీసివేసి, పగిలిన మంచినీటి పైపులైన్‌ను తొలగించి కొత్త పైపులైన్ వేశారు. అనంతరం మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో లింగసముద్రం ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

అట్టహాసంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



కావలి : వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమర్ రెడ్డి, తదితరులు

కావలి(టౌన్), జూలై 8(ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు మంగళవారం పట్టణంలో అట్టహాసంగా జరిగాయి. ట్రంకురోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేయగా నేతలు, అభిమానులు ఆయనకు తినిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేతలు ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

● **వలేటివారిపాలెం** : స్థానిక వైసీపీ కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి వైసీపీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వైసీపీ మండల అధ్యక్షుడు అనుమోల లక్ష్మీనరసింహం కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకు వెంకట స్వామి, నల్లమోతు చంద్రమౌళి, నాగిరెడ్డి శివ రామిరెడ్డి, పొట్టేళ్ల కృష్ణయ్య, చింతలపూడి రవీంద్ర, కట్టా హనుమంతరావు, గుత్తా గోపి, తదితరులు పాల్గొన్నారు.

● **బిట్రగుంట** : బోగోలు మండల వైసీపీ అధ్యక్షుడు ఎం.వీరరఘు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయింతి వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ ఎం.సుజాత, జడ్పీటీసీ కీర్తన, ఎంపీటీసీ ఎం.పద్మమ్మలు కేక్‌కట్ చేశారు. అనంతరం బజారు కూడలలోని డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీ.సులోచనమ్మ, అంకులయ్య, ఎం.సాల్మన్‌రాజు, శ్రీనివాసులు, ఏకే జసుందర్‌రాజ్, గిరిబాబు, మల్లారెడ్డి, నవాజ్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

● **లింగసముద్రం** : స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య మందిరం ఎదురుగా ఉన్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వైసీపీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పేదలకు పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, నాయకులు పీ తిరుపతిరెడ్డి, దగ్గు వెంకటేశ్వర్లు, చీమల శ్రీనివాసులు, షేక్ షఫి, సూరం కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● **అల్లూరు** : స్థానిక పాతబస్టాండు కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, నీలం సాయికుమార్, మేడా మాధవ, బీద రమేష్, మోమిడి మాధవరావు, ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బీవీ పట్టాభిరామ్ మరణం తీరనిలోటు



పట్టాభిరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు, జేవీవీ నేతలు

కావలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలకుడు, హిప్నోటిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ మరణం విజ్ఞానవంతమైన సమాజం కోరుకునే వారికి తీరని లోటని కావలికి చెందిన మెజీషియన్, కళారత్న వీ.మాధవ రావు తెలిపారు. రెడ్‌క్రాస్ భవనంలో మంగళవారం రెడ్‌క్రాస్, జేవీవీ, పట్టాభిరామ్ అభిమానులు సంతాపసభ నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవి ప్రకాష్, వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, జేవీవీ కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, రొటేరియన్ నల్లూరు రవి కుమార్, టీంసేవియర్స్ ప్రణీత్, జేవీవీ సభ్యులు కల్లయ్య, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలు ఆధార్ క్యాంపులు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సుధాకర్

వలేటివారిపాలెం, జూలై 8(ఆంధ్రజ్యోతి) : ఎస్టీల పిల్లలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో సుధాకర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన సచివాలయ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ సచివాలయాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకూ ఎస్టీల పిల్లలకు ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పుట్టినబిడ్డ నుంచి 6 ఏళ్ల వయస్సు లోపు పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రంలో పేరు కలిగిన పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్టీల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, ఈవోఆర్డీ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లూరు, (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి యువత అభివృద్ధి కోసం ప్రవేశపెట్టే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. ఇస్కపల్లి సచివాలయ ప్రాంగణంలో మంగళవారం కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ డీఈఏ ఫండ్ సహకారంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సంస్థ చేపట్టిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా యువతకు అనేక రుణపథకాలను ప్రవేశపెడుతుందన్నారు. సీఎఫ్ఐ కౌన్సిలర్ సయ్యద్ నయాబ్ బాషా మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ మేనేజరు గౌతమ్, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.



రీసర్వేలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

● లక్ష్మీనారాయణ, తహసీల్దారు, అల్లూరు.

అల్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో ఏర్పడిన భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాం. మండలంలోని గోగుల పల్లి రెవెన్యూలో సమస్యలు అధికంగా ఉన్నాయి. ఇప్పటికే కొన్ని సమస్యలు పరిష్కరించాం. ఇంకా అనేక సమస్యలు ఉన్నాయి. వీటిని పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు.

? అన్ని గ్రామాల్లో రీసర్వే చేపట్టారా.

! మండలంలో అల్లూరు, అల్లూరు పేట, సింగపేట గ్రామాల్లో రీసర్వే జరగలేదు. వీటిని రీసర్వే చేపట్టాలంటే దాదాపు 20 సర్వే టీమ్‌లు అవసరం. మరో నెలరోజుల్లో సింగపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని భూములకు రీసర్వే ప్రారంభిస్తాం.

? రీసర్వేలో ఏర్పడిన భూ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! రీసర్వేలో ఏర్పడిన భూ సమస్యలను అనుకున్న మేరకు కాకపోయినా వీలైనన్ని పరిష్కరిస్తున్నాం. అత్యధికంగా మండలంలోని గోగులపల్లి పంచాయతీలో సమస్యలు ఉన్నందున కావలి ఆర్డీవో పర్యవేక్షణలో ఒక రోజు గ్రామసభ ఏర్పాటు చేసి వీలైనన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

? నీటి తీరువా బకాయిలు ఎంత ఉన్నాయి. వసూలు చేస్తున్నారా.

! మండలంలో నీటితీరువా రూ.1.80 కోట్లు డిమాండ్ ఉంది. ఇప్పటి వరకు రూ.40 లక్షలు వసూలు చేశాం. మిగిలిన రూ.1.40 కోట్ల వసూళ్లకు ఆన్‌లైన్ ప్రక్రియ ఆగినందున ఆలస్యమైంది. త్వరితగతిన వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చుండిలో ఇంటింటికి కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

వలేటివారిపాలెం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని కందుకూరు నియోజకవర్గం తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కామినేని అశోక్ తెలిపారు. మండలంలోని చుండిలోని 11వ బూత్‌లో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వం ఈ ఏడాదిలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చొప్పర రాఘవులు, మేకల అశోక్, కామినేని అనిల్, కామినేని వీరయ్య, కామినేని బాలకృష్ణ, చొప్పర మాల్యాద్రి పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 4 ఎకరాల సరుగుడు తోట దగ్ధం

● రూ.10 లక్షల ఆస్తి నష్టం

కందుకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో 4 ఎకరాల సరుగుడు తోట పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన కె.సుబ్బరామయ్య, పులిచర్ల రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు అనే రైతులకు సంబంధించిన 4 ఎకరాల సరుగుడు తోటలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సరుగుడు తోటల్లో మంటలు వ్యాపించడాన్ని గ్రామస్థులు ఆలస్యంగా గుర్తించటంతో అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఈ ప్రమాదంలో రైతులకు రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.

సింహపురి పులకింత

(5వ పేజీ తరువాయి)

చేసిన 9 గ్యాలరీలలోనూ రద్దీ రాత్రి 8గంటలపైన కూడా కొనసాగుతోంది. దర్గా మైదానం, స్వర్ణాల ఘాట్‌లను పరిశుభ్రంగా ఉంచేందుకు నగర పాలక సంస్థ, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది, తాగునీటి సరఫరా కోసం ఇంజనీర్లు, సిబ్బంది ప్రతి క్షణంలోనూ భక్తులకు సేవలు అందించారు. అలాగే భక్తుల భద్రత కోసం పోలీసు శాఖ భక్తులతో మమేకమై సేవలు అందించారు.

● అప్యాయంగా పలకరించుకుంటూ..

స్వర్ణాల ఘాట్‌లో కోరికల రొట్టెలను హిందూ ముస్లిం భాయ్ భాయ్ అనే విధంగా రొట్టెలు మార్చుకున్నారు. సౌభాగ్య రొట్టె.. ముజేబీ దేదో బహనా అంటూ ఆప్యాయంగా మహిళలు పిలుచుకోవడం కనిపించింది. పురుషులకు రొట్టెలు ఇస్తూ ముస్లిం మహిళలు ఇచ్చాకర్నే కేలియే.. రోటీ పకడో భాయ్ అనే పిలుపులు స్వర్ణాల ఘాట్ వద్ద వీనులవిందు చేశాయి. దాదాపు వీజీపీ క్యూలైన్లతోపాటు మహిళలు, పురుషులు క్యూలైన్లు అర్ధ కి.మీకుపైగా బారులు తీరింది. బారాషహీద్ భక్త బృందం, మిత్ర బృందం సభ్యులు భారీ స్థాయిలో వంటలు చేసి రాత్రి వరకు అందజేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, కమిషనర్ నందన్, ఇతర శాఖల ఉన్నతాధికారులు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు అధికారులకు, ఉత్సవ కమిటీలకు సూచనలు ఇస్తూ అప్రమత్తం చేశారు.

మాదిగ జాతికి దేవుడిచ్చిన వరం మంద కృష్ణ

● ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కావలి(టౌన్), జూలై 8(ఆంధ్రజ్యోతి) : మాదిగ జాతికి దేవుడిచ్చిన వరం మంద కృష్ణమాదిగ అని ఎంపీడీవో చేవూరు శ్రీదేవి అన్నారు. మంగళవారం అరుంధతీపాలెంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, కృష్ణమాదిగ జన్మదినం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మార్పీఎస్ జెండాను ఎంపీడీవో ఆవిష్కరించారు. సీనియర్ నాయకుడు చేవూరు మాల్యాద్రి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ నేత కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మంద వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కొప్పర్తి కొండయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు జీ.వెంకటేశ్వర్లు, సుకుమార్, సురేంద్ర, దేవకుమార్, నాయబ్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

చెరువులో కలప వేలం

కొండాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురం చెరువు కట్టపై కలపకు ఇరిగేషన్ అధికారులు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన మంచాల కొండలరావు రూ.1.84 లక్షలకు కలపను కొట్టుకునేందుకు దక్కించుకున్నారు. నిర్ణీత కాలపరిమితిలో చెరువులో ఉండే కలపను కొట్టి విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందని ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న వ్యాఖ్యలు హేయం



కావలి : మాట్లాడుతున్న బీజేపీ నేత భరత్‌కుమార్

జలదంకి, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు హేయమని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకటరామారావు మంగళవారం ఒకప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మహిళ అని కూడా చూడకుండా సంస్కారహీనంగా మాట్లాడడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులకు మహిళలంటే చులకన భావం అని, అధికారంలో ఉండగా అలానే వ్యవహరించారని, ప్రతిపక్షంలో కూడా వారి తీరుమారలేదని పేర్కొన్నారు. ఇకనైనా తీరుమార్చుకొని రాజకీయాల్లో కొనసాగాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే, ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై మండల టీడీపీ నాయకుడు చేవూరి జనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఎలాంటి అవినీతి మచ్చలేని వేమిరెడ్డి దంపతులను ఎదుర్కోలేక ప్రసన్న వ్యక్తిగత విమర్శలకు దిగడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు.

అలజడి సృష్టించటానికే...

కావలి : ప్రశాంతమైన జిల్లాలో అశాంతిని నెలకొల్పి అలజడలు సృష్టించి కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టాలనే కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి అనుచిత వాఖ్యలు చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ. భరత్‌కుమార్ తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాంలడుతూ రాష్ట్రంలో అలజడిలు సృష్టించి భయానక వాతావరణం కల్పించడానికి వైసీపీ నేతలు తాపత్రయపడుతున్నారన్నారు. అందుకు ప్రసన్న చేసిన వాఖ్యలే నిదర్శనమన్నారు. మహిళలను కించపరచటం, వారిని వ్యక్తిగతంగా టార్గెట్ చేయటం వైసీపీ నేతలకు పరిపాటిగా మారిందని ఇలాంటి వారిపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు వస్తాయన్నారు. రాజకీయ విమర్శలు చేయాలే కాని వ్యక్తిగతంగా మహిళా శాసన సభ్యురాలుపై సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడటం ప్రస్నకు తగదన్నారు ఈ మద్యకాలంలో జగన్మోహన్‌రెడ్డి ఎక్కడ పర్యటించినా అక్కడ గొడవలు చేయటం, శాంతిభద్రతలకు విఘాతం కల్పించటం ఒక పథకం ప్రకారం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు మంద కిరణ్‌కుమార్, పరుసు వెంకటేశ్వర్లు, వాయిగండ్ల వెంకటసుధీర్, కూరాకుల సవీంద్ర, మురళీ, కృష్ణ, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వ్యాఖ్యలు దురదృష్టకరం

కొండాపురం : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు హేయమని జిల్లా టెలికం బోర్డు అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ తాటికొండ అనూష మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలను ఎంతో గౌరవిస్తుంటే వైసీపీ నేతలు మాత్రం ఇప్పటికీ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయం మానుకొని వ్యక్తిగత దూషణలకు పాల్పడటం దారుణమని తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పేద, బడుగు బలహీనవర్గాలను ఆదుకునేందుకు ఎల్లప్పుడూ ముందుంటుందని, ఆమె ఆత్మ గౌరవనాన్ని కించపరచేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆ విధంగా మట్లాడిన ప్రసన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



అన్నా.. మాకూ రొట్టె ఇవ్వు!



మంగళవారం తెల్లవారు జామున గుర్రంపై గంధం ఊరేగింపు







బారాషహీద్ దర్గా ప్రాంగణంలో నోరూరించే ప్రసాదాల విక్రయాలు

ఏఎస్‌పేటలో భక్తుల రద్దీ

ఏఎస్‌పేట,జూలై8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బారా షాహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా ఏఎస్‌పేటకు భక్తుల రద్దీ పెరిగింది. దీంతో గ్రామంలో సందడి నెలకొంది.దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు దర్గాలోని సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్,హబీబాల సమాధుల దర్శనం కోసం బారులు తీరారు.దీంతో దర్గా ఆవరణ మంతా భక్తుతో కళకళలాడింది. భక్తులు దర్గాలోని సమాధులపై పూలు, గలేపాలు కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తుల సౌకర్యం కోసం దర్గా ఈవో హసేన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేలాదిగా వాహనాలు,భక్తులు రావడంతో సంగం సీఐ వేమారెడ్డి, ఏఎస్‌పేట ఎస్‌ఐ సైదులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రించారు.

యాత్రికులకు వైద్య ఆరోగ్య శాఖ సేవలు



రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న సర్వెలెన్స్ అధికారి డాక్టర్ భాస్కర్‌రావు

నెల్లూరు (వైద్యం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : బారా షహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగలో పాల్గొంటున్న యాత్రికుల కోసం వైద్య ఆరోగ్యశాఖ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తోంది. ఇందులో మంగళవారం జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా సర్వైలెన్స్ అధికారి డాక్టర్ భాస్కర్‌రావు వైద్య సేవలు అందించారు. ఈ శిబిరం ద్వారా మూడు రోజుల్లో రెండు వేల మందికిపైగా భక్తులకు వైద్య చికిత్సలు అందించగా 8 మందిని మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ శిబిరంలో డాక్టర్ తులసీ కుమారి, డాక్టర్ ఫాసిల్‌ఖాను, డాక్టర్ కిశోర్‌శ్రీరామ్, డాక్టర్ శిరీషా, డాక్టర్ కల్యాణి, డిప్యూటీ హెచ్‌ఈవోలు సుధాకర్‌రావు, హరిప్రసాద్, హెచ్‌ఈవోలు రవికుమార్, బ్రహ్మారెడ్డి, శశి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రొట్టెల పండుగ

ఉదయగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్ద చెరువులో మంగళవారం రొట్టెల పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంతోపాటు మండలంలోని దాసరిపల్లి, మాసాయిపేట, వెంగళరావునగర్, బిజ్జంపల్లి, గండిపాళెం తదితర గ్రామాలకు చెందిన హిందూ, ముస్లిం లుఅధికసంఖ్యలో పాల్గొని రొట్టెలు మార్చుకున్నారు. వివాహం, ఉద్యోగం, ఆరోగ్యం రొట్టెలకు గిరాకీ ఏర్పడింది. ఈ సందర్భంగా పత్తర్‌ఖబర్ దర్గాలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.



ఉదయగిరిలో రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

పారిశుధ్యానికి ప్రాధాన్యం



రోడ్డు శుభ్రం చేస్తున్న కార్మికులు

నెల్లూరు(సిటీ), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : భక్తులు లక్షల సంఖ్యలో తరలి వస్తున్న రొట్టెల పండుగలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా కార్పొరేషన్ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సుమారు ఆరు వేల మంది ప్రైవేట్ కార్మికులతో ఏడు జోన్లుగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య అధికారి డాక్టర్ చైతన్య, సూపర్‌వైజర్లు, సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు షిఫ్ట్‌ల వారీగా పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ, దుర్వాసన, అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లుతున్నారు. పార్కింగ్ ప్రదేశాలు, షవర్ల వద్ద మొబైల్ టాయిలెట్లను అందుబాటులో ఉంచిన కార్పొరేషన్ అధికారులు అక్కడ కూడా నిత్యం పారిశుధ్య పనులు చేపడుతున్నారు.



డస్ట్‌బిన్ వద్ద బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయ హుండీ లెక్కింపు

బిట్రగుంట, జూలై 8(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కిపు ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. దేవాదాయ శాఖ కోవూరు ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు పర్యవేక్షణలో హెచ్‌డీఎఫ్‌సీ కావలి బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ, సిబ్బందితో పాటు వివిధ సేవా సంస్థల వారు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. 110 రోజులకు స్వామి, అమ్మవార్లకు భక్తులు అందచేసిన కానుకలు రూ.17,45,900 వచ్చాయని ఈవో రాధాకృష్ణ తెలిపారు.



శ్రీవారి హుండీ లెక్కిస్తున్న బ్యాంకు సిబ్బంది

ఇండోసోల్ భూసేకరణ జీవోను ఉపసంహరించుకోవాలి

- రాష్ట్ర రైతు కూలీ సంఘం నాయకుల డిమాండ్



కరేడు రైతులతో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నాయకురాళ్లు లలితకుమారి, సునీత, తదితరులు

ఉలవపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ సోలార్ పవర్ ప్రాజెక్టు కోసం తలపెట్టిన బలవంతపు భూసేకరణ జీవోను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకురాలు ఎస్.లలితకుమారి, జిల్లా కార్యదర్శి జీ.సునీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కరేడు గ్రామాన్ని సందర్శించిన వారు గ్రామస్థులు, వ్యవసాయ కూలీలను కలిసి మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ కరేడు పంచాయతీ పరిధిలోని 16 గ్రామాల మహిళలు, రైతులు, పిల్లలు, పెద్దలు మూకుమ్మడిగా మా భూములు, ఇళ్ల వదులుకోము అని ముక్తకంఠంతో ఆందోళన చేయడం ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. సమాజానికి ఆహార భద్రత సమకూర్చే రైతులను బెదిరించి బలవంతపు భూసేకరణ కోసమే రైతులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. కార్పొరేట్ శక్తులకు భూ పందేరం చేసేందుకే ఈ బలవంతపు భూసేకరణకు కూటమి ప్రభుత్వం పూనుకుందని, రైతుల ఆందోళనకు రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకత్వం అండగా ఉంటుందన్నారు. రైతుల న్యాయ పోరాటంలో రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్టీయూ న్యూ నాయకులు లక్ష్మీరెడ్డి, రైతుకూలీ సంఘం నాయకులు శివ రామ కృష్ణయ్య, కోడూరి కోటేశ్వరరావు, శ్రీరాములు, బక్కా శ్రీను, కరుణ, సుల్తాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌కు ప్రోత్సాహం

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలను అందిస్తోంది. మొక్కల కొనుగోలు నుంచి ఎరువులు, అంతర పంటల సాగుతో పాటు మార్కెట్ సదుపాయం వరకు అన్నీ సౌకర్యాలు కల్పిస్తోంది. గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి రాయితీలు ఇవ్వకపోవడంతో రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉద్యానశాఖ ద్వారా రాయితీపై మొక్కలు అందిస్తోంది. 100శాతం రాయితీ అందించడంతో జిల్లా రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

- 100శాతం రాయితీ
- 1400 హెక్టార్లలో సాగు లక్ష్యం
- ఇప్పటికే వెయ్యి హెక్టార్లలో పంట





ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి(ఫైల్)

నెల్లూరు(వ్యవసాయం), జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే వింజమూరు, దుత్తలూరు, ఆత్మకూరు, సంగం, కావలి, జలదంకి మండలాల్లో దాదాపుగా వెయ్యి హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగవుతోంది. ఈఏడాది మరో 1400 హెక్టార్లలో పంట సాగుచేయించాలని ఉద్యానశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి సంబంధించి రైతు సేవా కేంద్రాల నుంచి దరఖాస్తులు కూడా తీసుకుంటున్నారు. ఒక్కో ఎకరాకి 57 మొక్కలు త్రికోణాకార పద్ధతిలో నాటుకోవాల్సి ఉంటుంది. ఈ మొక్కల సరఫరాకు సంబంధించి 3ఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ, అమ్మా పామ్ ప్లాంటేషన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలను ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది. ఇండిజినస్ ఆయిల్ పామ్ సాగుకు నాలుగేళ్లకు రూ.62వేలు, ఇంపోర్టెడ్ ఆయిల్‌పామ్ సాగుకు రూ.71వేలు రైతులకు రాయితీ అందిస్తోంది. అంతేకాకుండా యాంత్రీకరణ, నీటి వసతి పరికరాలకు రూ.20వేల నుంచి రూ.1.50 లక్షల వరకు రాయితీ ఇస్తోంది. అయితే మొదటి మూడు సంవత్సరాలు పంటను పెంచేందుకు సమయం పడుతుంది. భూసారం, మొక్క ఎదుగుదలను బట్టి నాలుగో సంవత్సరం నుంచి ఫలసాయం చేతికందే అవకాశం ఉంది.

రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం నూరు శాతం రాయితీ ఇస్తోంది. మార్కెట్‌లోనూ మంచి ధర పలుకుతోంది. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జెరాక్సు కాపీలతో రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. నీటి వసతి ఉన్న రైతులకు ఈసాగు ఎంతో లాభదాయకం.

- సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

మార్కెట్ సదుపాయం కూడా..

ఆయిల్ పామ్ మొదటి కాపు ఎకరానికి దాదాపు 3 నుంచి 4 టన్నులు వచ్చే అవకాశం ఉన్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ఎనిమిదేళ్ల వయసున్న తోటల్లో ఎకరానికి 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. జిల్లా రైతులకు మొక్కలను అందిస్తున్న సంస్థలే పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. గతంలో టన్ను రూ.14వేలున్న ఆయిల్ పామ్ ధర ప్రస్తుతం రూ.17వేలకుపైగా మార్కెట్‌లో రేటు పలుకుతోంది.

ఏలూరుపాడులో రెండు ఇళ్లల్లో చోరీ

గుడ్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏలూరుపాడులో సోమవారం అర్ధరాత్రి రెండు ఇళ్లల్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు, పోలీసుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన నాగసూరి మురళీకృష్ణ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం నాగూర్ నాగపట్నంకు బయలుదేరి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరనిది గ్రహించిన గుర్తుతెలియని దుండగులు అదే రోజు రాత్రి ఆ ఇంట్లోకి జొరబడి బీరువాలో దాచుకున్న అరకేజీ వెండి, రెండున్నర సవర్ల బంగారంతోపాటు రూ.70 వేల అపహరించుకెళ్లారు. అలాగే మురళీకృష్ణ ఇంటి పక్కన నివాసం ఉండే చేవూరి శ్రీనయ్య కూడా సొంత పనుల నిమిత్తం కొద్ది రోజుల క్రింత హైదరాబాద్ వెళ్లగా అతని ఇంట్లోకి ప్రవేశంచి రెండున్న రసవర్ల బంగారం, రూ.17 వేల అపహరించుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న రెండు కుటుంబాల బాధితులు వారి బంధువుల ద్వారా ఇళ్లల్లో ఉంచిన నగదు, బంగారు వివరాలు చెప్పి చూడమనగా అవి లేకపోవడంతో లబోదిబోమంటు న్నారు. ఈ చోరీపై సమచారం అందుకున్న ఎస్‌ఐ వెంకట్రావు సం ఘటన స్థలానికి చేరుకొని, దొంగ తనం జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నెల్లూరు రూరల్. జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని జొన్నవాడ సర్కిల్ వద్ద నెల్లూరు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. మంగళ వారం స్థానికుల సమాచారంతో ఘటన స్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలిం చామన్నారు. 40 ఏళ్ల వ్యక్తి మరణించి 5-6 రోజులు అవుతోందని తెలిపారు. జీజీహెచ్ మార్చురీకి మృతదేహాన్ని తరలించామని, గుర్తించిన వారు రూరల్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అమ్మా.. మీరు తప్పకుండా రావాలి... పేరంటానికి కాదండోయ్.. 'పేరెంట్స్ మీటింగ్'కి!

ఈ చిత్రంలో ఓ మహిళ ఇంకో మహిళకు బొట్టు పెడుతోంది.. ఎందుకో తెలుసా? ఆ ఏముందిలే.. గృహప్రవేశానికో, పెళ్ళికో బొట్టు పెట్టి పిలవడం సంప్రదాయం కదా.. అనుకుంటున్నారా..? అయితే.. మరి పిల్లలతో కలిసివచ్చి ఎందుకు ఆహ్వానిస్తున్నట్లు..? ఇదే కదా.. మీ డౌట్? నిజమే.. ఆమె బొట్టు పెట్టి పిలుస్తున్నది.. వాళ్లింట్లో జరిగే పెళ్లికో.. పేరంటానికో కానే కాదు! ఈనెల 10న ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు కదా... అందుకే.. మంగళవారం మడమనూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులు విద్యార్థినులతో కలిసి ఇదిగో.. ఇలా ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల ఇళ్ళ వద్దకు వెళ్ళి బొట్టుపెట్టి.. లేఖలు అందించి మరీ ఆహ్వానిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా సమావేశానికి అందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు జరగడమే అరుదు.. అలాంటిది ఒక వేడుకలాగా.. కొత్త ఆలోచనలకు.. ఆవిష్కరణలకు నాంది పలకడం విశేషం. అభినందనీయం కూడా!

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)



బొట్టు పెట్టి ఆహ్వానం పలుకుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఏకం కావాలి

- ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ



మాట్లాడుతున్న ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ

కావలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యల పరిష్కారానికి, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలన్నీ ఒక తాటిపైకి రావాలని ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ పిలుపునిచ్చారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లా తాడేపల్లి సీఎస్ ఆర్ కల్యాణ మండపంలో ఈనెల 12న జరగనున్న ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ హాజరువుతున్నారన్నారు. ఆయన చేపట్టిన వర్గీకరణ పోరాటం భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని, ఆయన కృషి వలనే మిగతా కులాలకు కూడా ప్రయోజనం కలిగిందన్నారు. దళితుల సమస్యలకు ఉమ్మడి వేదిక ద్వారానే పరిష్కారం లభిస్తోందన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. వర్గీకరణతో మంచి జరిగిందని భావించే ఎస్సీ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. విడిపోయిన కులాలు, సంఘాలు ఒకే వేదికపైకి రావడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందని, సమాజంలో సామాజిక న్యాయం కోరుకునే ప్రతి ఉద్యోగి ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. వర్గీకరణకు సహకరించిన బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సమావేశంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొప్పర్తి కొండయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, బెజవాడ పాపయ్య, మంద వెంకటేశ్వర్లు, అక్కిలిగుంట యేసు రత్నం, గంటా చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 29.417 టీఎంసీల నీరు

అనంతసాగరం జూలై 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 185 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, 29.417 టీఎం సీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కండలేరు నీటిమట్టం

రాపూరు: కండలేరు పూర్తి స్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 31.397 టీఎంసీలని కండలేరు డ్యామ్ ఏఈ కే.తిరుమలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో ఆగిపోగా, అవుట్‌ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2400 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయీస్ నుంచి 70 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుంచి 70 క్యూసె క్కులుగా ఉందని ఆయన తెలిపారు.

రాష్ట్ర చరిత్రలో బ్లాక్ డే

- ప్రసన్న క్షమాపణలు చెప్పాలి
- అజీజ్, రాంభూపాల్, కోటంరెడ్డి, జెడ్‌ఎస్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్, రాంభూపాల్‌రెడ్డి, కోటంరెడ్డి, శివప్రసాద్ తదితరులు

నెల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ జెడ్ శివప్రసాద్ ఖండించారు. మహిళా ఎమ్మెల్యేలపై నీచంగా మాట్లాడటం ఒక బ్లాక్ డే అని వారు అభిప్రాయపడ్డారు. ఏ ఆడబిడ్డా ఈ వ్యాఖ్యలను సహించదని అన్నారు. మంగళవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి వంటి వారు ప్రసన్న వ్యాఖ్యలను వారి ఇంట్లో వాళ్లకి వినిపించిన తర్వాత సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని, కానీ వ్యక్తిత్వ హననం చేయడం దుర్మార్గమన్నారు. ప్రసన్న ఇంటిపై దాడికి, టీడీపీకి సంబంధం లేదని చెప్పారు. టీడీపీ నేతలు తమ కంట్రోల్లో ఉంటారని, కానీ ప్రసన్న ఇంటిపై దాడి చేసింది వేమిరెడ్డి అభిమానులై ఉండవచ్చునన్నారు. నీచంగా మాట్లాడితే అభిమానులు సహించరని అన్నారు. ప్రసన్న తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని, ప్రశాంతిరెడ్డికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

అలా మాట్లాడడం దారుణం : నారాయణ

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సంస్కార రహితంగా మాట్లాడటం దారుణమని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఒక ప్రకటనలో ఖండించారు. మహిళలపై నోరుపారేసుకోవడం వైసీపీ నేతలకు కొత్తేమీ కాదని, జగన్మోహన్‌రెడ్డే తన సొంత చెల్లెల్ని దుర్భాషలాడారని నారాయణ గుర్తు చేశారు. వైసీపీ అధినేత బాటలోనే వారి నాయకులు కూడా నడుస్తున్నారని విమర్శించారు. మహిళల మీద వైసీపీ నేతలకు ఎలాంటి అభిప్రాయం ఉందో మరోసారి బయటపడిందన్నారు. మహిళలను అగౌరవంగా మాట్లాడే వైసీపీ నేతలను ప్రజా జీవితం నుంచి బహిష్కరించాలని పేర్కొన్నారు.

ఆ కుటుంబ ప్రతిష్టను మంటగల్పారు : బీద

ప్రసన్నకుమార్‌రెడ్డి తన మకిలి వ్యాఖ్యలతో నల్లపరెడ్డి కుటుంబ ప్రతిష్టను మంటగల్పారని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్య లు అత్యంత దారుణమని, వీటిని మహిళాలోకం క్షమించదని అన్నా రు. పాలనా పరంగా ప్రశాంతిరెడ్డిని విమర్శించేందుకు అవకాశం లేకపోవడంతో మతిభ్రమించి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. సాయం చేసిన వారిని తిట్టడం ప్రసన్నకు అలవాటేనన్నారు. నాడు ప్రశాంతిరెడ్డిని ఇదే ప్రసన్నకుమార్‌రెడ్డి దేవతతో పోల్చారని బీద గుర్తు చేశారు. ప్రసన్నకు ప్రజలు బుద్ధి చెప్పినా వక్ర బుద్ధి మాత్రం మారలేదంటూ దుయ్యబట్టారు.

సమాజం క్షమించదు : సోమిరెడ్డి

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే ప్రసన్న వ్యాఖ్యలను సభ్యసమాజం క్షమించదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పొదలకూరులో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లపరెడ్డి కుటుంబం పేరును భ్రష్టు పట్టిస్తున్నాడన్నారు. రాజకీయాల్లో ప్రసన్న లాంటి వ్యక్తిని ఎప్పుడూ చూడలేదన్నారు. ఇప్పటికైనా ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసీపీలో ఉన్నప్పుడు పొగడ్తలతో ముంచెత్తాడని, హోమాలు చేయించాడు.. దానకర్ణులని కీర్తించాడని.. ఆదర్శ దంపతులని పొగడ్తల వర్షం కురిపించాడన్నారు. ఇప్పుడేమో ఒక మహిళా ఎమ్మెల్యేని నోటికొచ్చినట్లు మాట్లాడటం చాలా దుర్మార్గమని, ప్రసన్నకుమార్‌రెడ్డి ఒళ్లు కొవ్వెక్కి మాట్లాడినట్లుగా ఉందన్నారు. షర్మిల పాదయాత్ర చేసిన సమయంలో బుచ్చిరెడ్డిపాలెం మీటింగ్‌లో చంద్రబాబును చెట్టుకు కట్టేసి కొట్టాలని మాట్లాడారన్నారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిని మొదట దుర్మార్గంగా మాట్లాడారని.. ఆ తర్వాత ఆయన కాళ్లు పట్టుకుని ఆశీర్వదించమని కోరాడన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సురేంద్ర, మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, దేవినేని శరత్ తదితరులు పాల్గొన్నారు.